బుధవారం
21-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 239
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మెలిటోపోల్‌లో స్టాలిన్ విగ్రహావిష్కరణ

మాస్కో: సోవియట్ నాయకుడు జోసెఫ్ స్టాలిన్ విగ్రహాన్ని ఉక్రెయిన్‌లోని రష్యా అధీనంలోని మెలిటోపోల్, జపోరిజ్జియా ఓబ్లాస్ట్‌లో ఏర్పాటు చేశారు. విక్టరీ డే 80వ వార్షికోత్సవం సందర్భంగా విగ్రహావిష్కరణ జరిగింది. నాజీలపై సోవియట్ ప్రజల విజయానికి స్ఫూర్తిప్రదాత, సోవియట్ యూనియన్ జనరల్ జోసెఫ్ స్టాలిన్ అని విగ్రహం కింద పలకపై ఉంది. రష్యా అధికారులు, స్కూలు పిల్లలు పాల్గొని... స్టాలిన్‌కు పుష్పాంజలి ఘటించారు.

ఖగోళ శాస్త్రవేత్త నార్లికర్ కన్నుమూత

న్యూదిల్లీ: ప్రముఖ ఖగోళ, సైన్స్ కమ్యూనికేషన్ శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. భారతీయ విజ్ఞాన శాస్త్రంలో ఒక మహోన్నత వ్యక్తిగా ప్రసిద్ది చెందారు. డాక్టర్ నార్లికర్ పూణేలో మంగళవారం తెల్లవారుజామున నిద్రలోనే మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన ఇటీవల ఆసుపత్రిలో తుంటి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జూలై 19, 1938న జన్మించిన

- మిగతా 2 లో

ఐబీ చీఫ్ పదవీకాలం పొడిగింపు

న్యూదిల్లీ: ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధిపతి తపన్ కుమార్ దేఖా పదవీకాలాన్ని కేంద్రం మరో ఏడాది పొడిగించింది. ఆయన పదవీకాలాన్ని పొడిగించడం వరుసగా ఇది రెండవసారి. ఐబీ చీఫ్‌గా తపన్ కుమార్ దేఖా పదవీకాలాన్ని జూన్ 2026 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు... ఏది ముందుగా వస్తే అప్పటి వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపినట్లు కేబినెట్ వ్యవహారాల కమిటీ మంగళశారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. 1988

- మిగతా 2 లో

4 రోజుల్లో కేరళకు రుతుపవనాలు

న్యూదిల్లీ: నైరుతి రుతుపవనాల ఆగమనంపై భారత వాతవరణ శాఖ (ఐఎండీ) కీలక సమాచారం ఇచ్చింది. మరో 4,5 రోజుల్లో కేరళను తాకనున్నాయని ఐఎండీ ప్రకటించింది. నైరుతి రుతుపవనాలకు కేరళలో పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నట్లు తెలిపింది. ఇంతకు ముందు మే 27 కల్లా రుతుపవనాలు కేరళను తాకే అవకాశాలు ఉన్నట్లు చెప్పిన ఐఎండీ, ఇప్పుడు అంతకంటే ముందే రానున్నట్లు వెల్లడించింది. అలా జరిగితే 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం మొదటిసారి కానుంది. ఇక ఈ సంవత్సరం సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏమయ్యా.. జూన్ నుంచి ఎలర్ట్‌గా ఉండండి. సీఎం గారు వచ్చే ముందు దండలు తెప్పించి స్వాగత బేనర్లు ఏర్పాటు చేయించండి!



కేసీఆర్, హరీశ్, ఈటలకు నోటీసులు

15 రోజుల గడువు ఇచ్చిన కాళేశ్వరం విచారణ కమిషన్

విశాలాంధ్ర-హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు జారీ అయ్యాయి. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కాళ్వేస్వరం విచారణ కమిషన్ మంగళవారం కేసీఆర్‌తో పాటు, ఆయన హయాంలో మంత్రులుగా ఉన్న హరీశ్ రావు, ప్రస్తుతం బీజేపీ ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా నోటీసులిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాలపై వివరణకు 15 రోజుల గడువు ఇచ్చింది. తమ ఎదుట హాజరై తమ పక్షాన్ని ఉంచాలని సూచించింది. ఇందుకోసం నిర్దిష్ట తేదీలనూ కమిషన్ ఖరారు చేసింది. జూన్ 5న విచారణకు హాజరు కావాలని కేసీఆర్ కు ఆదేశాలిచ్చింది. అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు జూన్ 6న, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణకు న్యాయ విచారణ కమిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్... ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, డిజైన్, నాణ్యత, పే అండ్ అకౌంట్స్, నీటి పారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తోంది. కాగా, రాష్ట్ర

- మిగతా 2 లో

భారత ప్రధాని ట్రంపా... మోదీనా?

- మావోయిస్టులతో కయ్యం... ఉగ్రవాదులతో నెయ్యం
- అందాల భామల చుట్టూ తెలంగాణ మంత్రులు
- కగార్‌పై శ్వేతపత్రం ఇవ్వండి
- నారాయణ, కూనంనేని డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: మోదీ సర్కారుకు ఉగ్రవాదులపై ఉన్న ప్రేమ...ఈ దేశపౌరులైన మావోయిస్టులపై కనిపించడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఈ దేశానికి ప్రమాదం ఉగ్రవాదులతోనా లేక మావోయిస్టులతోనా అని ప్రశ్నించారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు గల భారత దేశానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డీఫ్యాక్టో ప్రధానిగా వ్యవహరిస్తుండగా... నరేంద్రమోదీ డమ్మీ ప్రధానిగా ఉన్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి మావోయిస్టులపై గల ద్వేషం, కసి... ఉగ్రవాదులపై కనిపించడం లేదని, అందుకే టెర్రరిస్టులతో చర్చలకు సిద్ధమైన కేంద్రం... మావోయిస్టులతో శాంతిచర్చలపై స్పందించడం లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ, కూనంనేని సాంబశివరావు మాట్లాడారు.

ట్రంప్ ఆదేశాలను ప్రధాని మోదీ పాటించడం దేశానికే అవమానకరమని నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. భారతదేశ పాలసీలను నిర్దేశిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను ట్రంప్ శాసించే ప్రయత్నం చేస్తుంటే... దానిని అడ్డుకోవాల్సిన మోదీ మౌనం వహిస్తుండడం సిగ్గుచేటన్నారు. ఉగ్రవాదులు బహిరంగంగా తుపాకులు పట్టుకొని తిరుగుతుంటే నిఘావర్గాలు ఏమి చేస్తున్నాయని నారాయణ ప్రశ్నించారు. ఉగ్రవాదులు లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని, కానీ మోదీ మాత్రం ఉగ్రవాదులను అడ్డుపెట్టుకుని సొంత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టెర్రరిస్టులకు వ్యతిరేకంగా దేశం మొత్తం మద్దతు తెలిపితే... మోదీ మాత్రం ట్రంప్‌కు జైకొట్టి... ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని, ఇదేనా మోదీ దేశభక్తి అన్ని ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా వివిధ దేశాల మద్దతు కూడగట్టేందుకు ఏర్పాటు చేసిన దౌత్య బృందాల ప్రతినిధులను ప్రధానమంత్రి స్వయంగా ఎంపిక చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నారాయణ పేర్కొన్నారు. దౌత్య బృందాల ఏర్పాటుకు సంబంధించి సభ్యులను ఎంపిక చేసే బాధ్యత ఆయా రాజకీయ పార్టీలదని, కానీ కేంద్రమే సభ్యులను ఎంపిక చేయడం ఏమిటని నిలదీశారు. తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను విదేశాలకు పంపిస్తున్నారని, వారు అక్కడి నుంచి పంపే డబ్బుపై 5 శాతం పన్నుల పేరుతో అమెరికా దోచుకుంటుందని, ఇలాంటి అమెరికా విధానాన్ని మోదీ ఎందుకు వ్యతిరేకించడం లేదన్నారు. తన వల్లే ఐటీ అభివృద్ధి చెందినట్లు పదేపదే చెప్పుకుంటున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు...ఈ దేశ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే మోదీపై ఎందుకు వత్తిడి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. దేశం కోసం సర్వశక్తులు ఒడ్డి పోరాడుతున్న సైనికులను అవమానించిన బీజేపీ మంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికుల పట్ల బీజేపీ నాయకులు వ్యవహరించే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. కాగా, హైదరాబాద్ నగరమంతా ఇప్పుడు అందాల భామల చుట్టూ తిరుగుతోందని నారాయణ అన్నారు. ఆ భామల వెనక మంత్రులంతా సొల్లు కార్చుకుంటూ తిరుగుతున్నారని చురకలంటించారు. అందాల భామల కోసం కోట్లు ఖర్చుపెట్టేది సొల్లు కార్చుకోవడానికేనా అని నిలదీశారు.

ఆపరేషన్ కగార్‌పై శ్వేతపత్రం: కూనంనేని

ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతమంది మావోయిస్టులను చంపేశారు? ఇంకెంతమందిని చంపుతారు? కేంద్ర ప్రభుత్వం లక్ష్యం ఏమిటో శ్వేతప్రతం ద్వారా వెల్లడించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కగార్ ఆపరేషన్‌లో కేంద్రబలగాలతో పాటు రాష్ట్ర పోలీసులు పాల్గొంటున్నారని, అందువల్ల ఆపరేషన్ కగార్‌పై రాష్ట్ర ప్రభుత్వ విధానం ఏమిటో వెల్లడించాలని ఆయన కోరారు. అమాయక ప్రజలను కాల్చి చంపిన ఉగ్రవాదులతో చర్చలు జరుపుతామని ప్రకటించిన కేంద్రం... దేశ పౌరులైన మావోయిస్టులతో శాంతిచర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదని మోదీ సర్కారును నిలదీశారు.

ఇప్పటికే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన కేంద్ర పాలకులు...తాజాగా న్యాయ వ్యవస్థపైనా మాటల దాడి కొనసాగిస్తున్నారని కూనంనేని ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థల మధ్య హక్కులు, న్యాయపరమైన చిక్కులు తలెత్తినప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయని, వాటి పరిష్కరించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందన్నారు. ఇదే లేకపోతే పాలకుల ఆగడాలకు అంతుండదని అన్నారు. న్యాయవ్యవస్థను సైతం నిర్వీర్యం చేసేందుకు బీజేపీ

- మిగతా 2 లో

వక్ఫ్ భూముల్ని లాక్కోవడానికేనా?

- సవరణ చట్టంపై సుప్రీంలో వాడివేడి వాదనలు
- మతానికి ఆధారం అడుగుతారా?
- వెంటనే నిషేధం విధించండి: పిటిషనర్లు
- మూడు అంశాలకే విచారణ పరిమితం: కేంద్రం
- పార్లమెంటు ఆమోదించిన చట్టాలపై జోక్యం చేసుకోలేం: సీజేఐ
- విచారణ నేటికి వాయిదా

న్యూదిల్లీ: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం-2025పై మధ్యంతర నిషేధం విధించాలని దాఖలైన పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టులో మరోసారి వాడీవేడిగా వాదనలు సాగాయి. బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తొలుత సీజేఐ బీఆర్ గవాయ్ విచారణ ప్రారంభిస్తూ... ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప పార్లమెంట్ ఆమోదించిన చట్టాలపై తాము జోక్యం చేసుకోబోమని తెలిపారు. అనంతరం ఈ చట్టాన్ని సవాల్ చేయడానికి తగిన కారణాల్ని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఏకరువు పెట్టారు. ఆ తర్వాత ఈ పిటిషన్లపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి తమ వాదనలు వినిపిస్తూ... ఈ కేసును విచారించి, మధ్యంతర ఉపశమనం ఎక్కడ ఇవ్వవ్చో పరిశీలిస్తామని గత సీజేఐ (సంజీవ్ ఖాన్నా) చెప్పారని, అందువల్ల కేంద్రప్రభుత్వం కోరుతున్నట్లుగా కేవలం మూడు అంశాలకే తాము పరిమితమవుతామని చెప్పలేమన్నారు. వక్ఫ్ భూములను లాక్కోవడానికే చట్టం తెచ్చారని సిబాల్ వాదించారు. ఎలాంటి ప్రక్రియ లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశమన్నారు. వక్ఫ్‌ను క్రియేట్ చేయాలంటే ఒక వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాంలో ఉండాలనే షరతును సిబాల్ ప్రస్తావించారు. 'నేను మరణశయ్యపై ఉండి వక్ఫ్ ఏర్పాటు చేయాలనుకుంటుంటే ముస్లింగా ఉన్నట్టు ప్రూవ్ చేసుకోవాలి. ఇది రాజ్యాంగ విరుద్ధం' అని అన్నారు. ఇది కచ్చితంగా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునే చట్టమేనని వాదించారు. కేంద్రం తెచ్చిన వక్ఫ్ చట్టం కారణంగా సెంట్రల్ వక్ఫ్ బోర్డులో ముస్లింలు మైనార్టీలుగా మారుతున్నారని కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. 22 మంది సభ్యుల్లో 10 మంది ముస్లింలు ఉంటే మరో 10 మంది న్యాయనిపుణులు, అధికారులు ఉన్నారన్నారు. అలాగే కేంద్ర మైనార్టీ మంత్రి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఉన్న హిందూ, సిక్కు మత సంస్థల్లో హిందూయేతరులు కానీ ముస్లింలు కానీ ఒక్కరు కూడా లేరని తెలిపారు. వక్ఫ్ ఆస్తిని

- మిగతా 2 లో

తగ్గిన మెట్రో చార్జీలు

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో చార్జీలను సవరించారు. ఇటీవల పెంచిన చార్జీలను 10 శాతం మేర తగ్గించారు. ఈనెల 24వ తేదీ అనగా శనివారం నుంచి కొత్త చార్జీలు అమల్లోకి వస్తాయి. ఈ మేరకు ఎల్ అండ్ టీ సంస్థ వెల్లడించింది. కనీస చార్జీని రూ.10 నుంచి రూ.12కు, గరిష్ట చార్జీని రూ.60 నుంచి రూ.75కు హైదరాబాద్ మెట్రో సంస్థ ఇటీవల పెంచింది. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షాలు, వామపక్షాలు విమర్శించాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా చార్జీలపై పునరాలోచించాలని సూచించింది. ఈ పరిణామాలతో పెంచిన చార్జీల్లో 10 శాతం తగ్గించాలని ఎల్ అండ్ టీ సంస్థ నిర్ణయించింది.

ఈ ప్రశ్నలకు బదులేది?

దేశాన్ని చీకట్లో ఉంచి... విదేశాలకు వివరణా
పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఎందుకు నిర్వహించరు
ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రానికి డి.రాజా ప్రశ్నలు

న్యూదిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటు సమావేశాన్ని ఎందుకు నిర్వహించరు? ప్రధాని మోదీ ఎందుకు స్పష్టతివ్వరు? దేశాన్ని చీకట్లో ఉంచి విదేశాలకు వివరణ ఇవ్వడం ఏమిటి? అంటూ సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం కేంద్ర ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. దేశ ప్రజలను, పార్లమెంటును చీకట్లో ఉంచి... ప్రపంచ దేశాలకు బ్రీఫింగ్‌నకు తొలి ప్రాధాన్యతివ్వడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై వివరాలు తెలిపేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం పిలవాలని మరోమారు డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై స్పష్టత కొరవడినట్లు విమర్శలు వస్తుండగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అన్ని వివరాలు చెప్పడం మానేసి... విదేశాలకు అఖిలపక్ష బృందాలు పంపడానికి కసరత్తు చేస్తుండటం సరైనది కాదని రాజా ఎక్స్‌లో దుయ్యబట్టారు. ఆపరేషన్ సిందూర్‌లో యుద్ధ విమానాన్ని కోల్పోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రశ్నించడాన్ని సమర్థించారు. ఇలాంటి చాలా కీలక ప్రశ్నలకు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అందుకోసమే పార్లమెంటు ప్రత్యేక సమావేశం కోసం డిమాండ్ చేస్తున్నామన్నారు. 'పార్లమెంటు ముందుకు అన్ని అంశాలు తేవడానికి విముఖత ఎందుకని కేంద్రాన్ని ప్రశ్నించారు. పార్లమెంటును సమావేశపరిచితే రాహుల్ గాంధీ అనేక ప్రశ్నలు లేవనెత్తవచ్చు. నేను ప్రశ్నలు అడవచ్చు. ఇతర పార్టీల వారు ప్రశ్నించవచ్చు. పార్లమెంటు సమావేశాన్ని నిర్వహించకపోతే కేంద్రం ఈ ప్రశ్నలకు సమాధానం ఎలా ఇస్తుంది? ఇవన్నీ ప్రధానాంశాలు. వీటిపై చర్చ అవసరం' అని రాజా వక్కాణించారు. కాగా, మొత్తం ఏడు బృందాలను విదేశాలకు

- మిగతా 2 లో

మినీ అంగన్వాడీలకు పెంచిన జీతమేది?

రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలోని మినీ అంగన్వాడీ కార్యకర్తల మానసిక వేదన, వారి కుటుంబాల ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ విషయంలో ఆయన మంగళవారం ముఖ్యమంత్రికి ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారని, వీరంతా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల నిరుపేదలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో 2023 సెప్టెంబర్ 5న మినీ అంగన్వాడీ కార్యకర్తలకు అంగన్వాడీలుగా పదోన్నతి కల్పిస్తూ జీవో ఇవ్వగా... ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ఉత్తర్వులు అమల్లోకి రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సీతక్క ప్రమాణ స్వీకారం చేసి... మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తూ మొదటి సంతకం చేశారు కానీ బీఆర్ఎస్ ప్రభుత్వమిచ్చిన జీవోని కొత్తగా జారీ చేశారు. తద్వారా రాజకీయంగా లబ్ధిపొందాలని భావించారు. 2024 జనవరి-మార్చిలో అంగన్వాడీ పే గ్రేడ్‌లో రూ.13,650 జీతం చెల్లించిన ప్రభుత్వం, ఆ తర్వాత మినీ అంగన్వాడీల జీతం రూ.7,800కి తగ్గించి, 2025 ఏప్రిల్ వరకు అదే జీతం ఇచ్చిందని లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు. మూడు నెలలు అంగన్వాడీలుగా గుర్తించి, తిరిగి మినీ అంగన్వాడీ స్థాయి జీతాలివ్వడాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రైజింగ్ అంటూ జీతాలు తగ్గించడం సమంజసమా అని నిలదీశారు. మినీ అంగన్వాడీలు తమ హక్కుల కోసం మంత్రిని, అధికారులను కలిసినా స్పందనలేదన్నారు. బీఆర్ఎస్

- మిగతా 2 లో

బెంగళూరులో డిప్యూటీ సీఎం బిజీబిజీ

అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా పై అధ్యయనం

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం బెంగళూరులో బిజీబిజీగా గడిపారు. నగరంలో అండర్ గ్రౌండ్ ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థపై ఆయన అధ్యయనం చేశారు. మొదట కర్నాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్, బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ అధికారులతో కలిసి అండర్ గ్రౌండ్ కరెంటు సప్లై ప్రాజెక్టు పై చర్చలు జరిపారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బ్యాంకు రుణాలు, సాంకేతిక సమస్యలు, నష్టాలు, లాభాలు, ప్రమాదాలు తదితర అంశాలపై

- మిగతా 2 లో

4 రోజుల్లో కేరళకు రుతుపవనాలు

(మొదటిపేజీ తరువాయి)

సమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. సాధారణంగా ఏటా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. జులై 8 నాటికి ఇవి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయువ్య భారతం నుంచి సెప్టెంబరు 17తో రుతుపవనాల ఉపసంహరణ మొదలవుతుంది. అది అక్టోబరు 15 నాటికి ముగుస్తుంది. ఇక గతేడాది మే 30న నైరుతి రుతుపవనాలు రాగా, 2023లో జూన్ 8న, 2022లో మే 23న దేశంలోకి ప్రవేశించాయి. దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి ముఖ్యమైన జలాశయాలను నింపడానికి రుతుపవనాలే ఆధారంగా ఉన్నాయి.

ఖగోళ శాస్త్రవేత్త నార్లికర్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్ నార్లికర్ తన ప్రాథమిక విద్యను బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) క్యాంపస్‌లో, ఉన్నత విద్యను కేంబ్రిడ్జ్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (1972-1989)లో చేరడానికి భారతదేశానికి తిరిగి వచ్చారు. విష్ణు నార్లికర్ నాయకత్వంలో సైద్ధాంతిక ఖగోళ భౌతిక శాస్త్ర సమూహాన్ని విస్తరించారు. ఇది క్రమంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 1988లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డాక్టర్ నార్లికర్‌ను ప్రతిపాదిత ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) ని స్థాపించడానికి వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఆహ్వానించింది. 2003లో పదవీ విరమణ చేసే వరకు ఆయన ఐయూసీఏఏ డైరెక్టర్ పదవిలో కొనసాగారు. ఆయన నేతృత్వంలో ఐయూసీఏఏ ఖగోళ శాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్రంలో బోధన, పరిశోధనలలో అత్యుత్తమ కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిని సాధించింది. 2012లో థర్డ్ వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాక్టర్ నార్లికర్‌కు సైన్స్‌లో అత్యుత్తమ కేంద్రాన్ని స్థాపించినందుకు అవార్డును ప్రదానం చేసింది. డాక్టర్ నార్లికర్ తన పుస్తకాలు, వ్యాసాలు, రేడియో, టీవీ కార్యక్రమాల ద్వారా సైన్స్ కమ్యూనికేషన్‌గా ప్రసిద్ధి చెందారు. తన సైన్స్ ఫిక్షన్ కథల ద్వారా కూడా ప్రాముఖ్యం పొందారు. ఈ ప్రయత్నాలన్నిటికీ గాను ఆయనకు 1996లో యునెస్కో ద్వారా కళింగ అవార్డు, 1965లో 26 ఏళ్లకే చిన్న పద్మభూషణ్ అందుకున్నారు. 2004లో ఆయనకు పద్మవిభూషణ్ లభించింది. 2011లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారమైన మహారాష్ట్ర భూషణ్‌ను ప్రదానం చేసింది. 2014లో భారతదేశపు ప్రముఖ సాహిత్య సంస్థ సాహిత్య అకాడమీ, ప్రాంతీయ భాష (మరాఠీ) రచనలో అత్యున్నత పురస్కారానికి ఆయన ఆత్మకథను ఎంపిక చేసింది.

ఈ ప్రశ్నలకు బదులేది?

(మొదటిపేజీ తరువాయి)

పంపుతున్నట్లు మోదీ ప్రభుత్వం ప్రకటించింది. అఖిలపక్ష ప్రతినిధి బృందాల్లో సీపీఐకి ప్రాతినిధ్యం కల్పించలేదు. లోక్‌సభ, రాజ్యసభలో సీపీఐకి చెరో ఇద్దరు సభ్యులు ఉన్న విషయం విదితమే. తాజా పరిణామాలపై సామాజిక మాధ్యమంలో రాజా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'రాజకీయ పార్టీలను సంప్రదించలేదు. వారికి వివరణ ఇవ్వలేదు. ప్రతినిధి బృందాలకు సూచనలపై స్పష్టత లేదు' అని దుయ్యబట్టారు. ఆపరేషన్ సిందూర్‌పై వ్యాఖ్యలకుగాను అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అరెస్టును ఖండించారు. అసమ్మతి గళాలను అణచివేస్తున్నారని విమర్శించారు. 'పహల్గాం దాడి నుంచి ఉగ్రవాదాన్ని యావత్ దేశం ముక్తకంఠంతో వ్యతిరేకించింది. బీజేపీ మాత్రం విభజనలను పెంచడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందడం, అసమ్మతి స్వరాల అణచివేతకు ఈ సమయాన్ని వాడుతోంది. ప్రొఫెసర్ అలీ ఖాన్ మహమూదాబాద్ అరెస్టుకు కారణం ఆయన చేసిన వ్యాఖ్యలు కాదు ఆయన గుర్తింపు, 'హేతుబద్ధమైన విమర్శ' అని రాజా పేర్కొన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణపై గందరగోళం దృష్ట్యా మోదీ సర్కారు వివరణ ఇవ్వాలని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత్రను స్పష్టం చేయాలన్నారు. అణు యుద్ధంపై ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ వివరణ ఇవ్వకపోవడం షాక్‌కు గురిచేసిందని రాజా అన్నారు. సంప్రదాయ పద్ధతిలోనే రెండు దేశాల మధ్య సైనిక ఘర్షణ సాగిందన్న విదేశాంగ శాఖ కార్యదర్శి మాటలకు భిన్నంగా ట్రంప్ ప్రకటన ఉన్నట్లు గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం సంబంధిత ప్రశ్నలన్నింటికి సమాధానమిస్తుందా లేక ట్రంప్ చెప్పినదానికి వంత పాడుతుందా అని రాజా ప్రశ్నించారు. ప్రపంచ దేశాలను చేరుకోవడానికి ముందు సొంత ప్రజలు, వ్యవస్థలకు గౌరవం ఇవ్వాలని హితవు పలికారు. 'భారత్‌కు కావల్సినది పారదర్శకత, ఐక్యత, హుందాతనం, గౌరవం.... దురహంకారం, అణచివేత, అస్పష్టత కాదు' అని వ్యాఖ్యానించారు. కేంద్ర విదేశాంగ విధానాన్ని కూడా ఆయన విమర్శించారు. ఏ ప్రధాన దేశం నుంచి దీనిపై భారత్‌కు స్పష్టమైన మద్దతు లేదన్నారు. కల్నల్ సోఫియా ఖురేషి వంటి కీలక సైన్యాధికారులను వారి మతం ఆధారంగా ఉగ్రవాదులతో ముడిపెట్టిన విజయ్ షా వంటి బీజేపీ నేతలు... మంత్రులుగా కొనసాగుతుండటం దారుణం. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు అవమానం' అని రాజా వ్యాఖ్యానించారు.

కేసీఆర్, హరీశ్, ఈటలకు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరానికి తగిన విధంగా కమిషన్‌కు గడువును ఏడు సార్లు పొడిగించింది.

కేసీఆర్‌ను కలిసిన హరీశ్‌రావు

కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో వీరిద్దరు కలుసుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై విచారణలో భాగంగా కేసీఆర్, హరీశ్, ఈటలకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు ఇవ్వడంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

డోర్ డెలివరీకి చంద్రబాబు మంగళం

మాజీ మంత్రి కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రేషన్ డోర్ డెలివరీకి మంగళం పాడిందని పౌర సరఫరాల శాఖ మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. , వచ్చే నెల 1 నుంచి రేషన్‌ను డోర్ డెలివరీని నిలిపివేస్తూ చంద్రబాబు కేబినెట్ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని, ఈ నిర్ణయంతో 10 వేల కుటుంబాలు నడిరోడ్డున పడతాయని, దీనిని వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్లను తొలగించి లక్షలాది మంది కుటుంబాలను కూడా వీధిన పడేసిందని, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న సహాయకులను కూడా తొలగించి వారి జీవనాధారం లేకుండా చేసిందని తెలిపారు.

కమ్యూనిజాన్ని వ్యతిరేకించడం ఆక్షేపణీయం

కేకేఈ, అకెల్, పీసీపీ, కేఎస్‌సీఎం సంయుక్త ప్రకటన

ఫాసిజాన్ని పెంచిపోషించాలనే యూరోపియన్ పీపుల్స్ పార్టీ సభ్యుల ఆలోచన ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ), ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ వర్కింగ్ పీపుల్ ఆఫ్ సైప్రస్ (అకెల్), పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ (పీసీపీ), బొహెమి యా, మొరావియా కమ్యూ నిస్టు పార్టీ (కేఎస్‌సీఎం) సంయుక్త ప్రకటన దుయ్యబట్టింది. 'నిజమే గెలుస్తుంది. కమ్యూనిజం వ్యతిరేకత నశిస్తుందని, గెలుపు మళ్లీ ప్రజలనే వరించబోతోందని యూరోపియన్ పార్లమెంటులో యాంటీ కమ్యూనిస్ట్ ఇనిషియేటివ్‌కు వ్యతిరేకంగా ఉమ్మడి ప్రకటనను కేకేఈ ప్రవేశపెట్టింది. యూరోపియన్ పీపుల్స్ పార్టీ (ఈపీపీ) ఎంఈపీల కమ్యూనిస్టు వ్యతిరేక ప్రతిపాదనను ఖండించింది. 'గ్రేట్ యాంటీ ఫాసిస్ట్ విక్టరీ 80వ వార్షికోత్సవం వేళ సుత్తి కొడవలి, సోవియట్ యూనియన్ గుర్తులు నిషేధించాలని, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు మద్దతు ఇవ్వొద్దని, సోవియట్, ఫాసిస్టు వ్యతిరేక స్మారకాలు తొలగించాలని ప్రతిపాదించడం ఏమిటని ప్రశ్నించింది. ఫాసిజాన్ని సమర్థిస్తూ కమ్యూనిస్టులను వ్యతిరేకించడాన్ని తీవ్రస్థాయిలో ఆక్షేపించింది. ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం, స్వాతంత్ర్య పోరాటాలలో కమ్యూనిస్టుల పాత్రను తగ్గించేందుకు, ప్రజా వ్యతిరేక విధానాల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, మతతత్వవాదాన్ని ప్రోత్సహించేందుకు యత్నిస్తున్నారని విమర్శించింది. ఎప్పటికైనా ప్రజలే గెలుస్తారని పేర్కొంది.

అంతర్జాతీయ 'మహమ్మారి' ఒప్పందానికి డబ్ల్యూహెచ్ఓ ఆమోదం

జెనీవా: అంతర్జాతీయ 'మహమ్మారి' ఒప్పందం (గ్లోబల్ పాండమిక్ అగ్రిమెంట్)ను వరల్డ్ హెల్త్ అసెంబ్లీ మంగళవారం ఆమోదించింది. కోవిడ్-19 మహమ్మారి దృష్ట్యా భవిష్యత్‌లో మహమ్మారులు వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశమై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయంతో ఈ చారిత్రక ఒప్పందం కుదిరింది. 2020 నుంచి 2022 వరకు ప్రపంచ దేశాలను కోవిడ్ గడగడలాడించింది. కోవిడ్ వల్ల కొన్ని లక్షల మరణాలు సంభవించాయి. మూడేళ్లు జరిపిన సమాలోచనల తర్వాత డబ్ల్యూహెచ్ఓ సభ్యులు ఏకాభిప్రాయానికి వచ్చారు. జెనీవాలో జరిగిన వరల్డ్ హెల్త్ అసెంబ్లీ సందర్భంగా డబ్ల్యూహెచ్ఓ సభ్యదేశాల ప్రతినిధులు కరతాళధ్వనులతో చారిత్రక ఒప్పందాన్ని స్వాగతించారు. అమెరికా నిధుల్లో భారీ కోతతో డబ్ల్యూహెచ్ఓ వంటి బహుపాక్షిక సంస్థలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రపంచ ఆరోగ్య వ్యవస్థ సభ్యులు సాధించిన విజయానికి సంకేతమే ఈ ఒప్పందం అని పేర్కొన్నారు. 'ప్రజారోగ్యం, సైన్స్, బహుపాక్షిక చర్యల విజయమే ఈ ఒప్పందం. తద్వారా మనం సమష్టిగా ప్రపంచాన్ని భావి మహమ్మారుల నుంచి కాపాడుకోలమన్న హామీ లభించింది' అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ ట్రెడోస్ అధానోమ్ ఘెబ్రేయేసెస్ వెల్లడించారు. ఈ ఒప్పందంపై ఓటింగ్ కోసం స్లోవికియా డిమాండ్ చేసింది. 124 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. ఒక్క వ్యతిరేక ఓటు కూడా రాలేదు. పోలాండ్, ఇజ్రాయిల్, ఇటలీ, రష్యా, స్లోవేకియా, ఇరాన్ సహా 11 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు.

శాంతికి సిద్ధమేకానీ...

యుద్ధం ఆపడంపై జెలెన్‌స్కీ, పుతిన్

కీవ్: ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపే ఉద్దేశం రష్యాకు లేదని, కావాలనే కాలయాపన చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ మంగళవారం వ్యాఖ్యానించారు. చర్చల ద్వారా ఘర్షణకు అంతం పలకాలని, అందుకు వాస్తవాధారిత ప్రతిపాదనలు అవసరం' అని అన్నారు. శాంతి స్థాపనకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా సానుకూలత వ్యక్తం చేశారు. అయితే ందుకు కొన్ని నియమాలు వర్తిస్తాయని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య ప్రత్యక్ష చర్చలకు మద్దతిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్ చర్చల అనంతరం జెలెన్‌స్కీ, పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్-రష్యా మధ్య చర్చలు సరైన దిశలో సాగుతున్నట్లు పుతిన్ తెలిపారు. శాంతి స్థాపన ఘర్షణలకు మూల కారణాల పరిష్కారంపై ఆధారపడి ఉందన్నారు. కాగా, కాల్పుల విరమణ దిశగా చర్చలు ప్రారంభమవుతాయని ట్రంప్ కూడా ఆశాభావం వ్యక్తంచేశారు. పుతిన్‌తో చర్చలు సానుకూలంగా సాగాయని ఆయన తెలిపారు. జెలెన్‌స్కీ స్పందిస్తూ 'రష్యాకున్న నియమాలేమిటో తెలియదు. యుద్ధంలో మేము చాలా కోల్పోయాం. దీన్ని ముగించడానికి మేము సిద్ధమే కానీ రష్యా సిద్ధంగా లేదనిపిస్తోంది' అని అన్నారు. 'ముందుగా కాల్పుల విరమణకు వారు అంగీకరించాలి. ఆ తర్వాత యుద్ధాన్ని పూర్తిగా ఆపేయాలి. ఇదే మేం కోరుతున్నాం. ఎలాంటి షరతులు లేకుండా ఈ కాల్పుల విరమణను ప్రతిపాదించినందుకు ట్రంప్‌నకు కృతజ్ఞతలు' అని టెలిగ్రామ్‌లో జెలెన్‌స్కీ పేర్కొన్నారు. మాస్కోపై ఒత్తిడి తీసుకొచ్చి కీవ్‌లో శాంతి నెలకొల్పాలని ప్రపంచ దేశాలను కోరారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తోనూ శాంతి ప్రక్రియ గురించి చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యాపై మరిన్ని అంతర్జాతీయ ఆంక్షలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. చర్చల ద్వారా యుద్ధం ముగుస్తుందనడంలో సందేహం లేదు కానీ రష్యా అసహజ షరతులు కొనసాగిస్తే ఏకాభిప్రాయం కష్టమని జెలెన్‌స్కీ వెల్లడించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

- కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ
- జులై 9న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి
- ఏఐకేఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి రావుల వెంకయ్య

విశాలాంధ్ర-విజయవాడ: కార్మిక హక్కులు హరించేందుకు మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన ఉధృతం చేస్తామని, ఇందులో భాగంగా జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐకేఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో కార్మిక సంఘాల అధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి వివిధ రైతు, కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. రావుల వెంకయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దు చేసి... నాలుగు లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా సీ 2-50 ఫార్ములా ప్రకారం పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు తీసుకున్న పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, నల్లచట్టాలు రద్దుచేసి వ్యవసాయాన్ని రక్షించాలని, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాదుల దాడి అనంతరం ఏర్పడిన యుద్ధం కారణంగా మే 20వ తేదీ తలపెట్టిన సార్వత్రిక సమ్మె దేశ ప్రజల క్షేమం కోసం వాయిదా వేసినట్లు తెలిపారు. జులై 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను మరింత విజయవంతంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. కేంద్రం తరహాలోనే రాష్ట్రంలో చంద్రబాబు కూడా అదే విధానాలు అవలంబిస్తున్నారని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు, కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర చేస్తుంటే తనకేమి పట్టనట్లు చూస్తూ ఊరుకోవడం దారుణమన్నారు. వివిధ రంగాల్లోని కార్మికులు తమ హక్కులు సాధించేందుకు అనేక ఉద్యమాలు చేస్తున్నా చంద్రబాబు చెవికి ఎక్కడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి దేశ సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడానికి, వారికి అనుకూలమైన చట్టాలు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. రైతు సంఘాల కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ గతంలో నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం అలుపెరగని వీరోచిత పోరాటాన్ని ఢిల్లీ సరిహద్దులో నిర్వహించిందని, ప్రధాని మోదీ దిగివచ్చి ఆ చట్టాలు వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. దొడ్డిదారిన తీసుకొచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా కార్యదర్శి యలమందరావు, ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.కేశవరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, కార్యదర్శి మూలే సాంబశివరావు, సీఐటీయు నగర నాయకులు దుర్గారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు బుద్దే రాజా, జేమ్స్, వీధి విక్రయదారుల సంఘం నాయకులు కొట్టు రమణ, ముఠాకార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కర్నూలులో నిరసన ప్రదర్శన

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేసిన 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, నల్లచట్టాలు రద్దుచేయాలని కోరారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి... రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి లలితమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాధం, ఏఐటీయూసీ నగర కార్యదదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రధాని ట్రంపా... మోదీనా?

(మొదటిపేజీ తరువాయి)

పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. రాజకీయాలతీతంగా వ్యవహరించాల్సిన గవర్నర్లు...ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాలనాపరమైన ఇబ్బందులు కలిగిస్తూ ఫైళ్లు కదలకుండా తొక్కిపెడుతున్నారని మండిపడ్డారు.

సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కూనంనేని సాంబశివరావు కోరారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలో అనేక కొత్త సంక్షేమ పథకాలు చేపట్టిందని, వీటివల్ల ప్రజలకు కొంత ప్రయోజనం చేకూరిందని, అయితే పాత సంక్షేమ పథకాల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం పాత పథకాలు అరకొరగా అమలు చేయడంతో ప్రజల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కొత్త పథకాల అమలుకు ఎక్కడి నుంచి డబ్బులు తెచ్చిపెడుతున్నారో ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అప్పుడే వాస్తవ పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకుంటారని, లేకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు కొత్త రేషన్ కార్డులు త్వరితగతిన అందజేయాలన్నారు. ప్రభుత్వం ఆదాయ మార్గాలు అన్వేషించకుండా... ఎవరు చెప్పినా వినకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం ఖాయమన్నారు. ఆంధ్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయనకు సముచిత గౌరవం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎదురుగా ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం ఓ అనాధ విగ్రహంగా ఉందని, ముఖ్యమైన ప్రదేశంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సూర్యాపేట జిల్లాకు కమ్యూనిస్టు దిగ్గజం, మాజీ ఎంపీ ధర్మభిక్షం పేరు పెట్టాలని ముఖ్యమంత్రికి మరోసారి విజ్ఞప్తి చేశారు.

బెంగళూరులో డిప్యూటీ సీఎం బిజీబిజీ

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక ఇంజనీర్లను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. జనసాంద్రత అధికంగా ఉన్న పట్టణాల్లో, హైదరాబాదులో కొత్తగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీ వంటి ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కరెంటు వ్యవస్థ ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థల్ని మెరుగుపరిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇదొకటన్నారు. మొదట బెస్కాం అధికారుల అధ్వర్యంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కర్నాటక పవర్ ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ పాండే, బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సహా ఇతర అధికారులు అనేక అంశాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి కృష్ణ భాస్కర్, ముషరఫ్ ఫారూఖీలు ఈ చర్చలలో పాల్గొన్నారు. 2018-19లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 7,400 కిలోమీటర్ల 11కెవి ఓవర్‌హెడ్ లైన్లను, వేలాది కిలోమీటర్లలో హైటెన్షన్ లైన్లను అండర్‌గ్రౌండ్ లేదా ఏరియల్ బంచ్డ్ కేబుల్స్‌గా మారుస్తున్నారు. ఒక ముఖ్యమైన కొత్త నోవేషన్‌గా యూజి మార్గాల వెంబడి ఆప్టికల్ ఫైబర్ కేబుల్ డక్టులను ఏర్పాటు చేసి, భవిష్యత్తులో టెలికాం సంస్థలతో లీజ్ ద్వారా ఆదాయ మార్గాలను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రధాన అంశాలపై ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఏపీ ఐసెట్‌లో 96 శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. అమ్మాయిలదే పై చేయిగా ఉంది. మొత్తంగా 95.86 శాతం మంది ఉత్తీర్ణత నమోదైంది. అబ్బాయిల్లో 95.66 శాతం మంది, అమ్మాయిల్లో 96.03 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. విశాఖకు చెందిన మనోజ్ మేక ప్రథమ ర్యాంకు సాధించగా, వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన డి.సందీప్ రెడ్డి రెండవ ర్యాంకు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.కృష్ణ సాయి మూడవ ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన వి. సాయిరాం సాత్విక్ నాల్గవ ర్యాంకు, గుంటూరుకు చెందిన ఆర్. మాధుర్య ఐదవ ర్యాంకు సాధించారు. ఐసెట్ కోసం 37,572 మంది దరఖాస్తు చేసుకోగా, 34,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 32,719 మంది ఉత్తీర్ణత సాధించారు. అబ్బాయిల్లో 15,863 మంది హాజరుకాగా 15,176 మంది అర్హత సాధించారు. అమ్మాయిల్లో 18,268 మంది పరీక్షకు హాజరు కాగా 17,543 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసెట్ ఛైర్మన్, ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ఐసెట్ ఫలితాల సీడిని విడుదల చేశారు. cets.apsche.ap.gov.in/ICET వెబ్‌సైట్, వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చు. కార్యక్రమంలో ఆచార్య ఎస్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ధనంజయరావు, ఐసెట్ కన్వీనర్ ఎం.శశి, సహ కన్వీనర్ కె.రమాసుధ పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల్ని లాక్కోవడానికేనా?

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించడం సెక్యులర్ కాకపోవచ్చుని, కానీ ముస్లింలు దేవుడికి సమర్పించుకునే ఆస్తి అన్నారు. మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి కూడా తన వాదన వినిపించారు. సవరణ చట్టం కారణంగా దరఖాస్తుదారుడు వక్ఫ్ రిజిస్ట్రేషన్ కోసం ఎప్పటికీ రిజిస్ట్రేషన్ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉండాల్సిందేనన్నారు. ఇది కేవలం భయాన్ని కలిగించడానికే అన్నారు. ప్రతి మతంలో మత సంస్థలు ఉన్నాయని, మీరు గత 5 సంవత్సరాలుగా దానిని ఆచరిస్తున్నారని నిరూపించమని ఏ మత సంస్థ మిమ్మల్ని అడుగుతుందని ప్రశ్నించారు. మతం రుజువును ఎవరు అడుగుతారన్నారు. ఈ చట్టం ప్రకారం వివాదం తలెత్తిన వెంటనే ఆస్తి వక్ఫ్ హోదాను కోల్పోతుందని కోర్టు దృష్టికి తెచ్చారు. మతపరమైన చట్టంలో మతాన్ని పునర్నిర్వచించడం ఇదే మొదటిసారి అని మరో సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ తెలిపారు. మనది లౌకిక దేశమని, తన క్లయింట్లలో ఒకరు సిక్కు అని, తాను వక్ఫ్‌కు తోడ్పడాలనుకుంటున్నానని, వక్ఫ్ గా గుర్తింపు కొనసాగాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు కొత్త చట్టం చెబుతున్న ప్రమాణాన్ని నెరవేర్చడానికి ఎవరైనా ఇస్లాంను ఎలా ఆచరిస్తారని సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మది ప్రశ్నించారు.

సీజేఐ కీలక వ్యాఖ్యలు

విచారణ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేననే భావన ఉందని, స్పష్టమైన సందర్భం వెల్లడి కానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోకూడదని అన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదన్నారు. అంతకన్నా తాము చెప్పవలసిన అవసరం లేదని చెప్పారు. వక్ఫ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ఉద్దేశమని పిటిషనర్ల తరపు లాయర్ కపిల్ సిబాల్ అన్నప్పుడు సీజేఐ ఈ విధంగా స్పందించారు. వక్ఫ్ చట్టంపై గత విచారణ సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. వాటిలో వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ కౌన్సిల్, స్టేట్ వక్ఫ్ బోర్డులకు ముస్లిమేతరుల నామినేషన్, వక్ఫ్ కింద ప్రభుత్వ భూముల గుర్తింపు వంటివి ఉన్నాయి.

మూడు అంశాలకే పరిమితం చేయాలి: కేంద్రం

విచారణ సందర్భంగా కేంద్రప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ... వక్ఫ్ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి విచారణను మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. కోర్టు గుర్తించిన మూడు అంశాలకు తాము సమాధానం దాఖలు చేయడం జరిగిందని...ఇప్పుడు పిటిషనర్ల లిఖిత పూర్వక సమాధానాల్లో ఇతర అంశాలను ప్రస్తావించారని, విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలని ధర్మాసనాన్ని కోరారు. గతంలో ఏప్రిల్ 17న జరిగిన విచారణ సందర్భంగా బై-యూజర్ సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ-నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అదేవిధంగా, వక్ఫ్ బోర్డులలో ఎటువంటి కొత్త నియామకాలు చేపట్టబోమని కూడా అప్పట్లో కేంద్రం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తావించిన మూడు అంశాల్లో మొదటిది, వక్ఫ్ బై యూజర్ లేదా వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారానికి సంబంధించినది. ఇక రెండో అంశం, రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లిం వర్గాలు వ్యతిరేకించడం. మూడోది, వక్ఫ్ ఆస్తుల సర్వే బాధ్యతను సర్వే కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్‌కు బదిలీ చేసే నిబంధనపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు.

మినీ అంగన్వాడీలకు పెంచిన జీతమేది?

(మొదటిపేజీ తరువాయి)

నిలదీయడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో పాత జీవోను తిరిగి విడుదల చేస్తూ, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తున్నామని రేవంత్ ప్రభుత్వం ప్రచారం చేసుకున్నదన్నారు. మే నెలలో ఎనిమిది జిల్లాల్లోని మినీ అంగన్వాడీలకు మాత్రమే పే గ్రేడ్ జీతాలు ఇచ్చి, మిగతా వారికి ఎందుకు చెల్లించలేదు. వారికీ తక్షణమే చెల్లించాలి అని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 'మినీ అంగన్వాడీలు మీ ప్రచార సాధనాలు కాదు. గ్రామీణ పేదలకు సేవల చేసే కార్యకర్తల కడుపు కొట్టడం అన్యాయం. రాష్ట్ర మహిళలందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది' అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. 'కోటీశ్వరులు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని, ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామని, లక్ష కోట్ల వడ్డీలేని రుణాలిస్తామని, కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని, బాలికలకు స్కూటీలిస్తానని, అంగన్వాడీ లకు రూ.18,000 నెలసరి జీతం పెంచుతామని, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలను చేస్తామంటూ మహిళలకు వివిధ రకాలుగా హామీలు ఇచ్చి మోసం చేసింది. మినీ అంగన్వాడీలకు పెంచిన జీతం జనవరి 2024 నుంచి చెల్లించాలి. 3,989 మంది మినీ అంగన్వాడీలకు పెండింగ్ జీతాలను చెల్లించాలి. మినీ అంగన్వాడీ నుంచి అంగన్వాడీ కేంద్రాలుగా మారిన చోట హెల్పర్లను నియమించాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఐబీ చీఫ్ పదవీకాలం పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

బ్యాచ్ హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి తపన కుమార్ ఉగ్రవాదం, తీవ్రవాద సంబంధిత కేసుల నిర్వహణలో నైపుణ్యం కలిగి ఉన్నారు. 2022 జూన్‌లో ఐబీ చీఫ్‌గా రెండేళ్లకాలానికి నియమితులయ్యారు. తర్వాత 2024 జూన్‌లో ఏడాదిపాటు పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది. ఐబీ చీఫ్‌గా నియామకానికి ముందు ఆయన రెండు దశాబ్దాలకు పైగా ఐబీ ఆపరేషన్స్ విభాగం చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు.

స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కో ఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్ల ప్రారంభం

విశాలాంధ్ర :నల్లగొండ బ్యూరో : సౌర శక్తి వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి చేసి ఆదాయం సంపాదించుకునేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా నల్గొండ జిల్లా, కట్టంగూరు మండలం, ఐటిపాములలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కట్టంగూరు మండలం, ఐటిపాములలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో స్వబాగ్స్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటుచేసిన "స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కో ఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్ల" ను ప్రారంభించడమే కాకుండా, స్వచ్ఛ శక్తి కేంద్రం, మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మహిళను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలనుకుంటే సాధించలేనిది ఇది లేదని,మహిళలు వంటింటికే పరిమితం కాదని అన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ లాంటి దేశాలు న్యూక్లియర్ ,థర్మల్ విద్యుత్తును పక్కన పెట్టి సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి వెళుతున్నారని, దాన్ని దృష్టిలో ఉంచుకొని మహిళలు ఇంటి వద్దనుండే ఆదాయం పొందేందుకు సోలార్ విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో మహిళలను లక్షాధికారులుగా చేయాలనే తలంపుతో ఆర్థిక సాయం అందించడం జరిగిందని, అదే సమయంలో తాను శాసనసభ్యుడిగా మహిళా స్వయం సహాయక సంఘాలకు 350 కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళు న్నామని, స్వశక్తితో మహిళలు పైకి రావాలనే ఉద్దేశంతో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 50 మంది స్వయం సహాయక మహిళలకు రూ. 50 లక్షల రూపాయలను ఇచ్చి యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు .అలాగే త్వరలోనే ఈ 50 మంది మహిళలకు బ్యాంకుల ద్వారా మూడు లక్షల రూపాయల చొప్పున బ్యాంకు రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ యువతకు ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయలు చొప్పున జూన్ 2 న స్వయం ఉపాధి కై ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు.రానున్న రెండు నెలల్లో ఐటిపాముల మాదిరిగానే నల్గొండ మండలం, చర్లపల్లి గ్రామంలో సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ రెండు గ్రామాలను తెలంగాణలోని ఇతర ప్రాంతాల వారు వచ్చి చూసే విధంగా తీర్చి దిద్దనున్నామని చెప్పారు. అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే కాకుండా, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఒక్కొక్కటి ఐదు లక్షల రూపాయలతో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల లో భాగంగా ఐటిపాములకు 100 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మహిళలకు 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. అంతేకాక స్వచ్ఛ శక్తి కేంద్రం ,మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పాత్రాలను అందజేశారు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ మహిళలు ఇంట్లో కూర్చుని సోలార్ విద్యుత్ యూనిట్ల ద్వారా నెలకి కనీసం 2000 రూపాయల ఆదాయం సంపాదించవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళలు కాలు బయట పెట్టకుండా ఇంటి నుండే ఆదాయాన్ని సంపాదించేలా సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఐఓటి ద్వారా ఈ బ్యాటరీ చార్జింగ్ విషయాలను తెలుసుకోవచ్చని చెప్పారు. డి సి ఎం ఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి, ఇంచార్జ్ రెవిన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,మండల ప్రత్యేక అధికారి ,జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, తహసిల్దార్ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి నామినేషన్

విశాలాంధ్ర -ములుగుజిల్లాబ్యూరో : ములుగు జిల్లా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు జిల్లా ఇంచార్జ్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత సమక్షంలో గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింత క్రాంతి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

19 మందికి కారుణ్య నియామకం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థలు వారసత్వ ఉద్యోగాలు, కారుణ్య నియామకాలు చేపట్టి 19 మందికి పత్రాలు అందించడం జరిగిందని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెం రాజు అన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్‌తోపాటు మరణించిన కార్మికుల వారసులకు ఉద్యోగ నియామకాల ప్రక్రియ మంగళవారం జియం కార్యాలయంలో నిర్వహించారు. కొత్తగూడెం ఏరియాలో పనిచేసిన కార్మికుల, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు జరిగాయన్నారు. సంస్థ సి అండ్ ఎండి బాలరామ్ ఆదేశాల మేరకు 2018 సంవత్సరం నుంచి కారుణ్య నియామకాలను జరుగుతున్నట్లు జియం చెప్పారు. ప్రస్తుతం ఈ నెలలో అత్యధికంగా 19 మందికి పత్రాలు అందించడం జరిగిందన్నారు. కొత్త యువ ఉద్యోగులకు శుభాకాంక్షలు చెబుతూ సింగరేణి ఇచ్చిన ఈ అవకాశాన్ని బాధ్యతగా క్రమశిక్షణతో గైర్హాజరు కాకుండా విధులు నిర్వహించాలని ఆయన కోరారు. ఇప్పుడు నియమించిన వారికి రానున్న కాలంలో వారి విద్యార్హతకు తగిన స్థాయిలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగూడెం ఏరియాలో మొత్తంగా 669 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగాలు పొందిన వారసులు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞులై ఉండాలని, వృద్ధాప్యంలో వారి బాగోగులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టీయుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్ఓటు జిఎం జి.వి. కోటిరెడ్డి, డిజిఎం బి. శివ కేశవరావు, పర్సనల్ ఆఫీసర్ ఎం. మురళి, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీ ప్రజల అభివృద్దే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం : ఎఎస్పీ

విశాలాంధ్ర - చర్ల : ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల బహుముఖ అభివృద్దే జిల్లా పోలీసుల లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు భద్రాచలం ఎఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. మండలంలోని చెన్నాపురం గ్రామంలో ఏర్పాటు మంగళవారం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చర్ల పోలీసుల ఆధ్వర్యంలో మండలం లోని చత్తీస్గడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన చెన్నాపురంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించడం జరిగిందన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఈ గ్రామంలో తొలుత ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై అక్కడ నివసించే మహిళలకు, చిన్న పిల్లలకు దుస్తులతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను కూడా అందజేసారు. సింగ్ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలోని 90 కుటుంబాలలో నివసించే యువత, పిల్లలు, మహిళలు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై లు కేశవ, నర్సిరెడ్డి, సీఆర్ పి ఎఫ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: దేశానికి ఆదర్శంగా ప్రభుత్వ రూపొందించిన భూ భారతి చట్టం నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం - 2025 పై నిర్వహించిన రెవెన్యూ సదస్సులోమంత్రి పొంగులేటి, రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ -పబ్లిక్ రిలేషన్స్) హర్కర వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ టి.భాను ప్రసాద్ రావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పెద్దలు స్వార్థ పూరితంగా నాలుగు గోడల మధ్య ఎవరి అభిప్రాయాలు తెలుసుకోకుండా ధరణి చట్టం తయారు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం దేశంలోనే 18 రాష్ట్రాల్లోనే 20 చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి వేల మంది ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని వారి కోరిక మేరకు భూ భారతి చట్టం తయారు చేశామని అన్నారు. రాష్ట్రంలోనే ప్రతి రైతుకు భరోసా భద్రత కల్పించాలని ఎన్నో రాత్రులు శ్రమించి, మేధావులతో చర్చించి, ఒక్క రోజు ఆలస్యం జరిగిన పేదలకు మంచి జరగాలనే తపనతో భూ భారతి చట్టాన్ని తయారు చేశామని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఏ రెవెన్యూ చట్టం తయారు చేయాలన్న ఆదర్శంగా ఉండే విధంగా భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం తయారు చేసిందని, దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం నిలుస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చి 3 సంవత్సరాలు గడిచిన రూల్స్ తీసుకుని రాలేదని, తమ ప్రభుత్వం

భూ భారతి చట్టం రూల్స్ ప్రవేశపెట్టిందని, ఈ నిబంధనల ప్రకారం సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని అన్నారు. పెండింగ్ ఉన్న సాధా బైనామా చట్టం సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం సాదా బైనమా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ధరణి చట్టంలో సాదా బైనమా గురించి అసలు పెట్టలేదని అన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను, వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారన్నారు. ప్రజా ప్రభుత్వంలో గ్రామానికి ఒక రెవెన్యూ అధికారమే జూన్ 2 నాటికి నియమిస్తామని, ప్రతి సంవత్సరం రెవెన్యూ రికార్డు మాన్యువల్ గా రాసి గ్రామంలో నోటీసు బోర్డుపై అతికిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి వర్యులు డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ గతంలో సాగు నీరు కోసం రైతులు పడే ఇబ్బందులకు ప్రతి రోజూ ముందు ఉండి పోరాటం చేసిన నాయకులు నేడు ప్రజాప్రతినిధిగా ఉండటం సంతోషంగా ఉందని అన్నారు. ఎస్సారెస్పీ డీ 83,డీ86 కాల్వల క్రింద పూర్తి స్థాయి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని అన్నారు. సుల్తానాబాద్, పెద్దపల్లి బైపాస్ రోడ్డు పనులు టెండర్లు పూర్తవుతున్నాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఎమ్మెల్యే పని చేస్తున్నారని తెలిపారు.

భారతదేశ సరిహద్దుల అంశంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా తమ మద్దతు అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గతంలో ఇందిరా గాంధీ అమెరికా నాయకత్వం ఎదిరించి పాకిస్థాన్ ను యుద్ధంలో చిత్తు చేసి ప్రత్యేకంగా బంగ్లాదేశ్ దేశాన్ని సృష్టించామని, నేడు అమెరికా ఒత్తిడికి తలొగ్గి రాజీపడటం దురదృష్టకరమని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ భూ సమస్యలు శాశ్వత పరిష్కారం చేసే దిశగా అంబేద్కర్ జయంతి నాడు ప్రభుత్వం భూ భారతి పోర్టల్ ప్రారంభించిందని, ఈ చట్టంపై సందేహాల నివృత్తి కోసం మండల కేంద్రాలలో అవగాహన సమావేశాలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారం దిశగా ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నారని తెలిపారు. రామగుండం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, నగరానికి అదనంగా మరో తహసిల్దార్ కార్యాలయం మంజూరు చేయాలని, అంతర్గాం కాందిశీకులు సమస్య పరిష్కారం చేయాలని, జెన్కో సింగరేణి తరపున గతంలో 18 వేల పట్టాలు పంపిణీ చేశామని , మరో 17 వేల పట్టాలు పెండింగ్ లో ఉన్నాయని , వీటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య గౌడ్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, అదనపు కలెక్టర్ డి.వేణు, రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, తహసిల్దార్ బషీరుద్దీన్, మార్కెట్ చైర్మన్ లు సంజీవ్, తిరుపతి రెడ్డి రైతులు , ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ సదస్సుకు తరలి రండి : రమణమూర్తి

విశాలాంధ్ర - ఇల్లందు : రాజ్యాంగంపై మనువాదులు చేసే కుట్రలను తిప్పి కొట్టడానికి భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు ను ఈనెల 25న భద్రాచలం పట్టణంలో నిర్వహించనున్నట్లు జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి పిలుపునిచ్చారు. ఈ సదస్సు ను విజయవంతం చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇల్లందు సింగరేణి గ్రౌండ్ లో పట్టణ అధ్యక్షులు వేమూరి సాల్మన్ రాజు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు

ఎడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్, భద్రాచలం నాయకులు రుంజా సుమన్ లతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చాలని దేశాన్ని ఏలుతున్న మనువాదుల కుట్రలు కుట్రలు పలుతున్నట్లు విమర్శించారు. దీన్ని వ్యతిరేకిస్తూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు 25న భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్న సదస్సుకు ముఖ్యఅతిథిగా, ప్రధాన వక్తగా బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బల్లెం లక్ష్మణ్, సందా ప్రవీణ్, పట్టణ కార్యదర్శి అబ్బూరి సునీల్,నాయకులు మేడిపల్లి బాబురావు,అంబటి కొండలరావు, పిల్లి బాబురావు, వేమూరి రాజు,గుండమల్ల నాగేంద్రం,దేవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోదావరి జలాల తరలింపు రాజ్యాంగ విరుద్ధం

విశాలాంధ్ర - గార్ల : గోదావరి పరివాహక ప్రాంతంగా ఉన్న ఏజెన్సీ, ఆదివాసి గిరిజన ప్రాంతాల ప్రజలకు త్రాగు, సాగు నీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాలోని కృష్ణా బేసిన్‌కు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తరలించడం రాజ్యాంగ విరుద్ధమని తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్, ప్రముఖ న్యాయవాది చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన్‌లో గోదావరి జల సాధన సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ రీడిజైన్ జీవో నెంబర్ 72, మున్నేరు నీళ్లను పాలేరుకు తరలించే జీవో నెంబర్ 98లు అసంబద్ధమైన జీవోలన్నారు. రెండు జీవోల రద్దు కోరుతూ గోదావరి జల సాధన సమితి తరపున తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివాసి ప్రాంతాల అభివృద్ధి కోసం కేటాయించిన ప్రాజెక్టులను, నిధులను మైదాన ప్రాంతాలకు లేదా

అభివృద్ధి చెందిన ప్రాంతాలకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివాసి ప్రాంతాల్లో నెలకొన్న అనేక మౌలిక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చించి సాయుధ బలగాలతో మావోయిస్టులను, ఆదివాసులను హతమార్చడం సమస్యలకు పరిష్కారం కాదన్నారు. ఆదివాసి ప్రాంతాలకు కేటాయించిన అభివృద్ధి నిధులు దారి మళ్లకుండా ప్రభుత్వమే చూడాలన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు.50 ఏళ్లుగా మున్నేరు ప్రాజెక్ట్ పెండింగ్‌లో ఉండగా దీన్ని నిర్మించకపోగా మున్నేరు నీటిని పాలేరుకు తరలించడం పెత్తందార్ల స్వార్థ రాజకీయాలే అని విమర్శించారు. గార్ల ఏజెన్సీ నుంచి గోదావరి జలసాధన సమితి చేస్తున్న న్యాయమైన పోరాటానికి రాజకీయాలకతీతంగా సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. గోదావరి జల సాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అఖిలపక్ష నేతలు మల్లెల రామనాథం, కట్టెబోయిన శ్రీనివాస్, గుండా వెంకటరెడ్డి, ధనియాకుల రామారావు, గుగులోత్ సక్రు, పానుగంటి రాధాకృష్ణ, వజ్రం నాగేశ్వరరావు, కత్తి సత్యం, గిన్నారపు మురళి తారక రామారావు, భూక్య హరినాయక్, అజ్మీర వెంకన్న, మాలోత్ మాన్య నాయక్, చిలక నరసయ్య, అంకెపాక కిరణ్, మల్లేల బిక్షపతి, చింతల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4 కోడ్స్ రద్దుచేయాలి : జంపాల

విశాలాంధ్ర-ములుగుజిల్లాబ్యూరో : కేంద్ర ప్రభుత్వం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు వేతనాలు కేవలం రూ 600 మాత్రమే చెల్లిస్తూ. శ్రమ దోపిడీ చేస్తుందని తెలంగాణా మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పేర్కొన్నారు. బుధవారం ఏఐటియుసి జిల్లా కమిటి ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సామల రమ అధ్యక్షతన జరిగిన తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కార్మిక వర్గాలు చేపట్టిన అనేక పోరాటాల ఫలితంగా, అందరికీ ఉపయోగపడే 44 కార్మిక చట్టాలను తొలగిస్తూ, కార్పొరేట్ యాజమన్యాలకు ఉపయేగపడే 4, కోడ్స్ గా కుదించడం వలన, కార్మికులకు చాలా అన్యాయం జరుతుందన్నారు. అందుకే 4, కోడ్స్‌ను రద్దు చేసి 44', కార్మిక చట్టాలను ఎధావిధిగా కొనసాగించాలని అయన డిమాండ్ చేశారు. అలాగే వంట కార్మికులకు కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. 600 మాత్రమే చెల్లిస్తూ, శ్రమదోపిడీకి గురిచేస్తుందన్నారు. కనీస వేతనాలు

అందించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్స్ అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సూచించారు. ఇంకా అనేక హక్కులు సాధించుకోవాలసిన అవసరం ఉందని,స్కీం వర్కర్స్, సంఘటిత, అసంఘటిత కార్మికులు జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో ప్రతీ ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు ముత్యాల రాజు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా, ములుగు,వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం, వాజేడు, కొన్నాయి గూడెం, నాయకులు పోరెడ్డి ప్రమీల,సామల రమ గున్నాల రాజకుమారి గడ్డం భారతి,కె రాధిక, సమ్మక్క, సరోజన, పద్మావతి, రాజకుమారి, లక్ష్మీ,పాపమ్మ, కుమారి, మల్లక్క, తులసి, తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను సంపన్న వర్గాలకు దోచిపెడుతున్న మోదీ

విశాలాంధ్ర ఖమ్మం : దేశ సంపదను సంపన్న వర్గాలకు ప్రత్యేకించి పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ దోచిపెడుతున్నారని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు ఆరోపించారు. అటు కార్మికుల శ్రమ దోపిడీకి అవకాశం కల్పిస్తూ, దేశానికి వెన్నుముకగా నిలిచిన రైతులను వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం దేశ వ్యాప్త నిరసనలో భాగంగా పాత ధర్నాచౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్లో జరిగిన సభలో వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ ఐదు శాతం జనాభా కలిగిన కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారుల చేతుల్లో 70 శాతం దేశ సంపద పోగుపడిందని, 50 శాతం జనాభా కేవలం మూడు శాతం సంపద కలిగి ఉన్నారని పేర్కొన్నారు.

ధనవంతులను మరింత ధనవంతులుగా మోదీ ప్రభుత్వం చేస్తుందన్నారు . పేదలు మరింత పేదలుగా మారిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మిక చట్టాల్లో మార్పులు

తెచ్చి కొత్త నిబంధనలు ప్రకారం శ్రామికులను మళ్లీ వెట్టిచాకిరి వైపు మళ్లించే కుట్ర జరుగుతోందని నాయకులు ఆరోపించారు . పని గంటలు, కనీస వేతనాలు, సామాజిక, ఉద్యోగ భద్రత సంబంధించిన హక్కులు ప్రమాదంలో పడ్డాయని వారు తెలిపారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చి బిజెపి సర్కారు కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టే ప్రయత్నం చేస్తుందని వారు ఆరోపించారు. కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని తీసుకు రావాలని రుణ మాఫీ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణ బిల్లును నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరు మారక పోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సార్వత్రి సమ్మె జరగాల్సి ఉండగా దేశ పరిస్థితుల దృష్ట్యా జూలై మాసానికి వాయిదా వేసినట్లు నాయకులు తెలిపారు. ఎన్. నరేష్నాయుడు (ఐఎన్టియుసి), గాదె లక్ష్మి నారాయణ (ఏఐటియుసి), తుమ్మా విష్ణువర్ధన్ (సిఐటియు), జి. రామయ్య (టియుసిఐ), షేక్ సుభాని (ఐఎన్టిటియు) అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా ఏఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, ఐఎన్టియుసి అధ్యక్షులు కొత్తా సీతారాములు, ఏఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్నా నాగేశ్వరరావు, ఏఐయుకెఎస్ నాయకులు మలీదు నాగేశ్వరరావు, బిఆర్టియు జిల్లా నాయకులు ఎండివై పాషా, ఏఐకెఎంఎస్ నాయకులు మందుల రాజేంద్రప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలనేతలు పాల్వంచ కృష్ణ, భద్రం, శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, తోట రామాంజనేయులు, సిహెచ్ సీతామహాలక్ష్మి, దొండపాటి రమేష్, పిట్టల మల్లయ్య, మోహన్రావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, విక్రం, రమ్య, శ్రీనివాస్, సివై పుల్లయ్య, ఎ. అశోక్, రమేష్, లక్ష్మి నారాయణ, ఐ. వెంకన్న, మోహన్రావు, ఎం. లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర్ నాయక్ జన్మదినోత్సవం

విశాలాంధ్ర గూడూరు: మహబూబాబాద్ జిల్లా :మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ 58వ పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వాహహించారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను అంగరంగ వైభవంగా జరిపి కేక్ కట్ చేసి శంకర్ నాయక్ తినిపించారు. మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వే వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ బానోతు శంకర్ నాయక్, ప్రజల కోసం, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రజలకు ఎనలేని సేవలు చేసిన మహోన్నత నాయకుడు అంటూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి, ఎండి కాసిం, మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, సీనియర్ నాయకులు వాంకుడోత్ కటార్ సింగ్, జలగం సంపత్ రావు, ఆరే వీరన్న, ఎండి రహీం పాషా, చీదురు వెంకన్న, బోడ ఎల్లయ్య,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కన్నా కూతుర్ని చంపిన కసాయి తండ్రి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలానికి చెందిన అలకుంట సుజాత అను ఆమెకు గత 28 రోజుల క్రితం ఆడబిడ్డ పుట్టినది. అయితే అలకుంట సుజాత భర్త అయిన అలకుంట శేఖర్ మద్యం తాగి వెళ్ళి తన భార్యను పంపమని అత్తగారింట్లో గొడవ పడేవాడు. సోమవారం రోజు అలకుంటా సుజాత తన చంటి పాపను తీసుకొని మంచం పైన పడుకోగా, మంగళవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో ఆమె భర్త అలకుంటా శేఖర్ ఇంటికి వెళ్ళి ఆమె భార్య పడుకున్న మంచంపై పడుకున్నాడు. ఆమె భార్య పక్కన చంటి పాప ఉందని తెలిసి, అతను పడుకుంటే తన పాప ఊపిరి ఆడక చనిపోతుందని తెలిసి కూడా, అతను చంటి పాపపై నిర్లక్ష్యంగా పడుకోవడంతో ఆమెకు ఊపిరి ఆడక చంటి పాప చనిపోయినదని, అలకుంటా సుజాత తల్లి అల్లెపూ రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఖానాపూర్ సి ఐ అజయ్, ఖానాపూర్ SI గైక్వాడ్ రాహుల్ అన్నారు

బొగ్గు టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి...

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రాజకీయ నాయకుల ప్రోత్సలంతో ఆర్థిక స్వలాభం కోసం నడుస్తున్న బహు టిప్పర్లు మళ్ళీ జాతీయ రహదారిపై ప్రజల ప్రాణాలు మింగేస్తున్నాయి. మాస్జిద్‌లో నమాజ్ ముగించుకొని ఇంటికెళ్లే క్రమంలో రోడ్డు పక్కన నిలుచున్న ఎండి. మౌలాన (75) పైకి వేగంగా భారీ బొగ్గుటిప్పర్ (TG 28 T 3215) దూసుకెళ్ళింది. దింతో మౌలానా సగం శరీరం నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందారు.ఈ టిప్పర్ సత్తుపల్లి నుంచి రుద్రంపూరు సి ఎస్పీ కి బొగ్గు లోడుతో వెళ్తూ ఢీకొట్టింది. జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట గ్రామంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. మండల కేంద్రం చంద్రుగొండ గ్రామానికి చెందిన మౌలాన ఎర్రగుంట గ్రామంలో నివాసముంటున్న తన కూతురు ఇంటికి వెళ్లారు. కుల మాతాలకాతీతంగా అందరితో సరదాగా, ఆత్మీయంగా ఉండే మౌలాన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలిసి రెండు మండలాల ప్రజల్లో విషాదం నెలకొంది. కాగా కొత్తగూడెం - సత్తుపల్లి రైలు మార్గం ఏర్పడ్డాక సుమారు రెండేళ్ల నుంచి టిప్పర్లు జాతీయ రహదారిపై తిరగడం నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్ళీ ఈ మధ్యలోనే రాజకీయ నాయకుల అండతో కొత్తగూడెంకు బొగ్గు తరలిస్తున్నారు. ఈ మధ్య కాలంలోనే మళ్ళీ టిప్పర్ల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు, రైతుల పశువులు, కొందరు వ్యక్తులు మరణించడం గమనార్హం. టిప్పర్లను నిలిపివేయాలని అఖిలపక్షం నాయకులు సింగరేణి అధికారులకు డిమాండ్ చేస్తున్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందించాలి : సీపీఐ

విశాలాంధ్ర కారేపల్లి :పారదర్శకంగా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు డిమాండ్ చేశారు. సోమవారం కారేపల్లి మండల

పరిధిలోని ఉసిరికాయలపల్లి, భాగ్యనగర్‌తండాలలో సీపీఐ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలలో పాల్గన్న యర్రా బాబు పాల్గొని మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఆరోపణలపై ప్రభుత్వ స్పందించాలని గ్రామసభలోనే ఎంపిక పక్రియ చేపట్టాలన్నారు. రైతు భరోసాపై ఎన్నో ఆశాలతో రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాక,రైతు భరోసా రాక రైతులు తీవ్ర నిరుత్సహంతో ఉన్నారన్నారు. మహిళ సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏపూరిలతాదేవి మాట్లాడుతూ అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ,రాష్ట్రాభివఅద్ధిపై పెడితే సంతోషించేవారమన్నారు. మహిళల హక్కులకు భంగం కలుగుతున్న పాలకులు అందాల పోటీలకు ప్రోత్స హిస్తు న్నారన్నారు. భాగ్యనగర్‌తండా శాఖ కార్యదర్శిగా ఇస్లావత్ అమ్ము, సహాయ కార్యదర్శిగా రెడ్డిబోయిన రవిలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకఅష్ణ,ఉంగరాల సుధాకర్,పుచ్చకాయల శ్రీనివాసరావు, గుగులోతు మాంగు,సయ్యద్ అమీర్, కోటమ్మ,లకావత్ కృష్ణ, ఇస్లావత్ బాలాజీ లకావత్ హరిదాస్,బోడ బద్రు, వాంకుడోత్ కౌలియా, గుగులోత్ రావు,మాలోత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి మృతి చెందిన మూగజీవాలు

విశాలాంధ్ర కారేపల్లి : కారేపల్లి మండల పరిధిలోని పాటిమీదిగుంపు సమీపంలో సోమవారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో పిడుగుపడిరది. ఈ పిడుగుపాటుకు అక్కడి ఉన్న గొర్రెలు, మేకలు మృతి చెందగా గొర్రెల కాపరికి

తీవ్రగాలతో ఆసుపత్రిపాలయ్యారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బాజుమల్లాయిగూడెంకు చెందిన మద్దెల లక్ష్మి తమ గొర్రెలు, మేకలను పాటిమీదిగుంపు సమీపంలో మేపటానికి వెళ్లింది. సోమవారం సాయంత్రం ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం రావటంతో జీవాలు చెట్టు క్రిందకు చేరాయి. ఈక్రమంలో చెట్టు సమీపంలో పిడుగు పడటంతో చెట్టుక్రింద ఉన్న 17మేకలు,4 గొర్రెలు,ఒక కుక్క మృతి చెందాయి. గొర్రెల కాపరైన మద్దెల లక్ష్మి స్పృహ తప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి గ్రామస్తులకు కబురు చేయగా వారు వచ్చి లక్ష్మిని ఖమ్మం అసుపత్రికి తరలించారు. పిడుగు పాటుతో సుమారు రూ. 2లక్షల జీవాలు మృతి చెందాయని గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్నెస్ తప్పనిసరి : వెంకటరమణ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు నిబంధనల ప్రకారం ఫిట్నెస్ కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ ఆదేశించారు. మంగళవారం జిల్లా రవాణా కార్యాలయంలో స్కూల్ బస్సుల డ్రైవర్లకు బస్సు ఫిట్నెస్, రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహింహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ వాహనం నడిపే ముందు ఫిట్నెస్ నిర్ధారించుకోవాలని చెప్పారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. అన్ని విధాల బస్సులు నిబంధనల మేరకు వున్నప్పుడే రోడ్డెక్కాలన్నారు. విద్యార్థుల భద్రత ముఖ్యమని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే యాజమాన్యాలు, డ్రైవర్ల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనానికి అటెండెంట్ ఉండాలన్నారు. ప్రతి నెల డ్రైవరు తమ ఆరోగ్యం చెక్ అప్ చేసుకోవాలని సూచించారు. ఎట్టిపరిస్తుల్లోను మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. చట్ట ప్రకారం నడుచుకోవాలని స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు చాలా బాధ్యతగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సు పాటించవలసిన నియమాల గురించి కరపత్రాలు విడుదల చేశారు.

సంపాదకీయం

ద్వంద్వ నీతి

లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీ వైమానిక దళాధికారి వ్యోమికా సింఘ్‌తో కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. అందులో సోఫియా ఖురేషీ ముస్లిం కనక మధ్యప్రదేశ్‌లో బీజేపీ మంత్రి కన్వర్ విజయ్ షా ఆమెను తీవ్రవాదుల సోదరి అని ముద్ర వేస్తారు. ఫైజ్ అహమద్ ఫైజ్ కవిత "హం దేఖేంగే" చదవడం ఈ "మహత్తర ప్రజాస్వామ్య" దేశంలో దేశద్రోహం అయిపోయింది. గుజరాత్ సమాచార్ పత్రిక మీద ప్రభుత్వం దాడి చేస్తుంది. ఇది గుజరాత్‌లో అతి పెద్ద పత్రిక. ఈ పత్రిక మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడి చేయడం అంటే ఆ పత్రికను అదానీ మింగేయబోతున్నారని సంకేతం ఇవ్వడమే. పహల్గాంలో తీవ్రవాదుల దాడి తరవాత ఆ దాడికి బాధ్యులని ప్రభుత్వం భావించిన అనుమానితుల ఇళ్లను బుల్డోజర్లతో సైన్యం కూల్చేసింది. ఉత్తరప్రదేశ్, మరికొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలలో నైతె పోలీసులు బుల్డోజర్లతో కూల్చేస్తారు. జమ్మూ-కశ్మీర్‌లో తీవ్రవాద బెరుకు ఉంటుంది కనక ఏకంగా సైనికులే వాటితో అనుమానితుల ఇళ్లు కూల్చేస్తారు. వారు కేవలం అనుమానితులే తప్ప నేరస్థులుగా తేలలేదు. అయినా వారు ముస్లింలు కనక విచారణ, నేర నిర్ధారణ లాంటి తతంగాలు లేకుండానే మోదీ ప్రభుత్వం వారి ఇళ్ల మీంచి బుల్డోజర్లు నడుపుతుంది. ఈ దేశంలో చట్టం అందరికీ సమానం అని చెప్తారు. కానీ ఈ అంశాల్లో వేటిని పరిశీలించినా సమన్యాయం దక్కుతుందన్న భరోసా ఏ మాత్రం కలగదు. ముస్లింలకు ఒక న్యాయం, హిందుత్వ వాదులకు మరో న్యాయం అని మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి రుజువు అవుతూనే ఉంది. ఈ దేశంలో అనుసరించేది ద్వంద్వ నీతే. దేశంలోకెల్లా అతి పెద్ద ప్రైవేట్ విశ్వవిద్యాలయం అయిన అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎత్తి చూపింది సరిగ్గా ఈ ద్వంద్వ నాయాన్నే. ఆపరేషన్ సిందూర్ తరవాత ఆయన ఫేస్ బుక్‌లో ఓ వ్యాఖ్య పెట్టారు. ఆ వ్యాఖ్య దాదాపు ఒక పేజీ నిడివిన ఉంది. అందులో ఎక్కడా దేశద్రోహ పూరితమైన పదాలు, వాక్యాలు లేవు. అయినా ప్రభుత్వం ఆయన మీద దేశద్రోహ ఆరోపణ మోపి అరెస్టు చేసి జైలులో తోసింది. జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి ఉమర్ ఖాలిద్ మీదా ఇదే దేశద్రోహ కేసు నమోదై అయిదేళ్లయింది. అప్పటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు. జామీను కూడా ఇవ్వలేదు. విచారణ ఎప్పుడు ప్రారంభమవుతుందో, అది ఎప్పటికి పూర్తి అవుతుందో ఎవరికీ తెలియదు. ఉమర్ ఖాలిద్ లాంటి వారు-గుల్ఫిషా ఫాతిమా, షిర్జిల్ ఇమాం లాంటి వారు ఇదే రీతిలో జైలులో మగ్గుతున్నారు. వారి అతీగతీ ఎవరికీ పట్టదు. పట్టించుకున్న వారిని మోదీ ప్రభుత్వం అర్బన్ నక్సలైట్లుగా పరిగణిస్తుంది. మరీ మాట్లాడితే జైలులో తోస్తుంది. ప్రొఫెసర్ అలీ ఖాన్ తన ఎఫ్.బి. పోస్టులో రాసిన పేజీ అంతా చదివితే " అనేక మంది లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషీని అభినందిస్తున్నందుకు నాకు ఆనందంగానే ఉంది. కాని వీరు మూక హత్యలకు గురైన వారి గురించి, ఏకపక్షంగా బుల్డోజర్లతో కూల్చి వేసిన ఇళ్ల గురించి ఎందుకు మాట్లాడరో! బీజేపీ విద్వేష ప్రచారాన్ని ఎందుకు ప్రశ్నించరో! భారత పౌరులకు రక్షణ ఎందుకు కల్పించరో!" అని మాత్రమే అలీఖాన్ అడిగారు. అంటే ఆయన నేరుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మొదలు పెట్టారన్నమాట. మోదీ హయాంలో ప్రశ్నించే వారెవరికైనా ఏ గతి పడ్తుందో ఆ ప్రొఫెసర్ గ్రహించకపోతే ఎలా?

ఇలాంటి సందర్భాలలో సుప్రీంకోర్టు సైతం ద్వంద్వ వైఖరే అనుసరిస్తుంది. అలీఖాన్‌కు హైకోర్టులో న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు ఆయనకు ఎలాంటి ఊరట కలిగించకుండా ఈ వ్యవహారాన్ని నిరవధికంగా సాచి వేయడానికి అనువుగా రెండు పనులు చేసింది. హైకోర్టు అలీఖాన్ వ్యవహారంలో నాలుగు గంటలలోగా ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. విచారణ జరగవలసి ఉంది. అలీఖాన్ అన్న మాటలు, ఫేస్‌బుక్‌లో రాసిన రాతలు నిగూఢమైనవి ఏమీ కావు. ఆ మాటల వెనక ఉన్న అంతరార్థాన్ని వెతికి పట్టవలసిన అవసరం అంతకన్నా లేదు. అంటే షా విషయంలో తాత్సారం చేయడానికి సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించినట్టే. ఏ ఆధారమూ లేని ప్రొఫెసర్ విషయంలో మాత్రం విజయ్ షాకు కల్పించిన వెసులుబాటు కల్పించలేదు. ముస్లింల విషయంలో ప్రభుత్వమే కాదు సుప్రీంకోర్టు కూడా పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తోందనడానికి ఇంతకన్నా ఏం కావాలి. 2002 గుజరాత్ మారణకాండ సందర్భంగా బిల్కిస్ బానో కళ్లెదుటే పసి పాపను హతమార్చిన, చివరకు ఆమె కుటుంబ సభ్యుల ఎదుటే బిల్కిస్ బానో మీద సామూహిక అత్యాచారం చేసిన వారిని, ఆమె కుటుంబంలో అనేక మందిని హతమార్చిన వారికి న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తే వారి "సత్ప్రవర్తన"కు మెచ్చి మోదీ ప్రభుత్వం శిక్ష పూర్తి కాకుండానే ఆ కిరాతకులను విడుదల చేసినా న్యాయవ్యవస్థ నుంచి ఇప్పటి దాకా ఒక్క మాటా వినిపించలేదు. హిందుత్వవాదుల మాటే నెగ్గింది. ఎన్ని సార్లు, ఎన్ని చోట్ల మూక దాడులకు ఎంత మంది బలై పోయినా ఇప్పటి వరకు ఎవరికీ శిక్ష పడ్డ దాఖలాలే లేవు. మాట్లాడినా, రాసినా దేశద్రోహం కింద, జాతి వ్యతిరేక చర్యగా, మత విశ్వాసాలను గాయపరిచారని భావించి శిక్షించడం ఇంకెన్నాళ్లు కొనసాగుతుంది? విజయ్ షా విషయంలో ఎఫ్ఐఆర్. దాఖలు చేయాలని ఆదేశించడం, ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయడం లాంటివన్నీ చివరకు కంటి తుడుపు చర్యగానే మిగిలిపోతాయనడానికి గతానుభవంలో అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. విజయ షాను అరెస్టు చేయాలని కడకు సుప్రీంకోర్టు కూడా ఆదేశించకపోవడం చూస్తే అయిన వారి విషయంలో చట్టం భిన్నంగా పని చేస్తుందనుకోవాల్సిందే. నిజానికి విజయ్ షా వ్యాఖ్యలు కేవలం అభ్యంతరకరమైనవి కావు. అవి అవమానకరం, స్త్రీలను, ముఖ్యంగా ముస్లిం మహిళలను తూలనాడడమే. విజయ్ షా విషయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు. కానీ ఆయనను అరెస్టు చేయమని ఆదేశించలేదు. అత్యున్నత న్యాయస్థానం కూడా ద్వంద్వ నీతికి అతీతం కాదు అని రుజువు చేయడానికి ఈ వివక్ష బాగా ఉపకరిస్తుంది.

బీహార్‌లో అమిత్‌షాకు భంగపాటు

అరుణ్‌శ్రీవత్సవ

కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీకి గత వారం బీహార్ పర్యటన సందర్భంగా విద్యార్థులు, సామాన్య ప్రజల నుంచి అపార స్పందన లభించింది. ఆయన దర్భంగ హాస్టల్‌లో ఉంటున్న దళితులు, ఓబీసీలను కలవకుండా చూడాలని హోంమంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ను ముందుగానే హెచ్చరించారు. అయినప్పటికీ ఈ విషయంలో నితీశ్‌కుమార్ పూర్తిగా విఫలమవ్వడంతో అమిత్‌షా భంగపడక తప్పలేదు. ఎస్సీ హాస్టల్‌కు చేరి విద్యార్థులతో మాట్లాడేందుకు అనుమతి కావాలని ప్రభుత్వాన్ని కోరినప్పటికీ తిరస్కరించారు. అయినా విద్యార్థులు ఏమాత్రం వెనుకాడకుండా రాహుల్‌ను ఆహ్వానించారు. సాధారణంగా ఉన్నత వర్గాలకు చెందిన విద్యార్థులు బీజేపీ నాయకులను అనుసరించేవారు. అయితే ఈసారి ఉన్నత వర్గాల విద్యార్థులు సైతం రాహుల్‌తో మాట్లాడేందుకు ఎంతో ఉత్సాహం చూపించారు. రాహుల్ తన ప్రసంగంలో ఎలాంటి చెత్త విషయాలను ప్రస్తావించక పోవడంతో ఉన్నత వర్గాల విద్యార్థులు కూడా హాస్టల్‌కు చేరుకొని రాహుల్‌ను కలుసుకునేందుకు సమూహంగా ప్రయత్నించారు. ఇది బీజేపీ, జేడీ(యూ) నాయకుల వెన్నులో వణుకు పుట్టించింది. రాహుల్‌కు ఉన్నత వర్గాల విద్యార్థులు మద్దతు తెలియజేస్తారని ఈ నాయకులు ఏనాడూ కనీసం ఊహించలేదు. రాహుల్ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యానాలను విద్యార్థులు ఎంతగానో ప్రశంసించారు. అనుమతి లేకపోయినప్పటికీ రాహుల్ హాస్టల్‌కు చేరుకోవడంపై రెండు ఎఫ్ఐఆర్‌లు రాహుల్ మీద నమోదు చేయించారు. ఈ రెండూ అమిత్‌షా, నితీశ్‌కుమార్ తనకు బహూకరించిన మెడల్స్ అని రాహుల్ వ్యాఖ్యానించడంతో విద్యార్థులంతా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

ఉన్నత కులాల విద్యార్థులు బీజేపీ నాయకత్వాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ప్రత్యేకించి అమిత్‌షా, నితీశ్‌ను విద్యార్థులే కాక యువకులు, రోజువారీ పనిపాటలు చేసుకునే వారు వ్యతిరేకిస్తున్నారు. తమను ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారని దళితులు, ఉన్నత కులాల విద్యార్థులు సైతం విమర్శలు చేస్తున్నారు. దళితులు వెనుకబడిన కులాల విద్యార్థులు మాత్రమే కాదు ఉన్నత కులాల విద్యార్థులు సైతం ఆర్థికంగా తమను ఆదుకోవడం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శిస్తున్నారు. తమకు ఎటువంటి సహాయం అందజేయకుండా కాషాయ దళాలు హింసాయుత కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచకుండా బీజేపీ, జేడీ(యూ) స్వప్రయోజనాల కోసం తమను వినియోగించుకుంటునాయని నిరసిస్తున్నారు. సంపన్న వర్గాలకు, భూస్వాములకు చెందిన విద్యార్థులు, యువకులు మాత్రమే ప్రభుత్వం నుంచి ప్రయోజనం పొందుతున్నారని దళితులు, ఓబీసీలు ధ్వజమెత్తుతున్నారు. దళితులు రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో ఉన్నారని ఇప్పటికైనా వారికి తగిన వాటా రిజర్వేషన్‌లను కల్పించాలని రాహుల్‌గాంధీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దళితులు సైతం ప్రతి సంస్థలోను నాయకత్వ పదవులను పొందాలని రాహుల్ అన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి సంస్థలో దళితులకు నాయకత్వ పదవులను కేటాయిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. డాక్టర్ అంబేద్కర్ ఎప్పుడూ ఈ విషయాన్నే కోరేవారు. ఉన్నత కులాలకు చెందిన ప్రజలు, దళితులు, పేదలకు చెందవలసిన పదవులను ఆక్రమించుకొని ఉన్నారు. దళితులు, వెనుకబడిన విద్యార్థులు సైతం తమకు కేటాయించిన పదవులను అందుకునేందుకు సిద్ధపడాలని రాహుల్ చెప్పారు. ఇటీవల కాలంలో వాస్తవంగా ఉన్నత కులాల విద్యార్థులు స్కూళ్లు, కాలేజీల నుంచి ఉపసంహరించుకుంటున్నారు. ఎందుకంటే చదువుకునేందుకు తమకు ఆర్థిక మద్దతు లభించటం లేదని చెప్తున్నారు.

బీహార్ రాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్నందున రాహుల్‌గాంధీ తరచుగా రాష్ట్రంలో పర్యటించి దళితులు, ఎస్సీలు, బీసీలను కలుసుకొని మాట్లాడుతున్నారు. దీని ప్రభావం రాజకీయంగా చాలా ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలలో కాంగ్రెస్‌ను పునరుజ్జీవింప చేసేందుకు రాహుల్ పర్యటన ఎంతగానో దోహదం చేస్తుందని భావిస్తున్నారు. మితవాద శక్తుల ప్రభావం మరింత విస్తరించకుండా నిరోధించేందుకు రాహుల్ ప్రసంగాలు ఉపయోగపడుతున్నాయి. మితవాదులు భారతదేశ సంస్కృతిని, సామాజిక సంప్రదాయాలను, ప్రజాస్వామ్య సంస్థలను ధ్వంసం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ ఎన్నికలలో మితవాదులను తిరస్కరించి తమను ఆదరించే వారికి ఓటు వేయాలని భావిస్తున్నట్టు రాహుల్ కార్యక్రమాలకు వచ్చే జన సమూహాలను చూసినట్లయితే అర్థమవుతుంది. దళితులు, ఎస్సీ, బీసీ వర్గాలను దర్భంగాలో స్వయంగా కలుసుకోవడమే గాక రాహుల్ రాష్ట్ర రాజధాని పాట్నాలో పూలేపై నిర్మించిన చలనచిత్రాన్ని కూడా చూశారు. దళిత, ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. వారి సామాజిక బాధ్యతలను నిర్వహించేందుకు ప్రోత్సహించాలన్నారు. రాహుల్ 'శిక్ష న్యాయ సంవాద్' ప్రచారాన్ని దర్భంగాలో నిర్వహిస్తూ ఎస్సీ, గిరిజనులు, ఎస్టీ వర్గాలను స్వయంగా కలుసుకొని మాట్లాడారు. నరేంద్రమోదీ, అమిత్‌షా, నితీశ్‌కుమార్ రాహుల్‌కు వస్తున్న ఆదరణను గమనించి హిందుత్వ శక్తులను తమ వైపు తిప్పుకునేందుకు ఆర్ఎస్ఎస్ కృషి చేయాలని కోరుతున్నారు. అంబేద్కర్ హాస్టళ్లలో విద్యార్థులను రాహుల్ కలవనివ్వకుండా నితీశ్‌కుమార్ తన శాయశక్తులా పనిచేస్తున్నారు. డా॥మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలో ఎస్సీ-ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నిధులను కేటాయించగా ఇప్పుడు నితీశ్‌కుమార్ ప్రభుత్వం ఎత్తివేసిందని రాహుల్ తీవ్రంగా విమర్శించారు.

డబ్ల్యూటీఓ పట్ల అమెరికా దృక్పథం మారిందా!

టి. లక్ష్మీనారాయణ

డంకెల్ డ్రాఫ్ట్, గాట్ ఒప్పందం నాడు మన గుండెల్లో గుబులు రేపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోట "అమెరికా రక్షణాత్మక విధానాలు" మాట నేడు బలంగా వినపడటం చరిత్ర పరిణామ క్రమంలో ఒక మూల మలుపును సూచిస్తున్నది. సుంకాల యుద్ధాన్ని ట్రంప్ ఏకపక్షంగా ప్రారంభించి, ప్రపంచ దేశాలన్నింటినీ తనమన అన్న తేడా లేకుండా గందరగోళంలోకి నెట్టి, విమర్శలు- ప్రతిఘటన ఎదురుకావడంతో తాత్కాలికంగా వెనక్కితగ్గారు. "ఏరా పడ్డావ్! అంటే అదో లగువ్ లే", అన్నట్లు ట్రంప్ వ్యవహరిస్తున్నారు. ఈ పూర్వరంగంలో కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు 5 వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వ్యాసం రాస్తున్నాను. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఆవిర్భావం పూర్వరంగం, ఆ సంస్థ ఆమోదించిన నిబంధనలు - పర్యవసానాలపై తీవ్రఆందోళన చెందుతూ, భారతదేశ వ్యవసాయ రంగానికి - రైతాంగానికి జరగబోయే నష్టాలను వివరిస్తూ, 1994-95 సంవత్సరాల్లో "డంకెల్ డ్రాఫ్ట్‌లో మార్పు సాధించాలి, ప్రపంచ వాణిజ్య సంస్థ(గాట్), డబ్ల్యూటీఓ - ప్రజల అప్రమత్తత, ప్రపంచ వాణిజ్య సంస్థ - రైతాంగ రక్షణ, డబ్ల్యూటీఓ - వ్యవసాయ సంక్షోభం", శీర్షికలతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు విశ్లేషణాత్మకమైన పుస్తకాలను రాసి, ప్రచురించి, విస్తృతంగా రైతాంగంలోకి తీసుకెళ్లారు. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) లో భారతదేశం సభ్యత్వం కలిగి వుంటూనే ప్రతికూలాంశాలలో మార్పు కోసం రాజకీయ సంకల్పంతో ఉద్యమించాల్సిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. ప్రచారాందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. పత్తిలో బీటీ జన్యుమార్పిడి విత్తనాల విక్రయంలో ప్రముఖ బహుళజాతి విత్తన కంపెనీ మోన్‌శాంటో దోపిడీకి అడ్డుకట్ట వేయడానికి, అధిక ధరలకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో భాగంగా సుప్రీం కోర్టు తలుపులు కూడా తట్టి, విజయం సాధించారు.

అమెరికా రక్షణవాదం: "అమెరికా ఫస్ట్" నినాదంతో రెండోసారి అధికారపీఠంపై కూర్చున్న ట్రంప్, అమెరికా రక్షణవాదంతో స్వదేశస్తులను, అంతర్జాతీయ రాజకీయ - భౌగోళిక వ్యూహాలను, ఆర్థిక - వాణిజ్య విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తూ, ఆధిపత్య మనస్తత్వంతో, ఏకపక్షంగా, పూటకో మాట మాట్లాడుతున్నారు. తద్వారా ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాదం నాయకత్వ పాత్రను బలహీనపరిచే వైపు అడుగులు పడుతున్నట్లు కనపడుతున్నది. అభివృద్ధి చెందిన దేశాలకు ప్రయోజనం కలిగించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు రాచబాట వేసే అంతర్జాతీయ వేదికగా డబ్ల్యూటీఓను నెలకొల్పడంలో ముఖ్య భూమిక పోషించింది అమెరికానే. నేడు ఆ వ్యవస్థను బలహీనపరిచే విధంగా అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించే డబ్ల్యూటీఓ నిబంధనలను భేఖాతరు చేసిందీ అమెరికానే. స్వప్రయోజనాల కోసం అహంభావంతో ట్రంప్ విర్రవీగారు. బహుళజాతి సంస్థలు తమ వ్యాపారం ఎలా చేస్తాయో! పునరాలోచించుకోవాలంటూ హెచ్చరికలు చేశారు. దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసే శక్తిగా చైనా: డబ్ల్యూటీఓ ఆవిర్భవించే నాటికి చైనా సభ్య దేశం కాదు. 2001లో డబ్ల్యూటీఓలో చేరి అవకాశాలను అందిపుచ్చుకున్నది. ప్రపంచ ఫ్యాక్టరీగా ఆవిర్భవించి, అమెరికాతో సహా అంతర్జాతీయ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయించే స్థాయికి ఎదిగింది. అమెరికాకు చైనాతోనే భారీ స్థాయిలో వాణిజ్య లోటు ఉండడం ట్రంప్ ఏ మాత్రం జీర్ణించుకోలేక పోతున్నారు. అమెరికా అనుసరిస్తున్న "టార్గెట్ చైనా" విధానానికి మరింత పదునుపెట్టారు. విముక్తి సుంకాలు/ప్రతీకార సుంకాల పేరుతో సుంకాల యుద్ధాన్ని ప్రత్యర్థి చైనా లక్ష్యంగా సాగించారు. పర్యవసానంగా బహుళ జాతి సంస్థలు - పారిశ్రామిక - వాణిజ్య - వ్యాపార సంస్థలు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డాయి. షేర్ మార్కెట్ సంక్షోభం వైపు పరుగులు తీసింది. ధరల పెరుగుదల భరించలేని అమెరికా ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగరేసి "ట్రంప్ ఫాసిస్టు పాలన మాకొద్దు" అంటూ రోడ్లెక్కారు. నాటో కూటమి సభ్య దేశాలు, ఐరోపా దేశాలు మొదలుకొని మిత్ర దేశాలన్నీ మిరియాలు కారాలు నూరాయి. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించి, ప్రాంతీయ - ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకునే వైపు వేగంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలెట్టాయి. పరిస్థితుల తీవ్రతను గుర్తించి అమెరికా - చైనా పెంచిన ప్రతీకార సుంకాలను భేషరతుగా ఉపసంహరించుకుని, ద్వైపాక్షిక చర్చలకు అవకాశం కల్పిస్తూ, 90 రోజుల విరమణ ప్రకటించాయి. అయితే, వాటి మధ్య సాంకేతిక ఆధిపత్యం కోసం "టెక్ వార్" కొనసాగుతూనే ఉన్నది. సుంకాల యుద్ధం, టెక్ వార్‌లను కొత్త రకం ప్రచ్ఛన్న యుద్ధంగా అభివర్ణిస్తున్నారు. ప్రపంచ దృశ్యం మరింత బహుళ ధ్రువంగా మారుతోంది. కానీ, అమెరికా ఆర్థిక బలం, సాంకేతిక ఆవిష్కరణలు, ప్రపంచ వ్యాపితంగా సైనిక సామర్థ్యాలు - దేశాలతో సైనిక ఒప్పందాలు, మిత్ర దేశాలతో నిర్మించుకున్న మైత్రి వ్యవస్థతో అమెరికా ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా కొనసాగుతున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, నాటో, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ, ప్రపంచ బ్యాంకు, ఇతర అంతర్జాతీయ సంస్థలను మరింత లొంగదీసుకోవడానికి, వాటి ప్రాముఖ్యతను బలహీనపరిచే తీరులో ట్రంప్ వైఖరి ఉన్నది.

ప్రచ్ఛన్న యుద్ధం - భావజాలం: గతంలో అమెరికా -సోవియట్ యూనియన్ మధ్య కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధం పెట్టుబడిదారీ, కమ్యూనిస్టు భావజాలం మధ్య జరిగినట్లుగా భావించారు. అమెరికా, చైనా, రష్యా మధ్య నేడు జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధ స్వభావం రెండు భావజాలాల మధ్య కాదన్నది సుస్పష్టం. ఒకప్పుడు అమెరికాకు ప్రధాన పోటీదారుగా ఉన్న సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత ఆవిర్భవించిన రష్యా ప్రపంచ వేదికపై వెనకబడ్డది. ప్రపంచ రాజకీయాల్లో రష్యా ప్రాముఖ్యత తగ్గింది. కానీ, భారీగా అణ్వాయుధాలు, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో వీటో హక్కు ఉన్న శాశ్వత సభ్యత్వం, చైనాతో వ్యూహాత్మక పొత్తుతో ప్రపంచ రాజకీయాల్లో రష్యా ఒక ముఖ్యమైన పాత్రధారిగానే ఉన్నది. 1990 దశకంలో సోషలిస్టు కూటమి కుప్పకూలిన నేపథ్యంలో ప్రపంచంపై తిరుగులేని ఆధిపత్యం కోసం, దోపిడీని ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుబడిదారీ ప్రపంచీకరణ భావజాలానికి అమెరికన్ సామ్రాజ్యవాదమే నేతృత్వం వహించింది. చారిత్రకంగా వాణిజ్యం, విదేశాంగ విధానం ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. విదేశాంగ విధానం రూపకల్పనలో వాణిజ్య ప్రయోజనాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. 1929 -33 మహా ఆర్థిక మాంద్యం తర్వాత, దేశాలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని పరిమితం చేయడానికి సుంకాల విధానం ప్రవేశపెట్టాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు పునరావృతం కాకూడదనే కోరికతో శాంతి - భద్రత కోసం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కోసమని సుంకాలు, వాణిజ్యంపై సాధారణ ఒప్పందం (గాట్) వ్యవస్థకు పురుడు పోశాయి. 1948- 94 మధ్య కాలంలో ప్రపంచ వాణిజ్యంలో గాట్ తన వంతు పాత్ర పోషించింది. వాణిజ్యం - ఆర్థిక అభివృద్ధికి మద్దతు ఇవ్వడంలో, దేశాల మధ్య శాంతియుత సంబంధాలను ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర పోషించిందని చెబుతుంటారు. 1994 ఏప్రిల్ 15 న డంకెల్ డ్రాఫ్టుపై 123 దేశాలు మొరాకోలో సమావేశమై నియమాల ఆధారిత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థకు వేదికగా ప్రపంచ వాణిజ్య సంస్థను స్థాపించే మారకేష్ ఒప్పందంపై సంతకం చేశాయి. 1995 జనవరి 1 న డబ్ల్యూటీఓ ఆవిర్భవించింది. స్విట్జర్లాండ్‌లోని జెనీవా కేంద్ర స్థానంగా ఉన్న డబ్ల్యూటీఓలో ప్రస్తుతం 166 సభ్య దేశాలున్నాయి. వాటిలో 117 అభివృద్ధి చెందుతున్న దేశాలున్నాయి. 23 దేశాలు పరిశీలకులుగా ఉన్నాయి.

నేడు కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు
5వ వర్ధంతి సందర్భంగా

2001 లోనే "కమ్యూనిస్టు చైనా" డబ్ల్యూటీఓలో సభ్య దేశంగా చేరింది. పెట్టుబడిదారీ ప్రపంచీకరణ భావజాలాన్ని చక్కగా అందిపుచ్చుకొని ప్రపంచ కర్మాగారంగా తయారయింది. అమెరికా మార్కెట్‌తో సహా ప్రపంచ మార్కెట్‌ను సొంతం చేసుకుని, అనూహ్యంగా లబ్ధిపొందింది. ప్రపంచ వాణిజ్యంలో చైనా ప్రధాన పాత్రధారిగా ఎదిగింది. ఎగుమతులు, దిగుమతుల్లో తన వాటా గణనీయంగా పెంచుకున్నది. డబ్ల్యూటీఓలో చేరక ముందు 3.6% ఉన్న వాటా 2023 నాటికే 12.3% కి చేరుకుంది. తాజా గణాంకాలను బట్టి అంతర్జాతీయ వాణిజ్యంలో 30% చైనాదేనట. అమెరికా వాటా 15.6% నుంచి 10.8%కి దిగజారింది. ఎగుమతులతో పోలిస్తే చైనా నుంచి అమెరికా దిగుమతులు భారీగా పెరగడం వల్ల గణనీయమైన వాణిజ్య లోటు ఏర్పడింది. అమెరికా రుణంలో చైనా గణనీయమైన వాటాను కలిగి ఉన్నది. అమెరికా ఆర్థిక సార్వభౌమత్వాన్ని బలోపేతం చేయడానికి సుంకాలను పెంచానని ట్రంప్ వెల్లడించడంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ డొల్లతనం బహిర్గతమయింది. ప్రపంచీకరణ పర్యవసానంగా పెట్టుబడుల రంగం - దేశీయ పారిశ్రామిక రంగం - ఉపాధి రంగం తీవ్రంగా నష్టపోయిందని, విదేశీ వాణిజ్య లోటు దేశాన్ని తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని, దిగుమతి సుంకాలను పెంచకపోతే కోలుకోవడం అసాధ్యమని, ఉక్రోషంతో ట్రంప్ ఊగిపోతున్నారు. 21 వ శతాబ్దంలోకి అడుగుపెడుతున్నప్పుడు అమెరికా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నాయకుడిగా ఎదురులేని స్థితిలో ఉంది. అమెరికా ఆర్థిక పునరుజ్జీవనంలో మిగతా ప్రపంచంతో ఆర్థిక సంబంధాలు కీలక పాత్ర పోషించాయి, పోషిస్తున్నాయి. చాలా విదేశీ వస్తువులు సున్నా లేదా తక్కువ సుంకాలతో దిగుమతి చేసుకోవడానికి అనుమతించిన విధానం ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి సహాయపడ్డాయి. కొత్త శతాబ్దం ప్రారంభమైన తర్వాత ప్రపంచీకరణ ప్రక్రియలో భాగంగా అమెరికా మిగిలిన ప్రపంచంతో ఆర్థిక - వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడుతోంది. అమెరికా సృష్టించిన, నాయకత్వం వహించిన అంతర్జాతీయ సంస్థలు అత్యధికంగా అమెరికా ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాయి, ఇస్తున్నాయి. వాటి నియమాలు వివక్షతతో కూడుకున్నవిగా గుర్తించినా వాటిని మార్చలేదు. ఏకపక్షవాదం లేదా ఒకే ప్రపంచవాదం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరిచే ప్రమాదం ఉంది. పెట్టుబడిదారీ ప్రపంచీకరణ సృష్టించిన దుష్ఫలితాల నుంచి బయటపడడానికి లేదా కనీసం తగ్గించడానికి, ప్రపంచ ఆర్థిక స్థిరత్వం, వృద్ధిని ప్రోత్సహించడానికి ఐక్యరాజ్య సమితి, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, డబ్లూటీఓ, తదితర అంతర్జాతీయ సంస్థలను అభివృద్ధి చెందుతున్న, వెనుకబడ్డ దేశాల ప్రగతికి దోహదపడే విధంగా సమూలంగా సంస్కరించి, బలోపేతం చేయాలి. అమెరికా ఆధిపత్యానికి, డాలర్ పెత్తనానికి చెల్లుచీటి రాసి, నూతన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోసం ప్రపంచ దేశాలు కృషి చేయాలి. అంతర్జాతీయ సంబంధాలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పునఃపొందికలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలు పెట్టుబడిదారీ ప్రపంచీకరణను తిరోగమన (ప్రపంచీకరణ ఉపసంహరణ) దిశ వైపుకు మళ్లించాయన్న చర్చకు తెరలేపాయి. నేడు పెట్టుబడిదారీ ప్రపంచీకరణకు చైనా బలమైన మద్దతుదారుగా నిలుస్తుంటే, అమెరికా ఆత్మరక్షణలో పడి జాతీయ రక్షణ వాదంతో సతమతమవుతున్నది.

సమన్వయకర్త కొల్లి నాగేశ్వరరావు అధ్యయన వేదిక

ప్రభుత్వం రైతుల పక్షమా? కార్పొరేట్ల పక్షమా?

పి.జమలయ్య

నల్లబర్లీ పొగాకును పండించిన రైతులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. గత సంవత్సరం చెల్లించిన ధరలకే పొగాకు కొనుగోలు చేయాలని కంపెనీలకు ఆదేశాలు ఇవ్వకుండా మినహాయింపులు ఇచ్చింది. నిరుడు క్వింటా రూ 15,000 నుంచి రూ 18 వేలకు కంపెనీలు కొనుగోలు చేశాయి. కంపెనీలన్నీ సిండికేట్‌గా మారి ఈ ఏడాది క్వింటా పొగాకును రూ 2,500 నుంచి రూ 4,000 వరకే కొనుగోలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నల్లబర్లీ పొగాకును రూ 12,500 లకు కొనుగోలు చేయాలని కంపెనీలకు సూచించారు. ఏప్రిల్ 29 న గుంటూరు లాంలో జరిగిన పొగాకు కొనుగోలు సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడు మాట్లాడుతూ నిరుడు చెల్లించిన ధరలకే నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. కంపెనీలు కూడా దానికి అంగీకరించాయి. కానీ ఆచరణలో ఒక్క కిలో పొగాకును కూడా కొనుగోలు చేయకుండా వ్యవసాయశాఖ మంత్రి ఆదేశాలను బేఖాతరు చేశాయి. ఎక్కడ పొగాకు అక్కడే నిలిచిపోయింది. అకాల వర్షాల వల్ల తడిసి రంగు మారిపోతున్నది. ప్రతిరోజు తిరగవేయడం ద్వారా కూలి ఖర్చులు పెరుగుతున్నాయి. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీ భారాలు పెరుగుతున్నాయి. భార్య మెడలో ఉన్న పుస్తెలను తాకట్టు పెట్టి పొగాకును పండించారు. రైతు మహిళల మెడలో పసుపు కొమ్ములున్నాయి. నగలేమో బ్యాంకు తాకట్టులో ఉన్నాయి. మరల ఖరీఫ్‌కు సిద్ధం కావాలంటే తాకట్టు పెడతానికి ఏమి లేవు. సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ముగ్గురు కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇంకా భవిష్యత్తులో ఎంతమందిని ఇలా చూడాలో తలుచుకుంటేనే ఆందోళనగా ఉంది.

నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నిరుడు చెల్లించిన ధరలకే పొగాకును కొనుగోలు చేయమని చెప్పకపోగా తగ్గించి కొనుగోలు చేయమని సలహాలు ఇవ్వటం రైతుల పక్షాన ఉన్నట్లా లేక పొగాకు కంపెనీల వైపు ఉన్నట్లా ? రైతే రాజు రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతుల ఆదాయం పెంచుతామని ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పొగాకు ధరలు తగ్గించి కొనుగోలు చేయమని కోరడమంటే రైతులకు అన్యాయం చేయడమే అవుతుంది. ప్రతి ఏడాది వ్యవసాయ ఖర్చులు, కౌలురేట్లు పెరుగుతున్నాయి. సాగుభారంగా మారింది. కనీసం ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఒక ఎకరంలో నల్లబర్లీ పొగాకు సాగు చేస్తే సుమారు లక్షా 50 వేల రూపాయలు వరకు ఖర్చు అవుతుందని సాగు చేసిన రైతులు తెలుపుతున్నారు. ఇందులో కౌలే రూ 40 వేలు ముందస్తుగా చెల్లించాలి. గుంటూరు జిల్లా, పత్తిపాడు మండలం, కొత్త మల్లయ్యపాలెం గ్రామంలో ఒక పొగాకు కౌలురైతు 7 ఎకరాలు సాగు చేయగా సగటున తొమ్మిది క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ 1,20,000 నుంచి రూ 1,50,000 వరకు పెట్టుబడి పెట్టాడు. దీని ప్రకారం పరిశీలించినా కనీసం పెట్టిన ఖర్చులు రావాలన్న క్వింటా పొగాకు రూ 15 వేలకైనా కొనుగోలు చేయవలసి ఉంటుంది. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు తదితర ఖర్చుల కోసం తిరిగి అప్పు చేయాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో వరుసగా మూడు సంవత్సరాల నుంచి ఏ పంటలు పండించినా ధరలు లేకపోవడంతో నల్లబర్లీ పొగాకు సాగు వైపు గ్రామీణ పేదలు మళ్లారు. పొగాకు ధరలు స్థిరంగా ఉండటంతో కనీసం పెట్టిన పెట్టుబడి వస్తుందని ఆశతో అధిక కౌలు చెల్లించి సాగు చేశారు. సాగు చేసిన వారిలో 90 శాతం మంది కౌలు రైతులే. అందులో నిరుపేదలైన బడుగు, బలహీన వర్గాల వారే గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పొగాకు రైతులకు భరోసా ఇచ్చి మాట నిలబెట్టుకోవలసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కంపెనీల వైపు మొగ్గు చూపుతూ రైతాంగాన్ని నిర్లక్ష్యం చేయటం బాధాకరం. ధరలు బాగా ఉన్నప్పుడు లాభాలు గడించిన కంపెనీలు ధరల పడిపోతున్నప్పుడు లాభాల్లో ఒక శాతం తగ్గించుకొని పొగాకు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంపెనీలను ఎందుకు ఆదేశించలేకపోతున్నారన్నది పెద్ద ప్రశ్నగా మారింది. వ్యవసాయంలో స్థిరమైన ఆదాయాలు కల్పిస్తామని సంపద సృష్టించి రైతులను ఆదుకుంటామని అందుకు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు కోటలు దాటుతున్నా ఆచరణలో ఆ మాటలు గడప దాటడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పొగాకు రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి ద్వారా కంపెనీలపై ఒత్తిడి తీసుకువచ్చి నిరుడు చెల్లించిన ధరలకే నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయమని ఉత్తర్వులు ఇప్పించకుండా సన్నాయి నొక్కులు నొక్కటం బాధాకరం. సాగు పెరిగింది కనుక దిగుబడి పెరిగిందని చెప్పటం వట్టి బూటకం. ఎకరానికి 15 క్వింటాళ్లు రావలసి ఉండగా ఈ ఏడాది కేవలం 9 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు బాగానే ఉన్నాయి. దీంతోబాటు డాలర్ విలువ మారటం వల్ల, బర్లీ పొగాకు ఎగుమతుల వలన కంపెనీలకు అధిక లాభాలు వస్తున్నాయి. కంపెనీలు సిండికేట్‌గా మారి పొగాకు ధరలను అధఃపాతాళానికి తొక్కి లాభాలు సంపాదించాలని చూస్తున్నాయి. నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేసే బహుళజాతి కంపెనీలు పొగాకు రైతుల శ్రమతో కోట్లాది రూపాయలు గడించాయి. భారతదేశంలోని పొగాకు రైతులనేగాక ప్రపంచ ప్రజల రక్తాన్ని పీల్చి కోట్లకు పడగలెత్తాయి. కొన్ని సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను శాసించే పరిస్థితికి వచ్చాయి. ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలను విస్మరించకుండా పొగాకు కొనుగోలు చేసే కంపెనీలపై ఒత్తిడి తీసుకువచ్చి కొనుగోలు చేయించాలి. ఆదేశాలు పాటించని కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలి. హామీలిచ్చి, బాండ్లిచ్చి ఒప్పందాలు చేసుకొని కొనుగోలు చెయ్యని కంపెనీలపై ప్రభుత్వమే కేసులు పెట్టాలి. అప్పటికీ కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందు రాకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకొని ధరల స్థిరీకరణ నిధిని తక్షణమే ఏర్పాటు చేసి ప్రభుత్వ ఏజెన్సీ ద్వారా కొనుగోలు చేసి నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం,
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తేడా వస్తే మేఘ గర్జనే

ఎక్స్‌లో వాయుసేన వీడియో

న్యూదిల్లీ: ఉగ్ర స్థావరాలు ధ్వంసం చేసేందుకు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో భారత త్రివిధ దళాలు ఎంతో సమన్వయంతో వ్యవహరించాయి. కచ్చితత్వంతో లక్ష్యాలు ఛేదించాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలను మన బలగాలు ఎక్స్ వేదికగా షేర్ చేస్తున్నాయి. తాజాగా భారత వాయుసేన కూడా ఆ తరహా వీడియోను పంచుకుంది. 'నిత్యం దృఢ సంకల్పంతో స్పందిస్తాం' అంటూ తన సంసిద్ధత, సామర్థ్యాన్ని ప్రదర్శించింది. వైమానిక దళ విన్యాసాలు, కమాండర్ల వేగవంతమైన ప్రతిస్పందన ఎలా ఉంటుందో ఆ వీడియోలో చూపించారు. దేశ రక్షణ సమయంలో తేడా వస్తే 'మేఘంలా గర్జిస్తాం' అని చాటిచెప్పేలా ఉన్న ఆ దృశ్యాలు రోమాలు నిక్కబొడుచుకునేలా ఉన్నాయి. బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపిస్తోన్న గీతం దేశభక్తిని రగిలిస్తోంది.

యూట్యూబర్ జ్యోతిపై ప్రశ్నల వర్షం

చండీగఢ్: పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్న హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అధికారులు విచారిస్తున్నారు. ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు వివిధ కోణాల్లో ఆమె నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, దుబాయ్‌ల్లో ఆమె చేసిన పర్యటనలపై ప్రధానంగా దృష్టిసారించారు. 'నిందితురాలిని విచారించేందుకు ఎన్ఐఏ బృందం ఇక్కడికి వచ్చింది' అని హిస్సార్ ఎస్పీ శశాంక్‌కుమార్ సావన్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. 'ఇప్పటివరకు సేకరించిన సమాచారం ప్రకారం 2018లో ఆమెకు పాస్‌పోర్టు వచ్చింది. 2028 వరకు దానికి గడువు ఉంది. పాస్‌పోర్టు వచ్చినప్పటి నుంచి ఆమె పాకిస్థాన్, చైనా, దుబాయ్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, ఇండోనేసియాల్లో ప్రయాణించింది. ఆ పర్యటనల గురించి సమాచారం సేకరిస్తున్నాం' అని ఓ అధికారి వెల్లడించారు. 'ఈ కేసును ఫెడరల్ యాంటీ టెర్రర్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీకి అప్పగించే అంశాన్ని హోంశాఖ పరిగణనలోకి తీసుకోవచ్చు. పాక్ హైకమిషన్ అధికారులు, పాక్ ఇంటిలిజెన్స్ విభాగానికి చెందిన వ్యక్తులు ప్రచారం కోసం, సమాచారాన్ని సేకరించడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లను ఉపయోగించుకుంటున్న కుట్ర కోణాన్ని దర్యాప్తు చేసేందుకు ఆ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది' అని మరో అధికారి తెలిపారు. తాజా అరెస్టులతో భారత్‌లో గూఢచర్యం నెట్‌వర్క్‌ను నిర్వహించడానికి సాంకేతికతను ఉపయోగించుకుంటున్న తీరు బయటపడిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

మధ్యప్రదేశ్ మంత్రికి పదవీగండం?

భోపాల్: సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల దుమారం ఇంకా చల్లారలేదు. మంత్రి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ పరిణామాల వేళ మంత్రి పదవీగండం ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. విజయ్ షా వ్యాఖ్యలపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఆయనను ఇంకా ఎందుకు పదవి నుంచి తొలగించడం లేదని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మే 28న నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. మంత్రిపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై దర్యాప్తునకు ముగ్గురు సభ్యులతో ఏర్పాటైన సిట్ ఆ రోజున నివేదిక ఇవ్వనుంది. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆమెను విజయ్ షా 'ఉగ్రవాదుల సోదరి'గా పేర్కొనడంపై దుమారం రేగింది. దీంతో ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు... ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ మంత్రి సుప్రీంకోర్టును ఆశ్రయించగా... ఆయన క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. ఇదే అంశంపై నిన్న జరిగిన విచారణలో సుప్రీం ఆగ్రహం వ్యక్తంచేసింది. 'క్షమాపణలు ఎక్కడ చెప్పారు? ఎలా చెప్పారు? సారీ చెబుతున్నప్పుడు అందులో కొంత అర్థం ఉండాలి. కొన్నిసార్లు న్యాయ విచారణ తప్పించుకునేందుకు కొందరు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు నటిస్తారు. మరికొన్నిసార్లు మొసలి కన్నీరు కారుస్తారు. ఇందులో మీ క్షమాపణ ఎలాంటిది. న్యాయస్థానం అడిగింది కాబట్టి చెబుతున్నట్లుగా ఉంది మీ వ్యవహారం. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి మీకున్న అభ్యంతరం ఏంటీ' అని తీవ్రంగా మందలించింది.

శశిథరూర్‌కు దిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూదిల్లీ: బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు మంగళవారం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు నోటీసులిచ్చింది. ఈ పిటిషన్‌పై శశిథరూర్ తన వైఖరి తెలియజేయాలని కోర్టు నోటీసుల్లో పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 4న మెజిస్టీరియల్ కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ రాజీవ్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై నోటీసు జారీ చేస్తూ జస్టిస్ రవీందర్ దుడేజా ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను సెప్టెంబర్ 16కి వాయిదా వేశారు. ఫిబ్రవరి 4న అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పరాస్ దలాల్ శశిథరూర్‌కు సమన్లు జారీ చేసేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే.

జార్ఖండ్‌లో సామూహిక అత్యాచారం: ఐదుగురి అరెస్ట్

దుమ్కా: జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన కేసులో మైనర్ సహా ఐదుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం వారిని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు అధికారి ఒకరు చెప్పారు. ఈ సంఘటన మే 16న ముఫాసిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందన్నారు. తాను ఒక బంధువు ఇంటికి వివాహ వేడుక కోసం వెళ్లానని, అక్కడ ఒక వ్యక్తి తనను బలవంతంగా నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లాడని ఆ బాలిక మే 17న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ వ్యక్తి, అతని నలుగురు సహచరులు తనపై అత్యాచారం చేశారని బాధితురాలు ఆరోపించింది. 'ఎఫ్ఐఆర్ ఆధారంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి సోమవారం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు ముఫాసిల్ పోలీస్ స్టేషన్ ఇంఛార్జ్ సత్యం కుమార్ తెలిపారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

దిగొచ్చిన మోదీ సర్కారు

- పఠాన్ స్థానంలో అభిషేక్
- శివసేన (యూబీటీ) నుంచి ప్రియాంక చతుర్వేది
- పార్లమెంటు ప్రతినిధి బృందాల ఎంపిక వ్యవహారం

న్యూదిల్లీ: ఆపరేషన్ సిందూర్ వివరాలతో పాటు ఉగ్రవాదాన్ని ఎంతమాత్రం సంహించేది లేదన్న భారత దృఢ వైఖరిని ప్రపంచ దేశాలకు వివరించేందుకు విదేశాలకు వెళ్తున్న పార్లమెంటు ప్రతినిధి బృందాలకోసం ఇతర పార్టీల ప్రతినిధుల ఎంపిక విషయంలో ఏకపక్షంగా వ్యవహరించిన మోదీ సర్కారు ఎట్టకేలకు దిగొచ్చింది. ఈ విషయమై రాజకీయ రగడ తర్వాత దౌత్య ప్రతినిధుల కోసం ఏకాభిప్రాయం కోరుతూ ప్రతిపక్షాలను సంప్రదించింది. ఈ క్రమంలో టీఎంసీ, శివసేన (యుబీటీ)తో చర్చించింది. ఫలితంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తరఫున ఆ పార్టీ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ పేరు తెరపైకి వచ్చింది. మంగళవారం ఉదయం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీతో మాట్లాడారు. అలాగే సోమవారం రాత్రి శివసేన (యుబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో కూడా మాట్లాడారు. రిజిజుతో జరిగిన చర్చల తర్వాత, మమత డైమండ్ హార్బర్ ఎంపీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ పేరును ఒక బృంద సభ్యుడిగా సిఫార్సు చేశారు. టీఎంసీ 'ఎక్స్' వేదికగా ఈ విషయం వెల్లడించింది. అభిషేక్ బెనర్జీ నామినేషన్‌తో ఉగ్రవాదాన్ని ఎంతమాత్రం పశ్చిమబెంగాల్ సహించదన్న బలమైన సందేశాన్ని ఇచ్చిందని, మమతా బెనర్జీ అధికారికంగా అఖిల పక్ష బృందానికి అభిషేక్ బెనర్జీని నామినేట్ చేశారని టీఎంసీ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం శనివారం టీఎంసీ నాయకత్వాన్ని చికాకు పెట్టే బెర్హంపూర్ ఎంపీ, మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ పేరును ప్రకటించింది. ఈ ఏకపక్ష ప్రకటనపై టీఎంసీ తీవ్ర అసంతృప్తి తెలియజేసింది. ఇక ఇదే తరహాలో శివసేన (యూబీటీ) కూడా 'ఎక్స్' ద్వారా ప్రకటన చేసింది. ప్రతినిధి బృందాల సభ్యుల ఎంపికతో బీజేపీ రాజకీయాలు చేయడం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారని శివసేన (యుబిటి) తెలిపింది. 'ఈ ప్రతినిధి బృందం రాజకీయాలకు వ్యతిరేకంగా కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ పోరు గురించి మాత్రమేనని మంత్రి హామీ ఇచ్చిన తరువాత ఈ ప్రతినిధి బృందం ద్వారా మన దేశానికి సరైనది, అవసరమైనది చేస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చాం' అని శివసేన (యూబీటీ) తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. పార్టీ ఎంపీ ప్రియాంక చతుర్వేది బీజేపీకి చెందిన రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందంలో భాగంగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఈయు, ఇటలీ, డెన్మార్క్‌లలో పర్యటిస్తారని వెల్లడించింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి అనంతరం నిఘా వైఫల్యం జరిగిందన్న ఆరోపణలపై తమ అభిప్రాయాలను ప్రస్తుతానికి రిజర్వ్‌లో ఉంచుతామని పార్టీ తెలిపింది. అయితే కేంద్రం తనకు నచ్చిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధానంపై శివసేన (యూబీటీ) కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. కాగా ఆపరేషన్ సింధూర్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలనే డిమాండ్‌ను మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే పునరుద్ఘాటించారని పార్టీ వర్గాలు తెలిపాయి.

దేశ సంపద దోచిపెట్టడమే బీజేపీ నమూనా

పేదల జేబుల్లోకి చేర్చడం మా లక్ష్యం: రాహుల్

హోస్పేట (కర్నాటక): ఎంపిక చేసిన ధనవంతులకు దేశ సంప దను దోచిపెట్టడమేనని బీజేపీ నమూనా అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగ ళవారం విమర్శించారు. ఎంపిక చేసిన ధనవంతులు మొత్తం డబ్బు, వనరులు పొందే నమూనాను బీజేపీ అనుసరిస్తున్నదని, కాంగ్రెస్ నమూనాలో డబ్బును బ్యాంకు ఖాతాల్లోకి, పేదల జేబుల్లోకి వేస్తామని చెప్పారు. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాహుల్ మంగళవారం మాట్లాడుతూ కర్నాటకలో పార్టీ ప్రభుత్వం లక్షకు పైగా టైటిల్ డీడ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేయడం ద్వారా ప్రజలకు హామీ ఇచ్చిన 'ఆరవ హామీ' అమలు చేసిందని చెప్పారు. 'కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఎన్నికల సమయంలో మేము మీకు ఐదు హామీలు ఇచ్చాము. కాంగ్రెస్ పార్టీ దానిని నెరవేర్చలేదని బీజేపీ వారు చెప్పారు. ఇది జరగదని ప్రధాన మంత్రి అన్నారు' అని రాహుల్ అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన ఐదు హామీల జాబితా వివరిస్తూ... 'పేదల బ్యాంకు ఖాతాలో డబ్బు వేస్తామని మేము మీకు చెప్పాము. నేడు వేల కోట్ల రూపాయలు నేరుగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయి. ఈ డబ్బును, మీరు మీ పిల్లల విద్య కోసం, మీ ఆరోగ్యం కోసం ఉపయోగిస్తారు. ఇదే మేము కోరుకుంటున్నాము. మీ డబ్బు మీ జేబులోకి తిరిగి వస్తుంది' అని తెలిపారు. 'భారతదేశం మొత్తం డబ్బును ఎంపిక చేసిన వ్యక్తులు మాత్రమే పొందాలని బీజేపీ కోరుకుంటోంది. కానీ డబ్బు పేదలు, వెనుకబడిన వారు, దళితులు, ఆదివాసీల జేబులకు నేరుగా వెళ్లాలని మేము కోరుకుంటున్నాము. మేము మీ జేబుల్లో డబ్బు వేసినప్పుడు ఆ డబ్బు మార్కెట్‌లోకి వెళుతుంది. దీని ద్వారా ఉత్పత్తి పెరుగుతుంది. డబ్బు గ్రామాలలోకి వెళుతుంది. మీరు ఈ డబ్బును మీ గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఖర్చు చేస్తారు. కర్నాటక ఆర్థిక వ్యవస్థ దాని నుంచి ప్రయోజనం పొందుతుంది' అని రాహుల్ తెలిపారు. అయితే బీజేపీ నమూనాలో మొత్తం డబ్బును ఇద్దరు-ముగ్గురు బిలియనీర్లకు ఇస్తారని పేర్కొంటూ... ఈ బిలియనీర్లు గ్రామాలలో లేదా పట్టణాలలో డబ్బు ఖర్చు చేయరు. కానీ లండన్, న్యూయార్క్, ఇతర ప్రదేశాలలో ఆస్తులు కొనుగోలు చేస్తారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'మీ డబ్బు బీజేపీ నమూనా ప్రకారం కొంతమంది చేతుల్లోకి వెళుతుంది. వారి నమూనాలో ఉపాధి లభించదు. కానీ మా నమూనాలో ఉపాధి సృష్టించడం జరుగుతుంది. బీజేపీ నమూనాలో మీరు అనారోగ్యంతో అప్పుల పాలవుతారు. మా నమూనాలో మీ జేబుల్లో డబ్బు ఉంటుంది. మీకు చికిత్స లభిస్తుంది. బీజేపీ నమూనా ప్రకారం మీరు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు విద్య కోసం లక్షలాది డబ్బు చెల్లిస్తారు. అప్పులు ఎదుర్కొంటారు. మా నమూనాలో మేము మీకు డబ్బు ఇస్తాము' అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా, మంత్రులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల 'యూనిఫామ్' ఎత్తులు

భద్రతా దళాలకు కొత్త సవాల్

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భయాందోళనకు గురైన జమ్మూకశ్మీర్ ప్రజలను మరో సమస్య వెంటాడుతోంది. ఉగ్రవాదులు సైనిక దుస్తులు ధరించి సంచరిస్తుండటంతో స్థానికులు గందరగోళానికి గురవుతున్నారు. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య తేడా గుర్తించలేక అయోమయంలో ఉన్నారు. ప్రమాదాన్ని పసిగట్టడంలో భద్రతా సిబ్బందికి ఇబ్బంది ఎదురవుతోంది. పహల్గాం దాడి నాటి నుంచి ఈ తరహా ఘటనలు పెరగడం ఆందోళనకరంగా మారింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చారని, వారు ఉగ్రవాదులని తెలుసుకోలేకపోయామని నాటి ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో ఆ దిశగా భద్రతా బలగాలు దర్యాప్తు చేపట్టాయి. ఆ తర్వాత కూడా ఉగ్రవాదులు అదే పంథా కొనసాగిస్తున్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఉగ్రవాదులు సైనిక యూనిఫామ్‌లో కనిపించారు. పహల్గాం ఘటనకు పాల్పడిన ఉగ్రవాదుల కోసం భద్రతా సిబ్బంది జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా ముమ్మర గాలింపు చేపట్టారు. కొద్ది రోజుల క్రితం పుల్వామాలోని త్రాల్‌లో కార్డెన్ సెర్చ్ చేస్తుండగా... ఉగ్రవాదులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో జైషేమహ్మద్ ఉగ్ర ముఠాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు ఆసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వనీ, యావర్ అహ్మద్ భట్‌ను బలగాలు మట్టుబెట్టాయి. వీరి మృతదేహాలు పరిశీలించగా... వారు సైనిక దుస్తుల్లాగే ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా జాకెట్, వారు ఉపయోగించిన పరికరాలు భద్రతా సిబ్బంది వినియోగించేవిగానే ఉన్నాయి. దీంతో భద్రతా బలగాలు వాటిని స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నాయి. జమ్మూలోనూ ఇదేతరహా ఘటన వెలుగుచూసింది. మే 10న ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్న సమయంలో జమ్మూలోని నగ్రోటా మిలిటరీ స్టేషన్‌లో చొరబాటుకు యత్నం జరిగింది. దాన్ని భద్రతా దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ఆ చొరబాటుకు యత్నించిన దుండగుడు మిలిటరీ దుస్తులు ధరించి సైనిక స్థావరం సమీపం వరకు వచ్చినట్లు గుర్తించారు. ఆ తర్వాత అతడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో కాల్పులు జరపగా దుండగుడు పారిపోయినట్లు సైనికాధికారులు వెల్లడించారు. ఇలా ఉగ్రవాదులు సైనిక యూనిఫామ్ ధరించడం భద్రతాపరంగా తీవ్ర ఆందోళనకరమైన అంశంగా మారుతోంది. కొన్నిసార్లు వేగంగా ఆపరేషన్లు చేస్తున్న సమయంలో ఈ పరిణామాలు గందరగోళ పరిస్థితులకు దారితీస్తున్నాయి. 'ఈ ఎత్తుగడ కేవలం మోసం మాత్రమే కాదు... ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. భద్రతా బలగాలు, స్థానిక పౌరుల మధ్య నమ్మకాన్ని దెబ్బతీసేందుకు వేసే కుట్రలు ఇవి' అని సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

మత రాజకీయాలతోనే సమస్యలు: కేజ్రీవాల్

న్యూదిల్లీ: గత 75 సంవత్సరాలుగా ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు ఆచరిస్తున్న మత రాజకీయాలే దేశ సమస్యలకు మూల కారణమని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ఆరోపించారు. ఆప్ విద్యార్థి విభాగం... అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఫర్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్ (ఏఎస్ఏపీ) ప్రారంభోత్సవంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ వంటి పార్టీలు చారిత్రకంగా ఆహారం, విద్య, ఉపాధి వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించే బదులు హిందూ-ముస్లిం రాజకీయాలపై దృష్టి సారించాయని అన్నారు. 'మన దేశం చాలా సమస్యలతో సతమతమవుతోంది. ప్రజలకు ఆహారం లేదా విద్య అందుబాటులో లేదు. ఇలా ఎందుకు జరుగుతోంది? బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు గత 75 సంవత్సరాలుగా రాజకీయాల్లో మాత్రమే మునిగిపోయాయి' అని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు అన్నారు. 'ఈ పార్టీలు మన పాఠశాల పిల్లలకు హిందూ-ముస్లిం గురించి మాత్రమే బోధిస్తున్నాయి. మన దేశంలో సమస్యలకు ఇదే మూల కారణం' అని ఆయన తెలిపారు. దేశ రాజధానిలో ఆప్ తన 10 సంవత్సరాల పాలనలో నిర్మించిన విద్యా వ్యవస్థను నాశనం చేయడానికి బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం పని చేస్తోందని దిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. 'మూడు నెలల్లోనే వారు (బీజేపీ) దిల్లీలో విద్యా వ్యవస్థను నాశనం చేయడం ప్రారంభించారు. ఆప్ తన పదవీకాలంలో 10 సంవత్సరాలలో ప్రైవేట్ పాఠశాల మాఫియా ఫీజులను పెంచడానికి అనుమతించలేదు' అని తెలిపారు. 'ఇప్పుడు దిల్లీలో మూడు నుంచి నాలుగు గంటల పాటు విద్యుత్ కోతలు ఉన్నాయి. ఇది గతంలో జరగలేదు' అని అన్నారు. ఏఎస్ఏపీ గురించి కేజ్రీవాల్ మాట్లాడుతూ ఫోరం కింద దేశ వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో విద్యార్థి సాంస్కృతిక బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మాట్లాడుతూ 'ఏఎస్ఏపీలో రెండు గొప్ప విషయాలు ఉన్నాయి. ఒక ప్రత్యామ్నాయ రాజకీయాలు, మరొకటి దాని పేరు ఏఎస్ఏపీ ఎందుకంటే మనకు ఏఎస్ఏపీ (వీలైనంత త్వరగా) విప్లవాత్మక విధాన సంస్కరణలు అవసరం' అని అన్నారు. 'ఇతర దేశాలలో కేజీ విద్యార్థుల వృద్ధిని కూడా ఏఎస్ఏపీ గుర్తించి మ్యాప్ చేస్తోంది. మన దేశంలో మనం 11, 12 ప్రమాణాల విద్యార్థులకు టైపింగ్ నేర్పిస్తున్నాము' అని తెలిపారు. ఏఎస్ఏపీ కేవలం విద్యార్థి సంఘాల ఎన్నికల గురించి మాత్రమే కాకుండా విద్యార్థుల అభివృద్ధిని పెంపొందించడం మరియు ప్రత్యామ్నాయ రాజకీయాల సమస్యలను లేవనెత్తడం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన నొక్కి చెప్పారు. '5 శాతం కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయి. మేము విద్యా సంస్కరణల రాజకీయాలు చేస్తాము' అని సిసోడియా అన్నారు. ఆప్ నాయకుడు అవధ్ ఓజా మాట్లాడుతూ 'ఒక దేశంలో సహజ వనరులు లేదా మానవ వనరులు ఉంటాయి. దేశంలో మొదటిసారిగా మా పార్టీ, మా నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ విద్య, ఆరోగ్య విప్లవం ద్వారా మానవ వనరులను బలోపేతం చేయాలని నొక్కి చెప్పారు' అని అన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో బలూచిస్థాన్ వెనుకబాటు

అసోం సీఎం హిమంత

గువహటి: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్ స్థితిగతులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్పందించారు. కల్లోలిత బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆ ప్రాంతం అభివృద్ధి చెందలేదని ఆయన అన్నారు. బలూచిస్థాన్ ప్రావిన్స్ దశాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురవుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు హిమంత తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం ట్వీట్ చేశారు. 'బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో భారీగా ఖనిజ సంపద ఉన్నప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాల తరబడి ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ ఎక్కువైంది. పాకిస్థాన్‌లోని మొత్తం ఖనిజ సంపదలో 80 శాతానికిపైగా బలూచిస్థాన్‌లోనే ఉండగా... ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అక్కడ భారీగా రాగి- బంగారు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించని సుమారు 5.9 బిలియన్ టన్నుల ఖనిజం, 41.5 మిలియన్ ఔన్సుల బంగారం, 35 మిలియన్ టన్నుల రాగి ఉంది' అని హిమంత తెలిపారు. బలూచిస్థాన్‌లో సుయ్ గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు 1952లో కనుగొనగా... 2020 నాటికి పాకిస్థాన్‌కు సుమారుగా 56 శాతం సహజ వాయువును అందిస్తోందని హిమంత తెలిపారు. బలూచిస్థాన్‌లోని గదర్ ఓడరేవు 770 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని కలిగి ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, ప్రాథమిక మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవన్నారు. ప్రభుత్వ రంగ ఉపాధిలోనూ బలూచిస్థాన్ ప్రావిన్స్ వాటా తక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు సమృద్ధిగా వనరులు ఉన్న ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారన్నారు. బలూచిస్థాన్‌లో వనరుల కొరత లేనప్పటికీ పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ దోపిడీ అధికంగా ఉందని హిమంత ఆరోపించారు.

25 మందిని మోసగించి వివాహం...అరెస్టు

జైపూర్: పెళ్లి పేరుతో 25 మందిని మోసం చేసిన మహిళ గుట్టును పోలీసులు రట్టు చేశారు. అత్తారింట్లో అమాయకురాలిగా నాటకమాడుతూ వారి ఆస్తులు, నగదుకు సంబంధించిన రహస్యాలు తెలుసుకోవడం, అందరి మెప్పు పొందాక తన గ్యాంగ్ సాయంతో నగదు, డబ్బుతో పరారుకావడం ఆ మహిళకు నిత్యకృత్యంగా మారింది. ఇప్పటివరకు అనేకమంది జీవితాలతో ఆటలాడిన ఈ కిలేడీని రాజస్థాన్‌లోని మాధోపూర్ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన అనురాధ పాశ్వాన్ పెళ్లి పేరిట అమాయకులను మోసం చేసేందుకు ఒక గ్యాంగ్‌నే నడుపుతోంది. తానొక ఒంటరి మహిళనని చెప్పుకుంటూ నాటకమాడేది. తనకు ఉద్యోగం చేయని ఒక సోదరుడు ఉన్నాడని, తాను పేదరాలినని, ఎవరి అండా లేకుండా జీవిస్తున్నానని అందరినీ మభ్యపెట్టేది. తన గ్యాంగ్‌లోని ఒక వ్యక్తిని పెళ్లికి మధ్యవర్తిగా పంపుతూ సంబంధాలు కుదుర్చుకునేది. కొత్త పేరు, కొత్త ఊరు, కొత్త గుర్తింపు కార్డులతో వివాహాలు చేసుకునేది. పెళ్లి అనంతరం అత్త వారింట్లో అణకువగా, అమాయకురాలిగా నటిస్తూ అందరి మెప్పు పొందేది. తర్వాత వారి నుంచి ఆస్తులు, నగదు, ఆభరణాల రహస్యాలు తెలుసుకునేది. అదును చూసి ఇంట్లో వారందరికీ ఆహారంలో మత్తు మందు కలిపి తన గ్యాంగ్ సభ్యులతో కలిసి విలువైన వస్తువులు, నగదుతో పరారయ్యేది. ఇప్పటివరకు 25 మందిని బురిడీ కొట్టించింది. ఆమె బారినపడిన ఓ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా... గతంలోనూ అనేక మందిని అనురాధ మోసగించినట్లు తెలిసింది. ఆమె మైండ్ గేమ్ తెలుసుకున్న మాధోపూర్ పోలీసులు... అదేతరహాలో అనురాధను బురిడీ కొట్టించి ఎట్టకేలకు అరెస్టు చేశారు. 'ఇటీవల అనురాధతో నాకు వివాహం జరిగింది. అప్పు చేసి ఈ పెళ్లి చేసుకున్నాను. వారం వ్యవధిలోనే ఆమె వ్యవహారం బయటపడింది. నా బంగారు ఆభరణాలు, డబ్బు, విలువైన వస్తువులు, మొబైల్ ఫోన్ సహా కాజేసి వెళ్లిపోయింది' అని మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి ఆవేదన వ్యక్తంచేశారు.

257 కేసులు... ఇద్దరి మృతి

పెరుగుతున్న కోవిడ్ మహమ్మారి

న్యూదిల్లీ: కోవిడ్-19 మరోమారు విజృంభిస్తోంది. ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో కోవిడ్-19 కేసులు నమోదవుతున్నాయి. సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్ తదితర దేశాలలో కరోనా కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఓమిక్రాన్ ఉప-వేరియంట్లయిన జేఎన్-1, ఎల్ఎఫ్.7, ఎన్‌బీ 1.8 కేసుల పెరుగుదలకు కారణంగా నిలుస్తున్నాయి. భారతదేశంలో 57 యాక్టివ్ కేసులు ఉన్నాయి. వీటిలో అధికశాతం తేలికపాటివిగా, ఆసుపత్రి సంరక్షణ అవసరం లేనివిగా ఉన్నాయి. ప్రభుత్వం అందించిన డేటాలోని వివరాల ప్రకారం మే 12 తరువాత కేరళలో అత్యధిక సంఖ్యలో మొత్తం 69 కేసులు నమోదయ్యాయి. దాని తర్వాత మహారాష్ట్రలో 44 కేసులు, తమిళనాడులో 34 కేసులు నమోద య్యాయి. కర్నాటకలో ఎనిమిది, గుజరాత్‌లో ఆరు, దిల్లీలో మూడు, హర్యానా, రాజస్థాన్, సిక్కింలో ఒక్కొక్క కేసు చొప్పున నమోదయ్యాయి. మహారాష్ట్రలోని ముంబైలో గల కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ (కేఈఎం) ఆస్పత్రిలో కోవిడ్-19తో ఇద్దరు మృతిచెందారు. హిందూస్థాన్ టైమ్స్ నివేదిక ప్రకారం ఈ ఇద్దరు రోగులకు తీవ్రమైన ఆరోగ్య పరిస్థితులు ఉన్నాయని వైద్యులు పేర్కొన్నారు. వీరిలో ఒకరు నెఫ్రోటిక్ సింద్రోమ్ కారణంగా మూత్రపిండాలు దెబ్బతిన్న 14 ఏళ్ల బాలుడని, మరొకరు 54 ఏళ్ల కేన్సర్ రోగి అని వైద్యులు తెలిపారు. కాగా దేశ జనాభాలో రోగనిరోధక శక్తి తగ్గిన కారణంగా కేసులు పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా విజృంభిస్తున్న జేఎన్ వేరియంట్ లక్షణాలు ఒమిక్రాన్ తరహాలోనే ఉన్నాయని ఆరోగ్య అధికారులు చెబుతున్నారు. జేఎన్-1 వేరియంట్ లక్షణాలు ఏమిటంటే...గొంతు నొప్పి, జ్వరం, ముక్కు కారడం, పొడి దగ్గు, తలనొప్పి, అలసట, రుచి లేదా వాసన కోల్పోవడం ఉంటాయని తెలిపారు. తాజాగా కరోనా బారిన పడిన బాధితులలో కొందరు తాము తీవ్రమైన అలసట ఎదుర్కొంటున్నామని తెలిపారు. వర్షాకాలం వచ్చే ముందు సంభవించే వ్యాధులు ఇప్పటికే దేశంలోని కొన్ని ప్రాంతాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఫ్లూ తరహా లక్షణాలు ఎదుర్కొంటున్న వారు జనసమూహాలకు దూరంగా ఉండాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు.

భారీ వర్షాలకు బెంగళూరులో ఐదుగురి మృతి

బెంగళూరు: బెంగళూరులో కురిసిన భారీ వర్షానికి వరదనీరు రోడ్డుపై నిలిచిపోయి నదుల్ని తలపించింది. ఈ వర్షాల వల్ల నివాసితులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెంగళూరు నగరానికి వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. కర్నాటకలోని కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం బెంగళూరు నగరంలో 8 సెం.మీ నుంచి 10 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు బెంగళూరు వాతావరణశాఖ డైరెక్టర్ ఎన్.పువియరసు తెలిపారు. కాగా, నిన్న కురిసిన భారీ వర్షం వల్ల ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు కరెంట్ షాక్ వల్ల చనిపోయారు. 63 ఏళ్ల మన్మోహన్ కామత్, 12 ఏళ్ల దినేశ్ వరద నీటిలో చిక్కుకుపోయారు. వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించేలోపే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వర్షాల దెబ్బకు బెంగళూరులోని మహదేవపురలో గోడ కూలి శశికళ (35) అనే మహిళ మృతి చెందింది. ఆమె ఐజెడ్ఎంట లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో హౌస్‌కీపింగ్ స్టాఫ్‌గా పనిచేశారు. గోడకూలిన ఘటన మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో జరిగింది.

విశాలాంధ్ర హైదరాబాద్

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బెస్ట్ అవైలబుల్ స్కూల్ కోసం 2025-26 సంవత్సరంలో ప్రవేశాలయిఖ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఉప సంచాలకులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ కటకం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సౌజన్యంతో నిర్వహించబడుతున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ద్వారా 2025-26 విద్య సంవత్సరంలో 1వ తరగతి డే స్కాలర్ షెడ్యూల్డ్ కులానికి సంబంధించిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులను చేర్చుకొనుకుటకు ఆసక్తి గల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి దరఖాస్తులు కోరుతున్నాము. ఈ దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నందు సమర్పించుటకు చివరి తేదీ మే 28. ఇతర వివరములకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయాన్ని, నాంపల్లి చంద్రవిహార్ కాంప్లెక్స్, 8వ అంతస్తు నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

సంజీవ్‌రెడ్డి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఐఎన్టీయూసీ (ఆర్) జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తిపై, ఇతర నాయకులపై సంజీవ్ రెడ్డి అనుచర గుండాలు దాడిని ఐఎన్టీయూసీ (ఆర్) నేతలు తీవ్రంగా ఖండించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో మీడియా సమావేశం నిర్వహించేందుకు వచ్చిన అంబటి కృష్ణమూర్తిపై, ఇతర నాయకులపై జి. సంజీవ్‌రెడ్డి అనుచర గుండాలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. జి. సంజీవ్ రెడ్డి వర్గానికి చెందిన ఐఎన్టీయూసీ నాయకులు ఆర్డీ చంద్రశేఖర్, ఆదిల్ షరీఫ్, నరసింహారెడ్డి తదితరులు అసభ్య పదజాలంతో దూషిస్తూ ఒక్కసారిగా అంబటి కృష్ణమూర్తిపై దాడి చేశారు. జి.సంజీవ్ రెడ్డి అనుచరులు చేసిన వీరంగంతో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ రణరంగంగా మారింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సంజీవ్ వర్గీయులను పంపించి వేశారు. అనంతరం దాడిచేసిన వారిపై అంబటి కృష్ణమూర్తి ఆబిడ్స్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై సంజీవ్ రెడ్డి అనుచర గుండాలు చేసిన దాడి కార్మికవర్గంపై చేసిన దాడి అన్నారు. భౌతిక దాడులతో కార్మికులపై పెత్తనం చేయాలనుకుంటే అది సాధ్యం కాదని ఆయన హెచ్చరించారు. తనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఎన్టీయూసీ నేతలుగా చెప్పుకుంటున్న ఊసరవెల్లి జనక్ ప్రసాద్ బృందం చేసిన నిరాధారమైన, అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారు చేసిన ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పనట్లయితే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్, జాతీయ కార్యదర్శి బి.అమర్, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.నాగరాజు లు మాట్లాడుతూ కృష్ణమూర్తిపై జనక్ ప్రసాద్ బృందం చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా వారు ఖండించారు. సమావేశంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు అప్పారావు, గురువారెడ్డి, కృష్ణా గౌడ్, లలిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ భగవాన్ దేవాలయానికి' శంకుస్థాపన

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రపంచానికి చాటిన దైవం శ్రీకృష్ణుడని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గం 130 - సుభాష్ డివిజన్ పైప్ లైన్ రోడ్డులో శ్రీ కృష్ణ ప్రణామి సేవా సమితీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీ సదానంద్ జీ మహారాజ్ పర్యవేక్షణలో నూతనంగా నిర్మించనున్న 'శ్రీకృష్ణ భగవాన్ దేవాలయానికి' బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడు... అది నిన్ను కాపాడుతుందని ప్రపంచానికి చాటిన దైవం శ్రీకృష్ణుడని, భగవద్గీత అనేది ఒక ఇతిహాసం మాత్రమే కాదని, మానవుని జీవన విధానానికి మార్గదర్శిక, భగవద్గీత పఠనం ద్వారా మనలోని చెడును తొలగించుకొని సన్మార్గం వైపు జీవన విధానం మారుతుందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, నరేందర్‌రెడ్డి, కాలే నాగేష్, కాలే గణేష్, బాల మల్లేష్, మాధవ రెడ్డి, సుమేర్ సింగ్, దేవాలయ కమిటీ చైర్మన్ నరేష్ మిట్టల్, ఉపాధ్యక్షులు రాంనారాయణ జీ మిట్టల్, ప్రధాన కార్యదర్శి గణేష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి ప్రదీప్ అగర్వాల్ పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : నేరేడ్‌మెట్ చౌరస్తా వద్ద మల్కాజిగిరి సర్కిల్ జిహెచ్ఎంసి కార్మికులు పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ కార్యదర్శి కే.నాగరాజు మాట్లాడుతూ జిహెచ్ఎంసి కార్మికులకు కానీస వేదనం 26 వేల రూపాయలు, పెన్షన్ రూ.10000లు చెల్లించాలని, పని ముట్లు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ కల్పించాలని, యూనిఫారములు, కిట్స్ ఇవ్వాలని కోరుకుంటూ ప్లే కార్డు పట్టుకొని నిరసన కార్యక్రమం చేశారు. మల్కాజిగిరి జిహెచ్ఎంసి అధికారులు కార్మికులని బెదిరిస్తున్నారని, అదే విధంగా మున్సిపల్ కార్మికులకు అందరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేదన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లత, అనురాధ, వెంకన్నా, అంజమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ముంబయికి ఆర్టీసీ బస్సులు : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : వేములవాడ నుండి ముంబయికి రెండు ఆర్టీసీ లహరి ఏసీ బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేములవాడ ఆలయం వద్ద ఈ బస్సులను మంత్రి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ఆది శ్రీనివాస్ నెల రోజుల క్రితం ముంబయి వెళ్లి అక్కడి తెలుగు వారితో సమావేశమయ్యారని గుర్తు చేశారు. అక్కడ నుంచి బస్సు ఏర్పాటు చేస్తే బాగుంటదని అక్కడి వారు కోరడంతో అయన నా దృష్టికి తీసుకురావడంతో ఈ బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. వేములవాడ, చందుర్తి, రుద్రంగి, కోరుట్ల, మెట్పల్లి, వర్ని ముంబయి వరకు ఈ బస్సు ప్రయాణం చేయనున్నట్లు వివరించారు. ముంబయికి ప్రతి రోజు రెండు ఏసీ బస్సులను ప్రారంభించడం జరిగిందని, ముంబయిలో ఉన్న ఎక్కడ ఉన్న తెలంగాణ బిడ్డలు మా బిడ్డలే వారికి ప్రయాణం ఇబ్బంది కలగవద్దని అక్కడి ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు బస్సు ప్రారంభం చేసుకున్నామని చెప్పారు. ఈ బస్సు నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ప్రశంసించారని, ఎక్కడెక్కడ ఇలాంటి బస్సులు అవసరమో వేయాలని ఆయన తెలిపారు. రాబోయే కాలంలో జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్‌కి ప్రతి పుణ్యక్షేత్రం నుండి బస్సులు వేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణంతో పాటు ఈపథకం విజయవంతం కావడానికి కష్టపడుతున్న ఆర్టీసీ డ్రైవర్‌లు, కండక్టర్‌కు, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడుతూనే సంస్థ అభివృద్ధి దిశగా పని చేస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీలో కొత్త నియామకాలు, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని, ప్రభుత్వం తరుపున వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ , గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్టీసీ ఆర్ఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు ముఖ్యఅతిథులు ముంబయి బస్సులో కొద్దిదూరం ప్రయాణించారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 29 చట్టాల స్థానంలో తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జీడిమెట్ల పారిశ్రామిక వాడ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, ఎఐటియుసి మండల ఉపాధ్యక్షులు ఈ.ఉమా మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా, యాజమాన్యాలకు అనుకూలంగా 29 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చింది. ఈ కోడ్‌లను 2025 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. దీనికి నిరసనగా మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనడం వల్ల సమ్మెను జూలై 9కి వాయిదా వేస్తూ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, ఊరేగింపులు నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జీడిమెట్ల పారిశ్రామిక వాడలో గొప్ప ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్ ప్రసంగిస్తూ కార్మిక కోడ్‌లలో యూనియన్ పెట్టుకోవడానికి అవకాశం లేకుండా ఉన్నాయని, అలాగే 8గంటల పనిదినాన్ని 12 గంటలకు మార్చే అవకాశాలు పూర్తిగా ఉన్నాయని, అలాగే కార్మికులు చట్టబద్ధంగా సమ్మె చేసే హక్కు లేకుండా ఉందని, సంక్షేమ పథకాలు నీరుగార్చే విధంగా కోడ్‌లు ఉన్నాయి. అంతే కాకుండా సంఘం ఉనికిని కోల్పోతుంది. 52% సభ్యులు ఉన్న సంఘం మాత్రమే గుర్తింపు సంఘంగా ఉంటుంది. 52 శాతం సభ్యత్వం ఉండటం ఏ సంఘానికి సాధ్యం కాదు కాబట్టి ఏ కంపెనీలో కూడా గుర్తింపు సంఘం ఉండే అవకాశం లేదు. గుర్తింపు సంఘంలేని సంస్థల్లో కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో బేరసారాలు చేయడానికి 20 శాతం సభ్యత్వం ఉన్న సంఘానికి ఒక ప్రతినిధికి అవకాశం ఇస్తారు. కార్మికుల రోజు వారి సమస్యలను పరిష్కరించడానికి ఒక వెల్ఫేర్ బోర్డును నియమిస్తారు, ఈ వెల్ఫేర్ బోర్డుకు అధ్యక్షున్ని సంస్థ యజమాని నియమిస్తారు. అలాగే యూనియన్ రిజిస్ట్రేషన్ కోసం కనీసం ఏడుగురు సభ్యులు గానీ లేదా 10 శాతం సభ్యులు గాని యూనియన్‌లో సభ్యత్వం కల్గివుంటేనే యూనియన్ రిజిస్ట్రేషన్ అవుతుంది. మహిళలు రాత్రిపూట డ్యూటీ చేయాలని కోడ్‌లో పొందుపరిచారు. అలాగే తదితర చట్టాలను తీసుకోచ్చారు. ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పాత చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ఎఐటియుసి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కె.స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు వి.హరినాథ్ రావు, నాయకులు రాములు, ఏఐటీయూసీ హమాలీ యూనియన్ నాయకులు నరసింహారెడ్డి, జార్జి, గురప్ప, సుంకిరెడ్డి, బోనాల కనకయ్య, సి.నరసింహులు, సిఐటీయు జిల్లా అధ్యక్షులు అశోక్, మండల నాయకులు కీలు కానీ లక్ష్మణ్, సిఐటీయు హమాలీ నాయకులు దేవదానం, కే.శ్రీను, డి.కరుణాకర్, భాషా, టియుసిఐ నాయకులు ప్రవీణ్ కుమార్, బిఆర్‌టియు నాయకులు జి.రవి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఈనెల 25న నిర్వహించు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను సాఫీగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సరోజిని నాయుడు వనిత మహావిద్యాలయ లోని సమావేశ మందిరంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సూపర్వైజర్లు, రూట్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, అబ్జర్వర్ లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను ఎంతో జాగ్రత్తగా, సాఫీగా, ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 25న నిర్వహించనున్న యూపిఎస్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు హైదరాబాద్ లో 95 పరీక్షా కేంద్రాలలో 43,676 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష రాస్తున్నారని తెలిపారు. యూపీఎస్సీ నిబంధనలు అనుగుణంగా పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మే 25 న పేపర్ 1 ఉదయం 9.30 గంటల నుండి ఉదయం 11.30 గంటల వరకు,పేపర్ 2 మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. యూపీఎస్సీ నిబంధనల మేరకు పరీక్ష కు 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లు మూసి వేయడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత వచ్చిన వారికి అనుమతించడం జరగదని తెలిపారు. యూపీఎస్సీ నిబంధనల మేరకు అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాలలోకి తీసుకువెళ్లడానికి అనుమతి లేదన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలలోకి వెళ్లేటప్పుడు మహిళా అభ్యర్థులకు మహిళా పోలీసులు, పురుష అభ్యర్థులకు మగ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలని పోలీసుశాఖకు కలెక్టర్ సూచించారు. గుర్తింపు కార్డు లేని వారిని ఎవరిని కూడా పరీక్ష కేంద్రంలోకి అనుమతించకూడదని, అనుమతి లేని వ్యక్తులు పరీక్షా కేంద్రాల్లో లేకుండా చూడాలని తెలిపారు. అధికారులందరూ సమయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వస్తువుల భద్రత కోసం ఎలాంటి స్టాక్ రూమ్ లు ఏర్పాటు చేయడం లేదని ఇది గమనించి అభ్యర్థులు ఎవరు కూడా బ్యాగులు, ఎలక్ట్రానిక్ గూడ్స్ తో పాటు ఇతర వస్తువులను పరీక్ష కేంద్రానికి తీసుకురావద్దని కలెక్టర్ సూచించారు . జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి యూపీఎస్సీ పరీక్ష నిర్వహణ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ ఈ. వెంకటాచారి అడిషనల్ డిసిపి ట్రాఫిక్ తేజావత్ రాందాస్, ఆర్డీఓ సాయిరాం, మల్కాజ్గిరి ఏసిపి చక్రపాణి, తహసీల్దార్ పాల్గొన్నారు.

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

విశాలాంధ్ర - మొయినాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారితో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని మొయినాబాద్ మండలములోని నాగిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సాగు పద్ధతుల, రైతు ఆరోగ్యం, ఉత్పత్తి పెంచే సలహాలు ఇచ్చారు. నాగిరెడ్డిగూడ గ్రామంలో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డా. అలీ బాబా, డా. చిరంజీవి, పిహెచ్డి విద్యార్థులు సమీరా, స్నిగ్ధా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పంటలకు సంబందించిన తగు జాగ్రత్తలపై వివరణ ఇచ్చారు. నీటి నిర్వహణ, ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులు, పంటల రోగనిరోధకత వంటి అంశాలను స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నాయో వాటిని అడిగి, వాటికి నేరుగా పరిష్కారాలు చూపించడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పంటల్లో యూరియా వినియోగాన్ని తగ్గించాలని, ఇది పురుగులను ఆకర్షిస్తుందని వివరించారు. ఎరువుల పురుగుల మందులను పరిమిత పరిమాణంలో ఉపయోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించి, మట్టిని ఆరోగ్యం సేకరిస్తుందని తెలియజేశారు. నీటి వృధా తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింకర్ విధానాలను పాటించాలన్నారు. పర్యావరణ రక్షణకు వృక్షాలను పెంచాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, మాజీ ఎంపిటిసి జె.అర్జున్, ఏఈఓ సునీల్ కుమార్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - మొయినాబాద్ : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏ ఐటీయూసి రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా అధ్యక్షులు కె. రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసి కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన రైతులు, ఉపాధి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రామస్వామి మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తుందన్నారు. కోడ్స్ వల్ల కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాలు బేరమాడే హక్కు కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి , షాబాద్ మండల కార్యదర్శి నక్క జంగయ్య , రైతు సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్ గౌడ్ , జిల్లా అధ్యక్షులు అంజయ్య , జిల్లా అధ్యక్షులు ఏఐటీయూసీ మండల అధ్యక్షులు శివ, ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు మంజుల , మీనాక్షి , లలిత, సుగుణమ్మ, రమాదేవి , యాదయ్య, నర్సింలు , సత్తయ్య , సాయిలు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్ భవన్‌లో హార్డ్ డిస్క్‌ల చోరీ

విశాలాంధ్ర - హైదరాబాద్ :అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థలో ఉండే రాజ్‌భవన్‌లోనే ఓ ఘనుడు చేతివాటం ప్రదర్శిం చాడు. ఈ విషయాన్ని అధికారులు అలస్యంగా గుర్తించినట్లు సమాచారం. నిత్యం పోలీస్ పహారా మధ్య ఉండే రాజ్‌భవన్‌లోకే ఈ మాయలోడు ప్రవేశించాడం భద్రతా వ్యవస్థ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. వివరాల ప్రకారం తెలంగాణ అధికారిక నివాసం రాజ్ భవన్‌లో కొద్ది రోజుల క్రితం ఓ దొంగతనం జరిగినట్లు తెలుస్తుంది. గవర్నర్ అధికార నివాసంలోకి దర్జాగా వెళ్లిన ఓ వ్యక్తి.. మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ రూమ్‌లోకి చొరబడి నాలుగు హార్డ్ డిస్కులు ఎత్తుకెళ్లాడు. ఈ నెల 13న ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. రాజ్‌భవన్‌లోని సుధర్మ భవన్‌లో కొన్ని కంప్యూటర్ల నుంచి నాలుగు హార్డ్ డిస్కులు కనిపించకుండా పోయిన విషయాన్ని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. దీనిపై వారు వెంటనే పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్‌భవన్ వంటి అత్యంత భద్రత ఉండే ప్రదేశంలో ఈ తరహా ఘటన జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదు అందుకున్న పంజాగుట్ట పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఈ చోరీకి పాల్పడిరది, రాజ్‌భవన్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ హార్డ్వేర్ ఇంజనీర్‌గా పనిచేసే శ్రీనివాస్‌గా పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిసింది. అనంతరం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ హార్డ్ డిస్కులలో ఏ విధమైన సమాచారం ఉందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా జడ్జి ప్రసవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా జడ్జి జ్యోతిర్మయి పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. సాధారణ కాన్పు ద్వారా మగబిడ్డ జన్మించాడని వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయమూర్తి స్వయంగా ఇక్కడ సేవలు పొందడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొంది అందరికీ ఆదర్శంగా నిలిచారని సీనియర్ కోర్టు ఏజీపీ ప్రశాంత్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయమూర్తి జ్యోతిర్మయి వేములవాడ జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. 2023లోనూ ఇదే ఆసుపత్రిలో ఆమె ఆడపిల్లకు జన్మనివ్వడం విశేషం. ఈ విషయం తెలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ట్విట్టర్ ద్వారా న్యాయమూర్తి జ్యోతిర్మయికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అనుభవం, నైపుణ్యం కలిగిన వైద్యులు అందుబాటులో ఉంటారని, వారి సేవలు పొందాలని ఆయన ప్రజలకు సూచించారు. ప్రజాప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేశామని మంత్రి దామోదర పేర్కొన్నారు.

గుల్జారీ హౌస్ అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ

- ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు
- కమిటీలో ఐఏఎస్ - ఐపీఎస్ అధికారులు
- ప్రమాదంపై సీఎంకు సమగ్ర నివేధిక అందించాలి కమిటీని ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గుల్జారీ హౌజ్ అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరుపుతూ ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడిరచారు. ఈనెల 18న చార్మినార్ పరిసర ప్రాంతాల్లోని గుల్జారి హౌజ్ వద్ద అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ సీపీ సివి ఆనంద్, ఫైర్ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ,టీఎస్ఎస్‌పీడీసీఎల్ సిఎండి ముషారఫ్‌లు ఈ కమిటీలో వున్నట్లు వివరించారు. ఈనెల 18న జరిగిన గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదంపై క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి ఘటనకు గల కారణాలు, ఘటన అనంతరం వివిధ శాఖలు తీసుకున్న చర్యలు పై ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక ఇవ్వాలని అదేశించారు. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా క్షేత్రస్థాయి ప్రజలకు సూచనలు స్థానిక పరిస్థితులు అంచనా వేసి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు ప్రతిపాదనలతో సూచనలు చేస్తూ ప్రతిపాదనలు చేయాలన్నారు. కమిటీ నివేదిక సమర్పించిన అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు సమీక్ష చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : పాతబస్తీ చార్మినార్ గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి లు ప్రభుత్వాన్ని కోరారు. చార్మినార్ అగ్ని ప్రమాద మృతుల సంతాప సభ మంగళవారం శివరాంపల్లిలోని ఎస్ ఎన్ సీ కన్వెన్షన్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు ఈటల రాజేందర్ కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ, షార్ట్ సర్క్యూట్ ఎలా జరిగింది? షార్ట్ సర్క్యూట్ జరిగిన వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు ఎంత సమయంలో అక్కడికి వచ్చారు, ఎలాంటి సహాయక చర్యలు చేపట్టారు ...అనే అంశాలపై పూర్తి స్థాయిలో, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మరణించడం చాలా బాధాకరమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ఉప్పర్ పల్లి భరత్ నగర్‌కు చెందిన ఒకే కుటుంబంలోని 17 మంది మరణించడం చాలా బాధాకరమన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ, గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద ఘటన బాధాకరమన్నారు. మృతుల చిత్ర పటాల వద్ద శ్రద్ధాంజలి ఘటించి వారి భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అన్ని విధాలుగా బీజేపీ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు . ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేసారు.

సీపీఐ మండల కార్యదర్శిగా టి.యాదయ్య గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక



విశాలాంధ్ర, మల్కాజిగిరి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మల్కాజిగిరి మండల కార్యదర్శిగా టి.యాదయ్య గౌడ్ నాల్గవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సమావేశంలో సభ్యులు ఆయన నాయకత్వంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. టి.యాదయ్య గౌడ్ గతంలో మండల కార్యదర్శిగా చేసిన సేవలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన నిబద్ధత, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయన కట్టుబడి ఉండడంతో ఆయనకు ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా యాదయ్యగౌడ్ మాట్లాడుతూ మల్కాజిగిరి మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు నాపై చూపిన విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ సిద్ధాంతాలను ఉన్నతంగా చాటుతూ, ప్రజల సమస్యల కోసం అవిశ్రాంతంగా పోరాడటం ద్వారా ఈ బాధ్యతను నిర్వర్తిస్తానన్నారు. ఈ సందర్భంగా సీపీఐ మల్కాజిగిరి మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు టి.యాదయ్య గౌడ్‌కు విప్లవాత్మక అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

దివ్యాంగులకు శుభవార్త

విశాలాంధ్ర - హైదరాబాద్ : దివ్యాంగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దశాబ్దాల సమస్యకు ముగింపు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జీఓ జారి చేసింది. మంత్రి సీతక్క చొరవతో దివ్యాంగులకూ వివాహ ప్రోత్సాహం అందించేందుకు మార్గ సుగమమైంది. వివాహం చేసుకున్న జంటలో ఒక్కరు దివ్యాంగులుంటేనే గతంలో రూ.లక్ష వివాహ ప్రోత్సాహం వచ్చేది. అయితే ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే ఈ వివాహ ప్రోత్సహం వర్తించేది కాదు. ఈ సమస్యను గుర్తించిన మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సమస్యకు పరిష్కార మార్గం చూపడం జరిగింది. దివ్యాంగుల సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం మంగళవారం జీవో జారి చేసింది. ఇక నుంచి ఇద్దరు దివ్యంగులు వివాహం చేసుకున్న ప్రోత్సాహం అందేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో దివ్యాంగులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం వర్తించనుంది. ఈ మేరకు మంగళ వారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ అదేశాలు జారీ చేశారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర, కాప్రా : కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ అమలవుతే కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు కోల్పోయి, బిక్షాటనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి అన్నారు. మంగళవారం కుషాయిగూడ మార్కెట్ ఆవరణంలో దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస స్థిర వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వారిని 3వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులను కల్పించాలని కోరారు.అలాగే, ఎన్ఆర్‌హెచ్ఎం స్కీమ్‌కు కేటాయించే బడ్జెట్ పెంచాలని కోరుతూ డిమాండ్లు నెరవేరకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్వేతా, అన్నపూర్ణ, స్వర్ణ, అనురాధ, భవాని తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ద్వితీయ వార్షికోత్సవం

విశాలాంధ్ర, పటాన్ చెరువు : పటాన్ చెరువు పట్టణంలో శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పటాన్ చెరువు కార్పొరేటర్ శ్రీ మెట్టు కుమార్ యాదవ్, రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ 2వ వార్షికోత్సవం. నిర్వహించారు మంగళవారం ఉత్సవాలలో భాగంగా ఈరోజు ఉదయం 6:30 గంటలకు విశ్వక్సేనారాధన, కంకణ ధారణ, స్వామి వారి అభిషేకం, స్వామివారి హెూమాలు, హరినామ సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దివ్య కళ్యాణ మహెూత్సవం మెట్టు రమాదేవి కుమార్ యాదవ్ దంపతులు నిర్వహించడం జరిగింది. పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవాలలో పాల్గొన్న భక్తులందరికీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, పటాన్ చెరువు కార్పొరేటర్ మాట్లాడుతూ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణం వ్యయ ప్రయాసలకోర్చి పూర్తి చేసిన తరువాత నుంచి ప్రతి ఏటా ఆనవాయితీగా ఆలయ వార్షికోత్సవం, స్వామి వారి మంగళ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ శ్రీ రాగం నాగేందర్ యాదవ్, కొండాపూర్ మారబోయిన రాజు యాదవ్ , సీనియర్ జర్నలిస్టు మెట్టు మదన్ యాదవ్ పటాన్ చెరువు డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నాగరాజు ఆలయ కమిటీ సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.

చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో భద్రతా చర్యలు

విశాలాంధ్ర, కాప్రా : చర్లపల్లి రైల్వే స్టేషన్ లో మరింత మెరుగైన భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐ జి అరోమా సింగ్ ఠాకూర్ మీడియాకు తెలిపారు. మంగళవారం చర్లపల్లి రైల్వే స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం రైల్వే స్టేషన్లో భద్రత ఏర్పాట్ల కోసం చేపట్టే చర్యలు విషయమై పరిశీలించామని గతంలో చర్లపల్లి రైల్వే స్టేషన్ అవుట్ పోస్టుగా ఉండేదని అప్పట్లో ఒక ఎస్సై సిబ్బంది ఉండేవారని గత సంవత్సరం చల్లపల్లి టర్మినల్ ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికుల రద్దీ పెరగడంతో కేవలం పద్దెనిమిది మంది సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నారని సిబ్బంది కొరత కారణంగా అనేక ఇబ్బందులున్నాయని అతి త్వరలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం తో హెూమ్ గార్డ్స్ సేవలు వినియోగించుకుని ప్రస్తుతం నూతన సాంకేతిక నైపుణ్యంతో నేరగాళ్ళను పసిగట్టి ఎప్పటికప్పుడు సిబ్బందిని అలెర్ట్ చేస్తున్నట్టు వివరించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అలాగే మహిళా ప్రయాణికులకు మేరీ సహేలి టీం తోడ్పాటు అందిస్తుందని వారు తెలిపారు.

టంగుటూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : మంత్రి

విశాలాంధ్ర, హైదరాబాద్ : స్వతంత్ర సమరయోధుడు ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత ఆశయాలను మనమంతా ముందుకు తీసుకువెళ్లాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 69 వ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ ముందు ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రముఖ, స్వతంత్ర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రధమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను కాబోయే తరం గుర్తించుకోవాలని వారి జీవిత ఆశలను మనమంతా ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి , వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, వేణుగోపాల చారి ఇతర ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

చోరీ నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-దుండిగల్: బంగారు ఆభరణాల చోరీ కేసును దుండిగల్ పోలీసులు తక్కువ సమయంలో చేధించి ఉన్నతాధికారుల మన్ననలందుకున్నారు.ఈ కేసులో 14 తులాల బంగారం, ఒక కేజీ వెండి,3 మోటార్ సైకిలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ సిహెచ్ శంకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఘటన వివరాలను వెల్లడించారు. సూరారం కాలనీ దయానంద్ నగర్‌కు చెందిన దారంగుల హరి బాబు(20) వృత్తిరీత్యా కూలీ, సూరారం కాలనీ సాయి బాబా నగర్‌కు చెందిన తన్నీరు సూర్య(20) వృత్తిరీత్యా కూలీ పలు దొంగతనాలు కేసుల్లో ఇద్దరు కరుడుకట్టిన నేరస్తులు.జల్సాలకు అలవాటు పడ్డ వీరు ఎవరు లేని ఇళ్లను టార్గెట్ చేసి వరుస దొంతనాలకు పాల్పడేవారని, వీరిపై దుండిగల్, జీడిమెట్ల,బాచుపల్లి,కూకట్ పల్లి ,సూరారం, మేడిపల్లి, నర్సాపూర్, అల్లపూర్ పోలీస్ స్టేషన్‌లలో ఇప్పటికే అనేక కేసులు నమోదు అయ్యాయన్నారు. ఏ2 తన్నీరు సూర్య సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ డి పి ఎస్,దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మర్డర్ కేస్, రేప్ కేసులో నిందితుడు, ఏ1 దారంగుల హరిబాబు ఓ కేసు విషయంలో మార్చి నెలలో అరెస్ట్ చేశారు. ఏప్రిల్ నెలలో జైల్ నుంచి బెయిల్ పై విడుదలై బయటకు రాగా వీరిపై నిఘా పెట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 20న సూరారం కాలనీలో ఇళ్లల్లో చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారంతో సీసీఎస్,సూరారం,దుండిగల్ పోలీస్ లు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి పట్టుకొని విచారంచగా నేరాలు ఒప్పుకున్నట్లు తెలియజేశారు. వారి వద్ద నుండి 15 లక్షల విలువచేసే బంగారు,వెండి ఆభరణాలు,మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నామన్నారు.ఇరువురిని రిమాండ్ కు తరలుస్తున్నట్లు వెల్లడించారు. చాక చక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసిన అధికారులను ఆయన అభినందించారు.

జోన్-3 సివర్ నెట్ వర్క్ ప్రాజెక్టు పనుల పరిశీలన

విశాలాంధ్ర, హైదరాబాద్ : కోర్ సిటీలో మురుగు నీటి వ్యవస్థ ఆధునీకరణకు చేపట్టిన జోన్-3 సీవర్ నెట్ వర్క్ ప్రాజెక్టు పనులతోపాటు షేక్‌పేట్ జలమండలి కార్యాలయాన్ని ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహీ యుద్దీన్‌తో కలిసి సమస్యాత్మకమైన ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న పనుల్ని పరిశీలించారు. మొదటగా టోలిచౌకి ఫ్లై ఓవర్ ప్రధాన రహదారిలో చేపట్టే టన్నెలింగ్ పనులను ఆటంకాలు కాకుండా ఎలా చేపట్టాలో చర్చించారు. ఈ ప్రధాన రహదారిలో ప్రతినిత్యం రద్దీ ఎక్కువగా ఉండడంతో పనులు చేపట్టడం అంత సులువు కాదని అంచనా వేశారు. దాదాపు 8 నుంచి 11 మీటర్ల లోతులో జరిగే టన్నెలింగ్ పనులవల్ల ట్రాఫిక్, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా.. వర్షా కాలంలోపే పనులు పూర్తి చేయమని సూచించారు. టన్నెలింగ్ పనులు చేపట్టేటప్పుడు జీహెచ్ఎంసీ, ట్రాన్స్ కో, జలమండలి ట్రాన్స్ మిషన్, ఓ అండ్ ఎం అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలన్నారు. పనులు చేపట్టే సమయంలో సరైన బారికేడ్లు, రక్షణ పరికరాలను ధరించి భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. పైపు విస్తరణ పనులు పూర్తి చేసిన ప్రాంతాల్లో వెంటనే రోడ్డు మరమత్తులు పూర్తి చేయాలని అధికారులకు ఎండీ సూచించారు. అక్కడి నుంచి సమీపంలోని 7 టూంబ్స్ వెళ్లే రహదారిలో చేపట్టే అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ పనులను నివాస గృహాలకు ఎలాంటి నష్టం కలగకుండా పనులు ఎలా చెయ్యాలో ప్రతిపాదనలను సమర్పించమని ఎండీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎండీ లైన్స్, పరిసర ప్రాంతాల్లో పురోగతిలో ఉన్న పైపులైన్ విస్తరణ పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే.. వర్షాకాలం సమీపించిన తరుణంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టి వేగంగా పూర్తి చేయాలని ఎండీ అశోక్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అంతకుముందు షేక్‌పేట్ జలమండలి కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ పది సంవత్సరాలక్రితం నిర్మించిన 10 మి.లీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను ఇప్పటికి వినియోగంలోకి తీసుకురాకపోవడంపై ఆశ్చర్యం వ్యక్త పరిచారు. వెంటనే రిజర్వాయర్లను వినియోగంలోకి తీసుకుని, ఏయో ప్రాంతాల్లో నీటి సరఫరా చేయవచ్చో సర్వేచేసి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. అనంతరం ఎండీ అశోక్‌రెడ్డి ఆ ప్రాంగణంలోని నీటిశుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సీజీఎంలు వినోద్ భార్గవ, రాజేందర్, జీఎంలు శ్రీను నాయక్, కుమార్, ప్రాజెక్టు, ఓ అండ్ ఎం అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జోన్-3 సీవర్ నెట్ వర్క్ ప్రాజెక్టు

మూసీనదికి ఉత్తరం వైపున కోర్ సిటీలో సీవరేజి వ్యవస్థ ఆధునికీకరణ కోసం జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులు చేపడుతున్నారు. 4 నియోజకవర్గాల పరిధిలో 33.50 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణానికి సంబంధించి రూ.297 కోట్ల వ్యయంతో జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టులో మొత్తం 135 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్ నిర్మాణాన్ని జలమండలి చేపడుతోంది. నగరంలోని ఓల్డ్ సిటీలో ఉన్న గోషామహల్, నాంపల్లి, కార్వాన్‌తో పాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీవరేజి వ్యవస్థను ఆధునికీకరించడానికి ఈ ప్రాజెక్టు చేపట్టింది.

పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : "కాళేశ్వర నివాసోవా,కాళేశ్వర నీరిక్షణం, కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం" అని స్తుతిస్తూ భక్తులు త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. 6వ రోజు అయిన మంగళవారం కూడా త్రివేణి సంగమం భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు చేరుకుంటున్నారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పునీతుల్కె నీరాజానాలు అర్పిస్తున్నారు. 6వ రోజు భక్తుల తాకిడీ తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలందించే విధుల్లో నిమగ్నం అయింది. త్రివేణి సంగమంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొందించేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది. ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రదాయాలను కొనసాగించే వారు. పుష్కర నది తీరంలో 6వ రోజున ఔషధ దానం, కర్పూర దానం, చందన దానం, కస్తూరి దానం చేయాలని పురణాలు వివరించాయి. ఈ రోజు పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దానాలు చేయడం మంచిదని చెప్తున్నాయి. 6వ రోజైన మంగళవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్‌గఢ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కాళేశ్వరం చేరుకుంటున్నారు.నేటి నుండి పుష్కరాల్లో సరస్వతి నవరత్నమాల హారతి ప్రత్యక్ష ప్రసారం... భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న సరస్వతి నవరత్నమాల హారతి ఘట్టాన్ని ప్రతీ రోజూ ప్రత్యక్ష ప్రసారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు నేటి నుండి ఈ హారతికార్యక్రమాన్ని లైవ్ కవరేజి చేస్తారు. ప్రతీ రోజు సాయంత్రం నిర్వహించే సరస్వతి హారతిని ఇవ్వడానికి, కాశీలో అత్యంత ప్రజాదరణ పొందిన గంగా హారతినిచ్చే పండితులను ప్రత్యేకంగా ప్రభుత్వం పిలిపించింది. దాదాపు అరగంట పాటు సాగే సరస్వతి నవరత్నమాల హారతిలో తొమ్మిది ప్రత్యేక హారతులను ఇస్తారు.

కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతియాలనే కుట్రతోనే నోటీసులు : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాజకీయ కక్షతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడానికే కాళేశ్వరం కమిషన్ పేరుతో నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి నదిలో తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వాటాను కోల్పోతున్నామని ఎంత బాధ పడ్డామో అందరికీ తెలుసన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద కాంగ్రెస్ పార్టీ వాళ్లకు మొదటి నుంచి కడుపు మంటగా ఉందనే విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తెలంగాణ బాగుపడటం, పేదలు బాగుపడటం కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ఇష్టం ఉండదన్నారు. ప్రజలు ఎప్పటికీ పేదరికంలో ఉంటేనే తమకు పదవులు వస్తాయని భావించే నాయకత్వం కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణలో బీడు భూములన్నింటికీ నీళ్లు వచ్చేలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మీద కాంగ్రెస్ పార్టీ నాయకులు మొదటి నుంచి కుట్రలు పన్నుతూ అనేక కేసులు వేసిన విషయం కూడా ఈ సందర్భంలో మనం గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. అదే కుట్రలో భాగంగా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి పగుళ్లు రావడం.. ఆ వెనువెంటనే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎన్‌డీఎస్ఏ అధికారులు పడవల్లో వచ్చి ఫొటోలు తీసి ప్రచారం చేసిన విషయం కూడా అందిరికీ తెలిసిందేనన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టు పై ప్రజలందరినీ కన్ఫ్యూజన్ కు గురి చేశారని అన్నారు. ఈ కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం కమిషన్ ను ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి తన జీవితాన్ని పణంగా పెట్టిన కేసీఆర్ పై కాంగ్రెస్ చేస్తోన్న కుట్రల్లో భాగంగానే కేసీఆర్ కు నోటీసులు అందజేశారని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా భావించి ఆమరణ నిరాహార దీక్ష చేసిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రతిష్టను, ఆయన పేరును దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి కమిషన్లు ఏర్పాటు చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రజల కోసం నిర్మించిన ప్రాజెక్టు అన్న విషయం గుర్తించాలన్నారు. రాజకీయ కుట్రతో, కక్షతో వేసిన ఇలాంటి కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్నే గెలిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలోనే నిజాలన్ని బయటకు వస్తాయని.. పాలు ఏవో.. నీళ్లు ఏవో ప్రజలకు స్పష్టత వస్తుందని అన్నారు.

బహిరంగ లేఖలు రాయడం కాదు.. ఆత్మ పరిశీలన చేసుకోవాలి : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంగన్వాడీ టీచర్ల జీతాలపై సీఎంకు మాజీ మంత్రి హరీష్ రావు రాసిన బహిరంగ లేఖపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా మినీ అంగన్వాడీ టీచర్ల పట్ల బాధ్యత ఉంటే.. పదేళ్లలో వారిని మెయిన్ అంగన్వాడీలుగా ఎందుకు పదోన్నతులు కల్పించ లేదని హరీష్ రావును ప్రశ్నించారు. ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎన్నికల ముందు మొక్కుబడి జీవోలు ఇచ్చి చేతులు దులుపుకున్న చరిత్ర మీదని మండిపడ్డారు. ఆర్థిక మంత్రిగా ఉండి మిని అంగన్వాడీలకు పదోన్నతులు రాకుండా అన్యాయం చేసింది హరీష్ రావేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు మీకు పట్టని మినీ అంగన్వాడీల సమస్యలు..అధికారం పోగానే గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు సీతక్క. "ఓట్ల కోసమే అప్పట్లో జీవోలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆ జీవోలు ఓట్ల జీవోలే. ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా జారీ చేసిన జీవోలు పనికి రాకుండా పోయాయి. ఇప్పుడు తాము జీవోలను చట్టబద్ధంగా, పకడ్బందీగా అమలు చేసి చూపిస్తున్నాం" అని మంత్రి సీతక్క మండిపడ్డారు. మీరు అంగన్వాడీలను మోసం చేస్తే...తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే చట్టబద్ధంగా, ఆర్థిక శాఖ అనుమతులతో 3438 మంది మినీ అంగన్వాడీ టీచర్లకు పదోన్నతులు కల్పించామని గుర్తు చేశారు మంత్రి సీతక్క. ఎన్నో చిక్కుముడులని చేదించి, భవిష్యత్తులో ఏలాంటి న్యాయపరమైన అడ్డంకులు తలెత్తకుండా..ఏప్రిల్ 2025లోనే ఈ ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేసి, ఈ నెల నుంచే మెయిన్ అంగన్వాడీల తరహాలోనే మిని అంగన్వాడీలకు జీతాలు చెల్లిస్తున్నామన్నారు. మిన్ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసి..టీచర్లకు తోడుగా హెల్పర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. "పదేళ్ల మీ పాలన వల్ల బాధపడ్డ ప్రజలకు హరీష్ రావు బహిరంగ క్షమాపణ చెబితే బాగుంటుందన్నారు మంత్రి సీతక్క. బహిరంగ లేఖ రాయడం కన్నా..అంతరాత్మను ప్రశ్నించుకోవాలని సూచించారు సీతక్క. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తూ, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అభ్యున్నతికి పని చేస్తున్నాం. పదేళ్ల మీ దుష్పరి పాలన పాపం ఒక్కరోజులో పోదు. దశాబ్ద కాలపు సమస్యలను ఒక్కోక్కటిగా పరిష్కరిస్తున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

బీసీ బాలుర వసతి గృహం అందుబాటులోకి తెస్తాం

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని మాడుగుల రహదారిలో గల బీసీ వసతి గృహాన్ని అతి త్వరలోనే నూతన భవనాన్ని నిర్మించి బీసీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి లు తెలిపారు. మంగళవారం శిథిలావస్థలో ఉన్న బీసీ వసతిగృహ భవనాన్ని వారు సందర్శించారు. గత ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తేవాలని మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు వినతి మేరకు స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు శిథిలావస్థలో ఉన్న భవనాన్ని సంద ర్శించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడిగా కలెక్టర్ బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశవ్ రామ్ పంపించారు. ప్రస్తుతం బీసీ భవనానికి 21 గుంటల భూమి (2500) గజాల స్థలం ఉన్నదని. బీసీ గురుకుల భవన, బీసీ వసతిగృహ నిర్మాణానికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. విద్యా వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీసీబీ మెంబర్ బాలాజీ సింగ్, తహసీల్దార్ సిహెచ్ లలిత, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇన్చార్జి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వసుపుల మానయ్య, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మండ్లీ రాములు, మెకానిక్ బాబా, శ్రీను నాయక్, మహేషు, ఫరీద్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల తయారీ వాడకంపై శిక్షణ

విశాలాంధ్ర-రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్‌లోని ప్రొ॥ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత, రైతులకు కలిగే లాభాలు, జీవన ఎరువుల తయారీ జీవన ఎరువుల వ్యాపారం నైపుణ్యం, వ్యాపార ప్రారంభం తదితర అంశాలపై సూచనలు ఇస్తూ విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఉద్యోగానికే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషిస్తూ వ్యవసాయ రంగంలో కొత్త వ్యాపార ఆలోచనలు ప్రారంభించడం ద్వారా తమకే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి కల్పించవచ్చని వివరించారు. శిక్షణలో భాగంగా ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ త్రివేణి మాట్లాడుతూ నేలను సారవంతం చేయుటలో, నేలసారంను సంరక్షించుటలో జీవన ఎరువుల సామూహిక ఉత్పత్తి, రైతులకు అందజేయుట, వాటి లాభాలు వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో జీవన ఎరువులను ప్రయోగశాలలో తయారు చేసుకునే విధానం, వాడే విధానంలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోషి లావణ్య, డాక్టర్ డి. శ్రీదేవి, కె. సి దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ బోరులకు మరమ్మతులు చేపట్టాలని వినతి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పవర్ బోరు మరమ్మతులు చేయాలని, భూగర్భ డ్రైనేజీ పైప్లైన్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ జలమండలి మేనేజర్ సునీల్ కుమార్‌ను కలిసి కోరారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో పవర్ బోర్లు పాడై నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని మరమ్మతులు చేసి ప్రజలకు నీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ పైపుల నిర్మాణాలు చేపట్టి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండలం అజీజ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్ వెల్ ఫిజియోథెరపీ క్లినిక్ సెంటర్‌ను స్థానిక శాసనసభ్యులు కాలె యాదయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీతో ఇలాంటి హెల్ వెల్ ఫిజియోథెరపీ క్లినిక్ సెంటర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

విశాలాంధ్ర - ఆమనగల్లు: అన్నదాతలు పస్తులుండరాధనే సంకల్పంతో వారికి అన్నదానం చేస్తున్నామని మార్కెట్ చైర్మన్ యాట గీతా నర్సింహ పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్లో ఏర్పాటు చేసిన రైతుల కోసం 16వ రోజు అన్నదానంలో బాగంగా మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నర్సింహ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మండల అధ్యక్షులు జగన్ మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి రైతులకి, రైతు కూలీలకు, హమాలీలకు, మున్సిపల్ పారిశ్రామిక మహిళలకు అన్నప్రసాధాన్ని వడ్డిం చారు. సుదూర ప్రాంతాల నుంచి మార్కెట్లోకి రైతు సోదరులు పండించిన ధాన్య ఉత్పత్తులను అమ్ముకునేందుకు వచ్చిన రైతులు అవస్థలు పడకూడదని అన్నదాతలకు అన్నం వసతి ఏర్పాటు చేశామని, నేటితో 16 రోజులుగా సొంత డబ్బులతో రైతులకి అన్నదానం చేస్తున్నామని మార్కెట్ చైర్మన్ యాట గీతా నర్సింహ అన్నారు. రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని, దేశంలో సన్నధాన్యానికి బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఎన్ఎస్యు ఐ రాష్ట్ర కార్యదర్శి పరీద్, శాబుద్దీన్ మార్కెట్ కమిటి సిబ్బంది కిరణ్,రాములు, శరత్, వినోద్, మీడియా కన్వీనర్ కొప్పు విజేందర్, ఎండీ గౌస్ పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని సహించేది లేదు

ప్రపంచానికి మన సందేశమిదే: మిస్రీ

మూడు ప్రతినిధి బృందాలకు దిశానిర్దేశం

న్యూదిల్లీ: ఉగ్రవాదాన్ని, దానిని పెంచిపోషించే ప్రభుత్వాలను సహించేది లేదన్న స్పష్టమైన సందేశం ప్రపంచానికి ఇవ్వాలని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పిలుపునిచ్చారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్య చర్యలపై వివరణ, ఉగ్రవాదంపై భారత్ వైఖరిని తెలిపేందుకు విదేశాలకు వెళ్లబోయే ఏడు ప్రతినిధి బృందాల్లో మూడింటికి ఆయన మంగళవారం దిశానిర్దేశం చేశారు. విదేశీ దౌత్యవేత్తలు, నాయకులతో చర్చించాల్సిన అంశాలపై డీఎంకే నేత కనిమొళి, జేడీయూ నేత సంజయ్ ఝా, శివసేన నేత శ్రీకాంత్ షిండే నాయకత్వంలోని బృందాలకు మార్గదర్శకం అందించారు. 'భారత గడ్డపై ఎలాంటి ఉగ్రదాడిని ఉపేక్షించబోం. ఇక చాలు... మా సహనం నశించింది. ఉగ్రదాడులకు దీటుగా బదులిస్తాం. అణ్వస్త్రాల పేరిట బ్లాక్‌మెయిల్ చేస్తే ఊరుకోం. ఉగ్రవాదులకు, వారి నాయకులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ప్రభుత్వాలకు మధ్య తేడా చూపబోం' అని మిస్రీ అన్నారు. భారత సైనిక స్థావరాలు, పౌర క్షేత్రాలపై పాకిస్థాన్ దాడులకు భారత్ ప్రతిఘటించిందని, పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై లక్షిత దాడులు చేసిందన్నారు. కాగా, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ యూసుఫ్ పఠాన్‌కు బదులుగా చివరి నిమిషంలో ప్రతినిధిగా ఎంపికైన అభిషేక్ బెనర్జీ ఈ సమావేశానికి హాజరయ్యారు. సంజయ్ ఝా బృందంలో ఆయన ఉన్నారు. అమెరికా, జపాన్, గల్ఫ్ దేశాలతో పాటు ప్రపంచంలోని ప్రధాన నగరాల్లో ప్రతినిధులు పర్యటిస్తారు.

విశాఖ ఉక్కును కాపాడుకోకుంటే

చంద్రబాబును ప్రజలు నమ్మరు

కార్మికుల సమ్మెకు మద్దతు: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోకుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా రాష్ట్ర ప్రజలు నమ్మబోరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు కార్మికులు సుదీర్ఘ ఆందోళన తరువాత సమ్మెలోకి వెళ్లే పరిస్థితిని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం, సాధించామని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పుకున్నారని తెలిపారు. ఇచ్చిన రూ.11 వేల కోట్ల ప్యాకేజీలో రకరకాల పద్ధతుల ద్వారా రూ.9 వేల కోట్లు వెనక్కి లాక్కున్నదని వివరించారు. ఎనిమిది నెలలుగా విశాఖ ఉక్కు కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, దాదాపు 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, మరో 2,600 మందిని తొలగించాలని చూస్తున్నారని, 1,400 మంది కార్మికులకు వీఆర్ఎస్ ఇచ్చారని ఆయన వివరించారు. వీటన్నింటినీ చూస్తే ఏదేమైనాసరే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు గోచరిస్తున్నదన్నారు. విశాఖ స్టీల్ అంశంపై సీఎం చంద్రబాబు పట్టించుకోకపోవడం విచారకరమని రామకృష్ణ పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారుగా చెప్పుకుంటున్న ప్రభుత్వాలు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ఏమాత్రం ఉపయోగపడడం లేదన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిసారీ అమరావతి, పోలవరం గురించే మాట్లాడుతున్నారేగానీ... పదేళ్లలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ గురించి ఒక్కసారీ మాట్లాడలేదన్నారు. పైగా ప్రైవేటు వారికి ఉచితంగా భూములిస్తామని, కరెంటు, నీళ్లిస్తామని ఊదరగొడుతున్నారని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని చెబుతున్నారని, మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సహకరిస్తున్నారని అన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేస్తుంటే నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గం అని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోకుండా ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడును ప్రజలు నమ్మరుగాక నమ్మబోరని తెలిపారు. విశాఖ ఉక్కు కార్మికుల సమ్మెను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి, సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటుపరం కాకుండా చర్యలు చేపట్టాలని, విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా ఈనెల 21న విజయవాడ నగరంలో వామపక్షాల అధ్వర్యంలో నిర్వహించనున్న సంఘీభావ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాజీ అణుశాస్త్రవేత్త ఎంఆర్ శ్రీనివాసన్ కన్నుమూత



ఉదగమండళం: మాజీ అణు శాస్త్రవేత్త, అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ మాలూరు రామస్వామి శ్రీనివాసన్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. స్వదేశీ అణ్వాయుధ కార్యక్రమ రూపకల్పనలో డాక్టర్ హోమీ బాబాతో కలిసి శ్రీనివాసన్ పనిచేశారు. ప్రతిష్ఠాత్మక పద్మవిభూషన్ పౌర పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల స్టాలిన్ ప్రభుత్వం నివాళి అర్పించింది. తమిళనాడులోని ఉదగమండళం జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య తన్నీరు పుష్పాంజలి ఘటించారు. ఎంఆర్ శ్రీనివాసన్... బెంగుళూరులో జనవరి 5, 1930లో జన్మించారు. సైన్స్ సబ్జెక్టులో మైసూరు నుంచి ఇంటర్ చదివారు. సంస్కృతం, ఇంగ్లీష్ భాషలు ఎంచుకున్నారు. ఫిజిక్స్ ఆయనకు ఇష్టమైన సబ్జెక్ట్. 1950లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. ఎం.విశ్వేశ్వరయ్య ఈయనతోనే కలిసి చదివారు. 1952లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. కెనడాలోని మాంట్రియల్‌లో ఉన్న మెక్‌గిల్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పూర్తి చేశారు. గ్యాస్ టర్బైన్ టెక్నాలజీలో స్పెషలైజేషన్ చేశాడు. 1955లో ఆయన డీఏఈలో చేరాడు. తొలి అటామిక్ పవర్ స్టేషన్ నిర్మాణానికి 1959 ఆగస్టులో డాక్టర్ శ్రీనివాసన్‌ను ప్రిన్సిపల్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా నియమించారు. దేశ అణ్వాయుధ కార్యక్రమాల రూపకల్పన అతని నాయకత్వంలో సాగింది. మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్‌కు 1967లో చీఫ్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా చేరారు. 1984లో న్యూక్లియర్ పవర్ బోర్డు చైర్మన్ అయ్యారు. దేశవ్యాప్తంగా నెలకొల్పిన న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టుల ప్లానింగ్, ఆపరేషన్స్ అన్నీ చూసుకున్నారు. 1987లో అటామిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్‌గా, అణు ఇంధన శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1984లో పద్మశ్రీ, 1990లో పద్మభూషణ్, 2015లో పద్మ విభూషణ్ అందుకున్నారు. వియన్నాలోని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి 1990 నుంచి 1992 వరకు సీనియర్ అడ్వైజర్‌గా ఉన్నారు. 1996 నుంచి 1998 వరకు భారత ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా ఉన్నారు. 2002 నుంచి 2004 వరకు నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా ఉన్నారు.

నాలా చట్టం రద్దుపై చర్చించాం

మంత్రి అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇక నుంచి భూములను 22ఏలో పెట్టాలంటే ఒక విధానాన్ని రూపొందించామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నాలా చట్టం రద్దుపై కూలంకుషంగా చర్చించామన్నారు. సీఎం చంద్రబాబు అనుమతి తర్వాతే చట్టం అమల్లోకి వస్తుందని చెప్పారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన భూపరిపాలనలో సంస్కరణలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం భేటీ అయింది. మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, టీజే భరత్ హాజరయ్యారు. ఫ్రీ హోల్డ్ భూములు, 22ఏ నుంచి భూముల తొలగింపు, నాలా రద్దు, సాదాబైనామాలపై చర్చించారు. ఫ్రీ హోల్డ్ భూములను 10 విభాగాలుగా విభజించగా, వాటిలో ఎనిమిదింటిని మంత్రివర్గ ఉపసంఘం ఆమోదించింది. దాదాపు మూడు లక్షల ఎకరాల భూములు నిబంధలకు విరుద్ధంగా గత ప్రభుత్వం తన అనుయాయులకు ఫ్రీహోల్డ్ చేసింది. మంత్రి మాట్లాడుతూ 'ఈ భూములపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వాటిపై సీఎంతో చర్చించి నిర్ణయిస్తాం. చట్టవిరుద్ధంగా పేదల భూములను ఫ్రీ హోల్డ్ చేస్తే వాటిని తిరిగి లాక్కోవడం జరగదు. అలాంటి పేదలకు ఆ భూములను మళ్లీ అసైన్ చేస్తాం. 20 ఏళ్ల తర్వాతనే ఆ భూములు ఫ్రీ హోల్డ్ చేస్తాం' అని వెల్లడించారు. 22ఏ నుంచి భూముల తొలగింపుకు ఇచ్చిన మార్గదర్శకాల మేరకు కలెక్టర్లు పని చేస్తున్నారా? లేదా ? అనే అంశం కూడా చర్చకు వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా కొన్ని భూములను 22ఏలో పెట్టారని, కొన్నింటిని అనుయాయుల కోసం 22ఏ నుంచి తొలగించారన్నారు.

లోకనాథ్ చౌదరి జీవితం ఆదర్శం

శత జయంత్యుత్సవంలో వక్తలు

భువనేశ్వర్: కమ్యూనిస్టు సీనియర్ నేత లోకనాథ్ చౌదరికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అరుణాంజలి ఘటించింది. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో లోకనాథ్ చౌదరి శతజయంత్యు త్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ 'మన రాజ్యాంగం ఏ మేరకు సమాఖ్యంగా ఉంది' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. సీపీఐ కార్యదర్శి, లోక్‌నాథ్ మెమోరియల్ ట్రస్ట్ (లోక్మత్) మేనేజింగ్ ట్రస్టీ రామకృష్ణా పాండా ప్రారంభోపన్యాయం చేశారు. లోకనాథ్ చౌదరి జీవితం ఆటుపోట్లు, పోరాటాల నడుమ సాగిందని గుర్తుచేశారు. ఆయన ఆదర్శప్రాయుడని శ్లాఘించారు. ఈ సభకు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి నిరంజన్ పట్నాయక్ అధ్యక్షత వహించారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు ఆశీష్ కనుంగో, సురేశ్ పానిగ్రాహి, లోక్మత్ ట్రస్ట్ సభ్యులు, లోకనాథ్ చౌదరి కుమార్తె సంజుక్త జెనాతో పాటు వివిధ పార్టీల నాయకులు, బ్యూరోక్రాట్లు, జర్నలిస్టులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిమాన నాయకుడికి నివాళులర్పించారు.

14 వేల మంది చిన్నారులకు మరణగండం: ఐరాస

ఐరాస: ఇజ్రాయిల్ భీకర దాడులతో గాజాలో పరిస్థితులు పూర్తిగా మారాయి. అక్కడి ప్రజల జీవనం ప్రశ్నార్థంగా మారింది. ఇప్పటికే గాజాను అన్ని వైపులా నిర్బంధించిన ఇజ్రాయిల్ పరిమిత స్థాయిలో మాత్రమే మానవతా సాయానికి అనుమతిస్తోంది. దీంతో ఆ ప్రాంతంలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఈ పరిస్థితిపై స్పందించిన ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మానవతా సాయం ఇలాగే కొనసాగితే మరో 48 గంటల్లో 14 వేలమంది చిన్నారులు మరణించే అవకాశం ఉందని హెచ్చరించింది. 11 వారాల క్రితం పలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయిల్ నిర్బంధించింది. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, బ్రిటన్ ఒత్తిడి చేయడంతో పరిమిత స్థాయిలో గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయిల్ అనుమతిస్తోంది. 'చిన్నారులతో సహా గాజా వాసులకు ఇటీవల ఐదు ట్రక్కుల మానవతా సాయం మాత్రమే అందింది. అక్కడి పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. వారికి మరింత సాయం అవసరం. లేదంటే మరో 48 గంటల్లో 14 వేల మంది చిన్నారులు మృత్యువాత పడే అవకాశం లేకపోలేదు. అక్కడున్న చిన్నారులు, తల్లులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు' అని ఐరాస ప్రతినిధి టామ్ ఫ్లేచర్ హెచ్చరించారు. మానవతా సాయం విషయంలో ఇజ్రాయిల్ తీరును బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా తీవ్రంగా ఖండించాయి. గాజాకు మానవతా సాయంపై ఆంక్షలను వెనక్కి తీసుకోకపోతే తామంతా ఉమ్మడి చర్యలు తీసుకుంటామని హెచ్చరించాయి. తాజాగా ఇజ్రాయిల్ తీరుపై ఐరాస స్పందించింది. పోషకాహారంతో కూడిన 100 ట్రక్కుల మానవతా సాయాన్ని గాజాలోకి అనుమతించాలని, చిన్నారుల ప్రాణాలు రక్షించేందుకు ప్రయత్నించాలని కోరింది.

స్వర్ణదేవాలయంలోకి ఆయుధాలు

అమృత్‌సర్: అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుందని, అయితే, భారత సైన్యం దానిని సమర్థంగా తిప్పికొట్టిందని ఆర్మీ ఉన్నతాధికారులు ఇటీవల వెల్లడించారు. ఈ విషయంపై వైమానిక దళ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సుమర్ ఇవాన్ మాట్లాడుతూ దేశంలో అంతర్గత కలహాలు సృష్టించడానికి పాక్ ఇక్కడి ఆలయాలపై దాడులు చేస్తుందని తాము ఊహించామని అన్నారు. అనుకున్నట్లుగానే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయంపై దాడులకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయని అన్నారు. అమృత్‌సర్‌లోని పవిత్ర స్వర్ణ దేవాలయానికి ముప్పు పొంచి ఉందని తాము సమాచారం ఇవ్వగానే అక్కడి పెద్దలు తమకు పూర్తిగా సహకారం అందించారని పేర్కొన్నారు. ఆయుధాలు తీసుకెళ్లడానికి ఆ ఆలయ ప్రధాన గ్రంథి (గురుద్వార్ పర్యవేక్షకుడు) సైనికులకు ప్రత్యేక అనుమతి ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. 'దేవాలయంలోని ప్రధాన ప్రదేశాల్లో సైనికులు తుపాకులతో మోహరించడానికి మాకు అనుమతి ఇచ్చారు. అంతేకాకుండా ప్రయోగిస్తున్న క్షిపణులను గుర్తించడానికి వీలుగా స్వర్ణదేవాలయంలోని లైట్లు ఆపి వేయించారు. బహుశా ఎన్నో ఏళ్లుగా వెలుగు తున్న ఆ లైట్లు ఆపివేయడం ఇదే మొదటిసారి. అందుకు వారికి కృతజ్ఞతలు' అని లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నారు.

డార్క్ వెబ్‌లో విద్యార్థికి అకౌంట్లు

ముంబై: భారత ప్రభుత్వం పాక్‌లోని ఉగ్రవాదులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను, కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేసిన కేరళకు చెందిన విద్యార్థి రెజాజ్ ఎం షీబా సిద్ధిఖ్‌ను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అదుపులోకి తీసుకుంది. దర్యాప్తులో భాగంగా అతడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని, నిషిద్ధ డార్క్‌వెబ్‌సైట్లలో అకౌంట్లు ఉన్నాయని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. అతడు డార్క్‌వెబ్‌లో చురుగ్గా ఉన్నాడని, అందులో దేశవ్యతిరేక పోస్టులు అనుసరిస్తూ... వాటికి మద్దతు పలుకుతున్నట్లు గుర్తించామని అన్నారు. రెజాజ్‌కు పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థలలో సభ్యత్వం కూడా ఉన్నట్లు తెలిపారు. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి అతడి వద్ద ఉన్న డిజిటల్ పరికరాలను సైబర్-ఫోరెన్సిక్ ప్రయోగశాలలకు పంపినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అతడు చేసిన పోస్టులలో నాగపూర్‌లోని ఒక రైఫిల్ దుకాణాన్ని సందర్శించి... తుపాకీ పట్టుకొని తీసుకున్న ఫొటోలు ఉండడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పేర్కొన్నారు. అతడికి ఇంకా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయనే విషయాలు తెలుసుకోవడానికి సోషల్ మీడియా అకౌంట్లు తనిఖీ చేస్తున్నామని అన్నారు. కాగా, డార్క్ వెబ్‌లో కంటెంట్ మొత్తం ఎన్‌క్రిప్ట్ చేస్తారు. దాన్ని వాడాలంటే ప్రత్యేక బ్రౌజర్లు వినియోగించాలి. ద ఆనియన్ రింగ్ (టార్), ఫ్రీ నెట్, ఇన్‌విజబుల్ ఇంటర్నెట్ ప్రాజెక్ట్, ద అమీజిక్ ఇన్‌కాగ్నిటో లైవ్ సిస్టమ్ (టెయిల్స్), వోనిక్స్ అందుకు ఉదాహరణలు. డార్క్ వెబ్‌ను తొలినాళ్లలో గోప్యత కోసం రూపొందించినా... తర్వాత అక్రమార్కులు దాన్ని తమకు అడ్డాగా మలుచుకుంటున్నారు.

ఇస్కఫ్ జాతీయ కార్యదర్శి సుకుమారన్ మృతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇస్కఫ్ జాతీయ కార్యదర్శి టీఎస్ సుకుమారన్(77) మంగళవారం రాత్రి విశాఖపట్నం లాసెన్సు బే కాలనీలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అభ్యుదయ వాదిగా, సాహిత్యవాదిగా, ప్రజాతంత్ర హక్కుల కోసం గళమెత్తిన సుకుమారన్ అకాల మరణం సాహిత్యకారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

రైతుకు అండగా కూటమి ప్రభుత్వం

మంత్రుల బృందం పునరుద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని మంత్రుల బృంద సభ్యులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్ పునరుద్ఘాటించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల బృంద సమావేశం మంగళవారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. నిత్యావసర వస్తువుల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షించి, వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రుల బృందం నిర్ణయించింది. దేశ సగటు ద్రవ్యోల్బణం 3.16 కాగా... రాష్ట్ర ద్రవ్యోల్బణం 2.59 గా నమోదయిందని ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపింది. సరుకు రవాణాలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా గుంటూరు మార్కెట్ యార్డ్, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులను పరిశీలించాలని రవాణా శాఖ అధికారులను బృందం ఆదేశించింది. బియ్యం, కందిపప్పు, వంట నూనె, టమాటా, ఉల్లిపాయల ధరలు స్థిరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలపై రోజువారీ నివేదికను తయారు చేసి, ప్రతి మంత్రివర్గ సమావేశానికి ఒక రోజు ముందుగా అందించాలని అధికారులకు సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా ధరల పర్యవేక్షణను మెరుగుపరిచేందుకు 'అగ్రివాచ్' ద్వారా పరిశీలిస్తారు. వరిపై మార్కెట్ రుసుమును తగ్గించే ప్రతిపాదనపై దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాన్ని అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. బహిరంగ మార్కెట్‌లో ఎగుమతులు ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని, వ్యవసాయ అధికారులు పంట నమోదుపై అంచనాలు, రైతు సేవ కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించింది. వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలకు పంట దిగుబడి మధ్య వ్యత్యాసం లేకుండా వాస్తవ పరిస్థితులు అనుకూలంగా అంచనాలు రూపొందించాలని సూచించింది. సన్న రకం ధాన్యం ఎక్కువగా పండించేలా రైతులను ప్రోత్సహించాలని, దానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించింది.

వర్షాల వేళ సర్కారు అప్రమత్తం

అధికారులకు మంత్రి అనిత కీలక ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా మరో రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా ఏపీవ్యాప్తంగా వర్షాలు పడతాయని పేర్కొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పిడుగులు, వరదలపై ప్రజలకు, రైతులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టాలని, అక్కడి ప్రజలకు ఏ కష్టం రాకుండా చూడాలని మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కర్నూలు జిల్లాలో తుంగభద్ర, వేదావతి నదుల ఉధృతి దృష్ట్యా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రాగల రెండు రోజుల్లో ఉత్తరాంధ్రతో పాటు తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, విపత్తు, విద్యుత్, రోడ్లు, భవనాల శాఖల జిల్లాల అధికారాలతో మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో విపత్తు నిర్వహణ శాఖకు తగు మార్గదర్శకాలు అందించారు. పిడుగులు, ఉరుములు, వరదలు, ఈదురుగాలుల సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు సందేశాలు, ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్స్ ద్వారా అందజేసి ఆయా ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాలన్నారు. గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రమాదాలకు తావు లేకుండా విద్యుత్ సరఫరాను ముందుగానే నిలిపివేయాలని మంత్రి ఆదేశించారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ అనుకున్న సమయానికంటే ముందుగానే కేరళను తాకే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని అందరు అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

మంత్రి లోకేశ్ 'షైనింగ్ స్టార్ల'కు అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనేక సవాళ్లు ఉన్నప్పటికీ విద్యా శాఖలో సంస్కరణలు చేపడుతున్నామని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పు తేవాలని పట్టుదలతో ఉన్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్ర సంస్కరణలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఏపీ మోడల్ విద్య విషయంలో పట్టుదలతో ముందుకెళుతున్నామని చెప్పారు. లోకేశ్ మంగళవారం ఉండవల్లి నివాసంలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 47 మందికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి రచయితలు బిల్ గేట్స్ (సోర్స్ కోడ్), రతన్ టాటా ఏ లైఫ్ (థామస్ మాథ్యూస్), ఏపీజే అబ్దుల్ కలాం (వింగ్స్ ఆఫ్ ఫైర్), ఇంద్రానూయి (మై లైఫ్ ఇన్ ఫుల్), శరణి పొంగూరు (మైండ్ సెట్ షిఫ్ట్), జాన్ క్లియర్ (అటమిక్ హ్యాబిట్స్), యండమూరి వీరేంద్రనాథ్ (విజయానికి 5 మెట్లు), గుంటూరు శేషేంద్రశర్మ (ఆధునిక మహాభారతం), చాగంటి కోటేశ్వరరావు (వినదగునెవ్వరు చెప్పిన) రాసిన పుస్తకాలు, గిఫ్ట్ హ్యాంపర్, శాలువా, మెడళ్లు బహుకరించారు. ఈ విద్యార్థుల కనబర్చిన ప్రతిభతో ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్లు అని ఈ విద్యార్థులనుద్దేశించి మాత్రం అన్నారు. ప్రైవేటు స్కూళ్ల మాదిరి ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ బడులపై పత్రికా ప్రకటనలను వచ్చే ఏడాది నుంచి ఇస్తామని లోకేశ్ తెలిపారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు ఉండాలన్నదే లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని లోకేశ్ హామీనిచ్చారు. విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ, ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను చూడటానికి రెండు కళ్లు చాలడం లేదన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని డ్రీమ్ వాల్‌పై వివరించారు. ఐఏఎస్ అయి దేశానికి, రాష్ట్రానికి సేవ చేస్తామని చంద్రకళ, సమీర, సుచరిత, అక్షిత, సాయిరామ్, కీర్తిక వెల్లడించగా, ఏరోనాటికల్ ఇంజీనీర్ కావాలని ఉందని అనంతపురానికి చెందిన లక్ష్మీనరసింహారెడ్డి పేర్కొన్నారు. డేటా సైంటిస్ట్ అవుతానని తిరుపతికి చెందిన అనీశ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతానని దాక్షిణ్య (అనంతపురం), దివ్యశ్రీ (బాపట్ల) వెల్లడించారు. డాక్టర్ అయి పేదలకు సేవ చేస్తామని హర్షిత (శ్రీకాకుళం), ఆశాజ్యోతి (అనకాపల్లి), ఐటీ అధికారి అవుతానని సంతోశ్ (చీరాల) పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్య డైరక్టర్ విజయరామరాజు, సర్వశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు ఏపీడీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహానాడుకు 19 కమిటీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కడప వేదికగా ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరగబోయే మహానాడు కోసం 19 కమిటీలను టీడీపీ ఏర్పాటు చేసింది. ఒక్కో కమిటీలో 10 నుంచి 20 మందిని నియమించింది. కమిటీల వివరాలను పార్టీ మంగళవారం విడుదల చేసింది. ఆహ్వాన కమిటీ కన్వీనర్లుగా పల్లా శ్రీనివాసరావు, బక్కనీ నరసింహులు, సమన్వయ కమిటీ కన్వీనర్‌గా నారా లోకేశ్, తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా యనమల రామకృష్ణుడు, వసతి ఏర్పాట్ల కన్వీనర్‌గా కింజరాపు అచ్చెన్నానాయుడు, సభా నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా కింజరాపు రామ్మోహన్ నాయుడు, భోజనాలు కమిటీ కన్వీనర్‌గా బీసీ జనార్దన్ రెడ్డి, మీడియా కమిటీ కన్వీనర్‌గా ఎన్ఎండీ ఫరూక్, ఆర్థిక వనరుల కమిటీ కన్వీనర్‌గా అనగాని సత్యప్రసాద్, సాంస్కృతిక శాఖ కార్యక్రమాల కమిటీ కన్వీనర్‌గా కొండపల్లి శ్రీనివాస్, ఫొటో ప్రదర్శన కమిటీ కన్వీనర్‌గా ఆనం రామనారాయణ రెడ్డి, ప్రతినిధుల నమోదు కమిటీ కన్వీనర్‌గా చింతకాయల విజయ్, సభా ప్రాంగణ పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా నిమ్మల రామానాయుడు, అలంకరణ కమిటీ కన్వీనర్‌గా పులివర్తి నాని, రవాణా కమిటీ కన్వీనర్‌గా పొంగూరు నారాయణ, వాహన పార్కింగ్ కన్వీనర్‌గా మంతెన రామరాజు, మెడికల్ క్యాంప్ కన్వీనర్‌గా డోలా బాల వీరాంజనేయ స్వామి, వలంటీర్ల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా కొల్లు రవీంద్ర, జన సమీకరణ కమిటీ కన్వీనర్‌గా గొట్టిపాటి రవికుమార్, సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ కన్వీనర్‌గా వాసంశెట్టి సుభాశ్ వ్యవహరిస్తారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.